అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

గురువారం 15-08-2024

సమగ్ర తెలుగు దినపత్రిక



సంపుటి : 10 | సంచిక : 177 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50



ఫార్మాతో హైదరాబాద్‌కు పెను ప్రమాదం

అభివృద్ధి పేరుతో కమ్మేస్తున్న కాలుష్యం

- నివారణ చర్యలు చేపట్టాలి : 'ఒక విధ్వంసం' పుస్తకావిష్కరణ సభలో వక్తలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఫార్మా కంపెనీలతో హైదరాబాద్ నగరానికి పెను ప్రమాదం పొంచి ఉందని పలువురు వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. సీనియర్ జర్నలిస్ట్ చంద్రశేఖర శర్మ రాసిన "ఒక విధ్వంసం 1056/90" పుస్తకావిష్కరణ సభను బుధవారం హైదరాబాద్‌లోని ఓ హొటల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ అభివృద్ధి పేరుతో మనిషి సృష్టిస్తున్న విధ్వంసం పర్యావరణానికి పెను సవాలుగా మారిందని పేర్కొన్నారు. పటాన్‌చెరు కాలుష్య వ్యతిరేక పోరాట ఘటనలు, సుప్రీంకోర్టు కేసు పరిణామాలను గ్రంథస్థం చేస్తూ తీసుకొచ్చిన ఈ పుస్తకం హైదరాబాద్ భవిష్యత్‌ను ప్రశ్నిస్తున్నదని పేర్కొన్నారు. కాలుష్య సమస్య పటాన్‌చెరు, ఖాజిపల్లిది మాత్రమే కాదనీ, మొత్తం నగరాన్ని ఈ భూతం చుట్టి ముట్టిందన్నారు. ఇదే చివరి తరమనే విధంగా మనిషి అన్ని వనరులను తవ్వేస్తూ ప్రకృతిని బొందల గడ్డగా మారుస్తున్నాడని విశ్లేషించారు. జీడీపీ, అభివృద్ధి అంటూ ప్రభుత్వాలు వినాశకర విధానాలను ప్రోత్సహిస్తున్నాయని పేర్కొన్నారు. గత సర్కార్ హయాంలో అప్పటి మంత్రి కేటీఆర్ లాగే ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పెట్టుబడుల పేరిట దావోస్, ఇతర యూరప్ దేశాలకు వెళ్లి అదే ఫార్మా కంపెనీలను తీసుకొస్తున్నారని విమర్శించారు. అమెరికా లాంటి దేశాలు ఇలాంటి కంపెనీలకు అనుమతులు ఇవ్వక పోవడంతో అవి హైదరాబాద్ నగరాన్ని ఎంచుకున్నాయని పేర్కొన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాలు తమ దేశంలో కాలుష్యం వెదజల్లే ఔషధాలను ఉత్పత్తి చేయకుండా భారత్ లాంటి దేశాల నుంచి దిగుమతి చేసుకుంటూ రోగాలను మనకంటగడుతున్నాయని వ్యాఖ్యానించారు. మందుల కంపెనీలు మనుషులను చంపే కంపెనీలుగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు.

గత మూడు దశాబ్దాలుగా పటాన్‌చెరు ప్రాంత ప్రజలు కాలుష్యానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నా, నగర ప్రజలు తమకేమి పట్టనట్టు వ్యవహరించడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా పౌర సమాజం ఈ మహమ్మారికి వ్యతిరేకంగా నినదించాలని పిలుపునిచ్చారు. ఆంధ్ర జ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ సామాజిక ఉద్యమాలకు వచ్చినంత స్పందన పర్యావరణ ఉద్యమాలకు రావడం లేదని అన్నారు. ప్రజలు ప్రత్యక్షంగా తమదాకా వస్తేగాని నోరుమెదపని అచేతనావస్థలోకి జారి పోయారని వ్యాఖ్యానించారు. ఎవరైనా నిలదీస్తే వారిపై అభివృద్ధి నిరోధకులంటూ ముద్ర వేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రొఫెసర్ విజయ్ మాట్లాడుతూ ఫార్మా కెమికల్ కంపెనీలు వెదజలుతున్న కాలుష్యం మూసీ ద్వారా మొత్తం నగరాన్ని చుట్టిముట్టిందని అన్నారు. మూసీ కాలుష్యంపై స్వీడిష్ శాస్త్రవేత్తలు చేసిన పరిశోధనల్లో భయంకరమైన నిజాలు బయటపడ్డాయని పేర్కొన్నారు. మనుషుల రోగాలకు కారకమయ్యే బ్యాక్టీరియా మూసీ రసాయనాలతో సహవాసం చేసి రోగనిరోధక శక్తిని పెంచుకుందని వెల్లడైందని వివరించారు. దీంతో భవిష్యత్‌లో రోగాలు ఎలాంటి మందులకు కూడా లొంగని పరిస్థితి రావచ్చని హెచ్చరించారు. పర్యావరణ శాస్త్రవేత్త బాబురావు మాట్లాడుతూ నగరంలో కాలుష్యం వెదజల్లే కంపెనీలపై చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. బాధితులు ఫిర్యాదులు చేసిన సందర్భంలో నామ మాత్రంగా కేసులు నమోదు చేసి చిన్న పాటి పెనాల్టీలతో సరి పెడుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సరస్వతి కవుల, సుధా తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) నుంచి ఆర్.రఘు బహిష్కరణ

పార్టీ రాజకీయ విధానం, పార్టీ కార్యక్రమంపై విభేదాలు ఉన్నాయనే నెపంతో పార్టీ విచ్ఛిన్నకర కార్యకలాపాలకు పాల్పడుతున్న ఆర్.రఘును పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి కృష్ణా జిల్లా కమిటీ బహిష్కరించింది. గతంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా, జిల్లా కార్యదర్శిగాను ఉన్న పరిచయాలను ఉపయోగించుకుని పార్టీని నష్టపరిచే చర్యలకు ఆయన పాల్పడుతున్నారు.ఆయన లేవనెత్తిన విషయాలను పార్టీ ఆయనతో చర్చించి సరిదిద్దేందుకు పలు ప్రయత్నాలు చేసింది. వాటిని సరిదిద్దుకోకపోగా పార్టీ విచ్ఛిన్న కార్యకలాపాలు తీవ్రతరం చేసినందున పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి బహిష్కరించాలని ఈ రోజు (14 ఆగష్టు) ఉయ్యూరులో జరిగిన కృష్ణా జిల్లా కమిటీ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది.ఈ సమావేశానికి పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు యం.ఎ. గఫూర్, ఏపీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు హాజరయ్యారు.

25 కంపెనీలతో ఒప్పందాలు.. రూ.36 వేల కోట్ల పెట్టుబడులు...

- సీఎం రేవంత్ విదేశీ పర్యటన జయప్రదం
- ప్రపంచం దృష్టిని ఆకర్షించేలా ప్రణాళికలు రూపొందించామన్న ప్రభుత్వం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించటమే లక్ష్యంగా సాగిన ముఖ్యమంత్రి రేవంత్ విదేశీ పర్యటన జయప్రదమైంది. గతంలో ఎన్నడూ లేనంతగా తెలంగాణకు పెట్టుబడులు భారీగా వెల్లువెత్తాయని ప్రభుత్వం ఈ సందర్భంగా వెల్లడించింది. రేవంత్ బృందం మొత్తం 25 కంపెనీలతో ఒప్పందాలు చేసుకోగా, రూ.36 వేల కోట్ల మేర పెట్టుబడులు వచ్చాయని ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) తెలిపింది. రేవంత్ అమెరికా పర్యటనలో రూ.31,502 కోట్ల పెట్టుబడులు రాగా.. చివరి రెండు రోజుల దక్షిణ కొరియా పర్యటనలోనూ అదే రకమైన స్పందన వచ్చింది. దక్షిణ కొరియాకు చెందిన ప్రపంచస్థాయి కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చాయి. రూ.4,500 కోట్ల పెట్టుబడులకు అక్కడి కంపెనీలు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకున్నాయి. దీంతో అమెరికా, దక్షిణ కొరియా పర్యటనల్లో కలిపి మొత్తం రూ.36 వేల కోట్ల పెట్టుబడులను తెలంగాణ సాధించింది. ఫలితంగా ఆయా రంగాల్లో కొత్త సంస్థలు, కొత్త పరిశ్రమలతో వేలాది కొత్త ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి.

కాగా సీఎం రేవంత్ గత జనవరిలో దావోస్‌లో నిర్వహించిన వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ వార్షిక సదస్సులో సైతం పాల్గొన్న సంగతి తెలిసిందే. ఆ సందర్భంగా చేసుకున్న ఒప్పందాలతో రాష్ట్రంలో రూ.40,232 కోట్ల పెట్టుబడులకు పలు కంపెనీలు తమ సంసిద్ధతను వ్యక్తం చేశాయి. తాజాగా అమెరికా, దక్షిణ కొరియా పర్యటనలతో మరో రూ.36 వేల కోట్ల ఒప్పందాలు జరిగాయి. దీంతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల్లోనే రూ.76,232 కోట్ల పెట్టుబడుల లక్ష్యాన్ని చేరుకున్న ప్రభుత్వం సరికొత్త రికార్డును నమోదు చేసింది. తద్వారా దేశంలోనే పెట్టుబడులకు గమ్యస్థానంగా మారిన తెలంగాణ అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది.

కంపెనీలకు సీఎం భరోసా...

దక్షిణ కొరియాలో రెండు రోజుల పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి బృందం ప్రధానంగా ఆటోమోటివ్, ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్, ఇంధన స్టోరేజీ, టెక్స్‌టైల్ రంగాలపై దృష్టి సారించింది. ఆయా రంగాల్లో దక్షిణ కొరియాకు ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ సందర్భంగా పలు కంపెనీలతో సీఎంతోపాటు పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చర్చలు, సంప్రదింపులు జరిపారు. తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అనుకూలతలను వివరించి, రాష్ట్ర ప్రభుత్వంతో భాగస్వామ్యం పంచుకోవాలని ఆహ్వానించారు. తెలంగాణలో పెట్టుబడులకు ముందుకొచ్చే కంపెనీలకు తమ ప్రభుత్వం తగిన సహకారం అందిస్తుందని భరోసానిచ్చారు. దీంతో అమెరికన్ కంపెనీల తరహాలోనే కొరియన్ కంపెనీల నుంచి భారీ స్పందన లభించింది.

గ్లోబల్ హబ్‌గా హైదరాబాద్

సీఎం చర్చలతో హ్యుందాయ్ మోటార్స్ తెలంగాణలో మెగా ఆటోమోటివ్ పరీక్షా కేంద్రం ఏర్పాటుకు ఒప్పందం చేసుకుంది. తమ కంపెనీ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయటం ద్వారా గ్లోబల్ హబ్‌గా ఎంచుకుంటామని ప్రకటించింది. కొత్త టెస్టింగ్ వాహనాలను తయారు చేసే సదుపాయం తెలంగాణలో అందుబాటులో ఉంటుందంటూ ఆ సంస్థ సంతృప్తిని వ్యక్తం చేసింది.

ఫ్యాషన్ సిటీకి పదెకరాల కేటాయింపు

వరంగల్ మెగా టెక్స్‌టైల్ పార్కులో వస్త్ర తయారీ పరిశ్రమలను నెలకొల్పుతున్న యంగ్‌వన్ కంపెనీ హైదరాబాద్‌లో ఫ్యాషన్ సిటీని ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. అందుకు అవసరమయ్యే పదెకరాల స్థలాన్ని శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు సమీపంలో కేటాయిస్తామని ముఖ్యమంత్రి హామీనిచ్చారు. ఈ మేరకు ప్రభుత్వం తరఫున సమ్మతిని తెలుపుతూ ఆయన ఒక లేఖను యంగ్‌వన్ కంపెనీ చైర్మెన్‌కు అందజేశారు.

'కాస్మోటిక్స్'కు పరస్పర సహకారం

కాస్మోటిక్స్ ఇండస్ట్రీలో దక్షిణ కొరియాకు ప్రత్యేక స్థానముంది. ఆ రంగంలో పేరొందిన కంపెనీల పారిశ్రామికవేత్తలతో ముఖ్యమంత్రి అక్కడ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కాస్మోటిక్స్ తయారీ పరిశ్రమలు నెలకొల్పేందుకు వీలుగా పరస్పర సహకారాన్ని ఆయన కోరారు. తెలంగాణలో వీటి తయారీకి ఉన్న అవకాశాలు, సాధ్యాసాధ్యాలను అన్వేషించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కొరియన్ బ్యూటీ ఇండస్ట్రీ ట్రేడ్ అసోసియేషన్‌తో రాష్ట్ర ప్రభుత్వం అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది.

ఇతర కంపెనీల ప్రణాళికలు...

ఇదే సందర్భంగా మరో మూడు కొరియన్ కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు తమ ప్రణాళికలను ప్రకటించాయి. డాంగ్‌బాంగ్ ఫార్మా కంపెనీ రూ. 200 కోట్ల పెట్టుబడితో ఏపీఐ తయారీ కేంద్రాన్ని రాష్ట్రంలో నెలకొల్పుతామని ప్రకటించింది. జేఐ టెక్ కంపెనీ ఎల్ఈడీ మెటీరియల్ తయారీ ప్లాంట్‌తోపాటు రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ కేంద్రం ఏర్పాటుకు ముందుకొచ్చింది. రూ.100 కోట్ల పెట్టుబడులు పెడతామంటూ ఆ సంస్థ ప్రకటించింది. చావి కంపెనీ హైదరాబాద్‌లో ఈవీ ఛార్జింగ్ ఇన్‌ఫ్రాని ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించింది.

చర్చలు.. భవిష్యత్ ప్రణాళికలు...

ఎల్ఎస్ గ్రూప్, పోస్కో, ఎల్జీ, శ్యామ్‌సంగ్, సీ అండ్ టీ, శ్యామ్‌సంగ్ హెల్త్‌కేర్, క్రాఫ్టన్, యూయూ ఫార్మా, జీఎస్ కాల్టెక్స్ కంపెనీల ప్రతినిధులతోనూ ముఖ్యమంత్రి బృందం చర్చలు జరిపింది. భవిష్యత్ విస్తరణ ప్రణాళికలో భాగంగా తెలంగాణను పెట్టుబడులకు అనువైన గమ్యస్థానంగా ఎంచుకోవాలని సీఎం ఆయా కంపెనీల ప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు.

తమ పర్యటనలో భాగంగా కొరియాలోని చెంగియాచియోన్ స్ట్రీమ్ రీడెవలప్‌మెంట్, హన్ రివర్‌ఫ్రంట్ బ్యూటిఫికేషన్ ప్రాజెక్టులను ముఖ్యమంత్రి బృందం సందర్శించింది. అక్కడ అనుసరించిన కొన్ని అద్భుతమైన నమూనాలను సీఎం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కోసం వాటిని పరిగణనలోకి తీసుకోవాలని సీఎం నిర్ణయించారు. ఆయా ప్రాజెక్టుల అభివృద్ధికి అనుసరించిన విధానాలు, వాటిని నిర్వహిస్తున్న తీరును అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొరియన్ నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీని కూడా ముఖ్యమంత్రి సందర్శించారు. ఇటీవల నిర్వహించిన ఒలింపిక్స్‌లో విజేతలైన వారిలో ఎంతోమందిని ఆ వర్సిటీ తీర్చిదిద్దింది. మన రాష్ట్రంలోనూ అదే తరహాలో స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసేందుకు సీఎం యోచిస్తున్నారు.

విషజ్వరాల నివారణకు చర్యలు తీసుకోవాలి

- సీపీఐ(ఎం) మాజీ ఎమ్మెల్యే జూలకంటి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో విషజ్వరాల నివారణకు తక్షణమే చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత కొన్ని రోజులు వర్షాలు కురుస్తున్నాయని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని జిల్లాల్లో డెంగీ, మలేరియా వంటి విషజ్వరాలు విజృంభిస్తున్నాయని వివరించారు. ప్రభుత్వ, ప్రయివేటు ఆస్పత్రుల్లో రోగులు కిక్కిరిసిపోతున్నాయని పేర్కొన్నారు. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు అక్కడక్కడా మరణాలు కూడా సంభవిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరైన వైద్యం అందక ఏజెన్సీ, మారుమూల ప్రాంతాలు, మురికివాడల్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తగు ప్రాధాన్యతనిచ్చి అవసరమైన సిబ్బంది, మందులను అందించాలనీ, మొబైల్ టీమ్‌లను ఏర్పాటు చేసి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజల ఆరోగ్యాన్ని, ప్రాణాలను కాపాడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

గిరిజన శాఖకు మంత్రిని కేటాయించాలి

- సీఎం వద్ద ఉంటే సామాన్యులు కలిసేదెలా...
- చేవెళ్ల డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను అమలు చేయాలి
- రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణను ప్రకటించాలి... లేదంటే ప్రత్యక్ష పోరాటాలు చేపడతాం : తెలంగాణ గిరిజన సంఘం రౌండ్‌టేబుల్‌లో వక్తలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్ద గిరిజన శాఖ ఉంటే సామాన్యులు ఆయన్ను ఎలా కలవాలని పలువురు నాయకులు ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజన శాఖకు మంత్రి కేటాయించకపోవడం సామాజిక వివక్ష చూపడమేనని విమర్శించారు. తక్షణమే ఆ శాఖకు మంత్రిని కేటాయించాలని డిమాండ్ చేశారు. చేవెళ్ల డిక్లరేషన్‌లో ఎస్సీ,ఎస్టీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. అందుకోసం ప్రభుత్వం తగిన కార్యాచరణను ప్రకటించాలని సూచించారు. లేదంటే ప్రత్యక్ష పోరాటాలకు పూనుకుంటామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తెలంగాణ గిరిజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీరాం నాయక్ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులకు అనేక హామీలివ్వడం ద్వారా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. తొమ్మిది నెలలైనా గిరిజన శాఖకు మంత్రిని కేటాయించలేదని చెప్పారు. గిరిజన సలహా మండలిని ఏర్పాటు చేయలేదని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ నుంచి ఎస్టీ కమిషన్‌ను వేరు చేసి చైర్మెన్‌ను నియమించాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్ద గిరిజన శాఖ ఉండడంతో సమస్యలను చెప్పేందుకు అవకాశం లేకుండా పోయిందన్నారు. అంబేద్కర్ అభయహస్తం కింద గిరిజనులకు రూ.12 లక్షల ఆర్థిక సాయం చేయాలని కోరారు. మంత్రిని కేటాయించకుండా, సమస్యలను పరిష్కరించకుండా ఉంటే ప్రత్యక్ష పోరాటాలకు దిగుతామని హెచ్చరించారు. లంబాడి హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షులు మూడావత్ రాంబాల్ నాయక్, బీఆర్ఎస్ గిరిజన విభాగం సీనియర్ నాయకులు రూప్ సింగ్, సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షులు అంగోత్ రాంబాబు, ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు రాజేష్ నాయక్, గుగులోత్ భీమా నాయక్, తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం రాష్ట్ర నాయకులు కురాకుల శ్రీనివాస్, తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం ఉపాధ్యక్షులు పాతపల్లి నరసింహ, ప్రొఫెసర్ బాలా నాయక్, తెలంగాణ గిరిజన జన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు వినోద్ నాయక్, డాక్టర్ జి శంకర్, సోమలాల్ జాదవ్, సేవాలాల్ సేన నాయకులు రఘురాం రాథోడ్, మధు నాయక్ సేవాలాల్ సేన టీవీ మోహన్, గిరిజన సంస్కృతి ఎడిటర్ ఆర్ ధర్మానాయక్, గిరిజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి భూక్యా వీరభద్రం మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే గిరిజనులకు ఇచ్చిన హామీలను అమలు చేస్తామంటూ కాంగ్రెస్ ప్రకటించిందని గుర్తు చేశారు. చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్, మ్యానిఫెస్టోలో 16 రకాల వాగ్దానాలను కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే విడుదల చేశారని చెప్పారు. గిరిజనులకు ఇచ్చిన హామీలను ఎప్పుడు అమలు చేస్తారోనని ప్రజలు ఆశతో ఎదురు చూస్తున్నారని అన్నారు. అయితే కాంగ్రెస్ నేతలు మాత్రం ప్రజా ప్రభుత్వంలో గిరిజనులకు భాగస్వామ్యం లేకుండా వివక్ష చూపుతున్నారని విమర్శించారు. ఖమ్మం జిల్లా వైరాకు గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వస్తున్నారనీ, గిరిజన శాఖ మంత్రిని నియమిస్తామంటూ ఈ సందర్భంగా ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. గిరిజనులకు ఇచ్చిన హామీల అమలుకు నిర్దిష్ట కార్యాచరణ ప్రకటించాలని కోరారు. లేదంటే రాష్ట్రంలోని అన్ని గిరిజన, ఆదివాసీ సంఘాలతో ఐక్య కార్యాచరణ ఏర్పాటు చేసి ప్రత్యక్ష పోరాటాలను నిర్వహిస్తామని హెచ్చరించారు. తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం ధర్మనాయక్ అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆ సంఘం నాయకులు ఎం బాలు, రఘు, గోపి, రామ్ కుమార్, కృష్ణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



మహిళా సంఘాలు మరో అడుగు ముందుకెయ్యాలి

- మహిళా రక్షణలో సర్కారుకు చేయూతనివ్వాలి
- ఆర్థిక అభ్యున్నతిలో వాటి పాత్ర అమోఘం
- ఎగతాళి చేసేవారికి మహిళా సంఘాలే బుద్ధి చెప్పాలి
- స్త్రీనిధి భవన నిర్మాణానికి హైదరాబాద్‌లో స్థలం : స్త్రీనిధి సర్వసభ్య సమావేశంలో మంత్రి డాక్టర్ సీతక్క

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్/రాజేంద్రనగర్

ఆర్థిక భద్రతతో పాటు సామాజిక భద్రత కల్పించేలా మహిళా సంఘాలు మరో అడుగు ముందుకెయ్యాలనీ, మహిళా భద్రత కోసం ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాల్లో అవి కీలక పాత్ర పోషించాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క) పిలుపునిచ్చారు. బ్యాంకు మెట్లెక్కాలంటే భయపడే స్థాయి నుంచి బ్యాంకులకు, ప్రభుత్వ సంస్థలకు రుణాలిచ్చే స్థాయికి మహిళా సంఘాలు ఎదిగాయని కితాబిచ్చారు. స్త్రీనిధి భవన నిర్మాణం కోసం హైదరాబాద్‌లో స్థలం కేటాయించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందనీ, ఈ అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి తగు నిర్ణయం తీసుకుంటామని హామీనిచ్చారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో బుధవారం స్త్రీనిధి క్రెడిట్ కో ఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ 11వ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ..గతంలో ప్రయివేటు వడ్డీ వ్యాపారులు, మైక్రో ఫైనాన్స్ సంస్థల వద్ద అవసరాల కోసం అప్పులు చేసి మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారని గుర్తుచేశారు. వారికి ఆర్థిక భరోసా కల్పించేందుకు కొప్పుల రాజు వంటి ఉన్నతాధికారులు స్త్రీనిధి ఫెడరేషన్‌ను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. మైక్రోఫైనాన్స్ అప్పులు వద్దనీ, స్త్రీనిధి రుణాలు ముద్దని చెప్పారు. మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే సమాజం బాగుపడుతుందని ఆకాంక్షించారు. మహిళల ఆర్థిక ప్రగతే ఆ సమాజ ప్రగతి అని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చెప్పారని, ఆ మహనీయుడి ఆలోచనల్ని తమ ప్రభుత్వం ఆచరిస్తున్నదని తెలిపారు. తమ ప్రభుత్వం మహిళలకోసం రూ.500 కే గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణంవంటి ఎన్నో కార్యక్రమాలను అమలు చేస్తున్నదని చెప్పారు. ఉచిత బస్సు ప్రయాణాన్ని అవహేళన చేస్తూ కొందరు వీడియోలు రూపొందించి తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా సాధికారతను తట్టుకోలేకే ఆ స్కీంపై దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. మహిళలకు చేయూతగా నిలిస్తే ఎందుకంత అక్కసు వెళ్లగక్కుతున్నారని ఫైర్ అయ్యారు. మహిళా సంక్షేమ పథకాలను ఎగతాళి చేస్తున్న వారికి మహిళలే బుద్ధి చెప్పాలన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే లక్ష్యంతో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని హామీనిచ్చారు.

అమ్మ ఆదర్శ కమిటీలకు ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ బాధ్యతలు అప్పజెప్పిన తర్వాత పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపడ్డాయన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల యూనిఫామ్ కుట్టు పనులను మహిళా సంఘాలకు అప్పజెప్పామనీ, జత కుట్టు కూలీని రూ. 50 నుంచి రూ. 70 పెంచామని వివరించారు. మహిళా శక్తి క్యాంటీన్‌లను జిల్లాలకు విస్తరిస్తామని హామీనిచ్చారు. 17 రకాల వ్యాపారాల్లో మహిళా సంఘాలకు శిక్షణ ఇచ్చి వారిని మరింత ఆర్థికంగా బలోపేతం చేస్తామని భరోసానిచ్చారు. మహిళా సంఘాలకు రూ. 2 లక్షల రుణబీమా, రూ.10 లక్షల ప్రమాద బీమాను సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అమలు చేస్తోందని గుర్తు చేశారు. 63 లక్షల మంది మహిళా సభ్యులు అనుకుంటే కానిది లేదనీ, ఒక్కమాట మీద నిలిస్తే పెనుమార్పులు సాధ్యమని చెప్పారు. వరంగల్, దిశ ఎన్‌కౌంటర్లతో సమాజం మారలేదన్నారు. పాఠశాల గదుల నుంచే మార్పు మొదలయ్యేలా పాఠ్యాంశాలు భోదిస్తామన్నారు. మహిళల మీద నేరాలు జరుగకుండా ఉండేందుకు రాష్ట్రవ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ చేపడతామన్నారు. అందులో మహిళా సంఘాలు కీలక పాత్ర పోషించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేశ్ కుమార్, సెర్ప్ సీఈఓ దివ్యా దేవరాజన్, స్త్రీనిధి క్రెడిట్ కో ఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ అధ్యక్షులు జి.ఇందిర, మేనేజింగ్ డైరెక్టర్ విద్యాసాగర్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు, స్త్రీనిధి మహిళా సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలనుపరిష్కరించాలి

- ఉద్యోగులను తెలంగాణకు తెచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు : టీఎన్జీవో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జగదీశ్వర్, ముజీబ్
- హైదరాబాద్‌లో ముగిసిన ఏఐఎస్‌జీఈఎఫ్ సమావేశాలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్ డిమాండ్ చేశారు. త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించడం ద్వారా అవన్నీ పరిష్కారమయ్యేలా చూస్తామని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పనిచేస్తున్న 122 మంది తెలంగాణ ఉద్యోగులను వెనక్కి తీసుకొచ్చిన రేవంత్‌రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో ప్రారంభమైన అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య (ఏఐఎస్‌జీఈఎఫ్) జాతీయ కార్యవర్గ సమావేశాలు గురువారం ముగిశాయి. ఆ సంఘం అధ్యక్షులు సుభాష్ లాంబ, ప్రధాన కార్యదర్శి ఎ శ్రీకుమార్‌తోపాటు 24 రాష్ట్రాల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జగదీశ్వర్, ముజీబ్ మాట్లాడుతూ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ స్కీం (ఓపీఎస్)ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను విడుదల చేయాలని కోరారు. ఐదేండ్లకు ఒకసారి వేతన సవరణ జరగాలని సూచించారు. ఉద్యోగులు, పెన్షనర్లకు నగదు రహిత వైద్య సదుపాయాన్ని కల్పించాలని చెప్పారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదాయపు పన్ను పరిమితిని రూ.10 లక్షలకు పెంచాలన్నారు. ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణను ఆపాలని కోరారు.

గ్రంథాలయం, మార్కెటింగ్ కమిటీ, ఎయిడెడ్ సంస్థల ఉద్యోగులకు 010 పద్దు ద్వారా వేతనాలను చెల్లించాలని చెప్పారు. నూతన జిల్లాలకు అదనపు క్యాడర్ స్ట్రెంత్‌ను మంజూరు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, ముత్యాల సత్యనారాయణగౌడ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె లక్ష్మణ్, బుచ్చిరెడ్డి, హైదరాబాద్ నగర అధ్యక్ష, కార్యదర్శులు శ్రీకాంత్, పి హరి, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి విక్రమ్, నాయకులు కురాడి శ్రీను, శంకర్, ఆదిలాబాద్ అధ్యక్షులు అశోక్, సంగారెడ్డి అధ్యక్షులు జావిద్‌అలీ, నిజామాబాద్, నాగర్‌కర్నూల్, మంచిర్యాల, మహబూబ్‌నగర్ అధ్యక్ష, కార్యదర్శులు కిషన్, శేఖర్, వెంకటేశ్, లక్ష్మణ్, శ్రీహరి, రామ్మోహన్, రాజీవ్‌రెడ్డి, చంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త దరఖాస్తుదారులకీ గృహజ్యోతి ఇవ్వండి

- విద్యుదుత్పత్తిలో జాగ్రత్తలు తీసుకోండి
- జెన్‌కోలో టెక్నికల్ కమిటీ ఏర్పాటు : సమీక్షా సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కొత్తగా దరఖాస్తు చేసుకున్నవారికి కూడా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌కు సంబంధించిన గృహజ్యోతి పథకాన్ని వర్తింప చేయాలని ఉప ముఖ్యమంత్రి, విద్యుత్, ఆర్థిక శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారుల్ని ఆదేశించారు. బుధవారంనాడిక్కడి మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో ట్రాన్స్‌కో, జెన్‌కో, ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయా సంస్థల ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. జెన్‌కో నిర్వహించే విద్యుదుత్పత్తి సంస్థల్లో, ముఖ్యంగా జెన్‌కోలో సాంకేతిక సమస్యల పరిష్కారానికి ముగ్గురు సభ్యుల నిపుణుల కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కమిటీ క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి, ఆయా సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై నివేదికలు ఇవ్వాలని సూచించారు. దాని ఆధారంగానే జెన్‌కో సీఎండీ నిర్ణయం తీసుకుని, విద్యుదుత్పత్తికి అంతరాయం లేకుండా చూడాలని ఆదేశించారు. భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ యూనిట్-1లో జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేయాలా...లేక కొత్తది కొనుగోలు చేయాలా... అనే అంశాన్ని టెక్నికల్ కమిటీ పరిశీలిస్తుందని తెలిపారు. 2023 డిసెంబర్‌కు ముందు గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల అమలుకు సంబంధించి తప్పనిసరిగా ఈ ప్రభుత్వానికి నివేదించాలని ఆదేశించారు. నిర్ణయాలను అమలు చేసే సమయంలో సీఎండీలు తప్పనిసరిగా ఎనర్జీ సెక్రటరీని సంప్రదించాలని సూచించారు. జల విద్యుత్ కేంద్రాల్లో సాంకేతిక సమస్యలు ఎదురైతే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని, ఇందులో ఎలాంటి అలసత్వం వహించొద్దన్నారు. ఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో 227 సబ్‌స్టేషన్ల నిర్మాణానికి ప్రక్రియ మొదలైందనీ, దానిలో 113 సబ్ స్టేషన్లకు స్థల సమస్య లేదనీ, మిగతా వాటికి కలెక్టర్లు స్థలాలు కేటాయించాల్సి ఉందన్నారు. కాళేశ్వరం, ఇతర లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు వినియోగిస్తున్న విద్యుత్, అవుతున్న ఖర్చుకు సంబంధించి నివేదిక ఇవ్వాలన్నారు. సమావేశంలో ఎనర్జీ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా, ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి, ట్రాన్స్ కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
గురువారం 15-08-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 సంచిక : 177 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50



ముస్తాబైన ఎర్రకోట


పంద్రాగస్టుకు కట్టుదిట్టమైన భద్రత

ఆరు వేల మంది ప్రత్యేక అతిథులకు ఆహ్వానం

ఆయా రాష్ట్రాలు,కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 2 వేల మంది సంప్రదాయ వేషధారణ

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

78వ స్వాతంత్ర్య వేడుకల నిర్వహణకు ఢిల్లీలోని ఎర్రకోట ముస్తాబైంది. ఈ వేడుకలకు దాదాపు ఆరు వేల మంది ప్రత్యేక అతిథులను ఆహ్వానించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మువ్వన్నెల జెండాను ఆవిష్కరించనున్నారు. అనంతరం దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతారు. ఈ నేపథ్యంలో ఢిల్లీలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. ఎక్కడికక్కడ చెక్‌పాయింట్లు పెట్టారు. ఇంటెలిజెన్సీ ఆదేశాల మేరకు వాహనదారులను విస్తతంగా తనిఖీ చేస్తున్నారు. రోడ్లపై భారీ స్థాయిల్లో బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఢిల్లీలో భారీగా భద్రతా బలగాలు మోహరించాయి.వివిధ రంగాల్లో రాణించిన, ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందిన వారిలో కొందరిని కేంద్రం ప్రత్యేక అతిథులుగా ఈ కార్యక్రమానికి ఆహ్వానించింది. ఇటీవల పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొన్న దేశ క్రీడాకారులకూ ఆహ్వానం పంపింది. దాదాపు 400 మంది పంచాయతీరాజ్ సంస్థల మహిళా ప్రతినిధులను ...10లో



గొంతులేని వారి గొంతుక

నవతెలంగాణ తొమ్మిదో వార్షికోత్సవ శుభ సందర్భంగా పత్రికా నిర్వహణ బందానికి శుభాకాంక్షలు, అభినందనలు. గొంతులేని ప్రజల గొంతుకగా తన అక్షర ప్రస్థానాన్ని అపూర్వంగా కొనసాగిస్తున్న ఈ పత్రిక నవతెలంగాణ. నేను, నా కలం అట్టడుగు, శ్రామిక వర్గాల అభ్యున్నతికే కషి చేశాయి. ముని మనవడు నాటకమైనా, ఊరబావి కథైనా, రంథినవలైనా, సాహిత్య విమర్శ అయినా, కవిత్వమైనా... సామాన్యుని జీవితాన్ని ప్రతిబింబించేవే. నేను అభ్యుదయ నవ సాహిత్యానికి కట్టుబడి ఉండటానికి నాటి ప్రజాశక్తి, నేటి నవ తెలంగాణ పత్రికలు నాకు నిత్యం ప్రేరణగా నిలిచాయి.

- ఇనాక్ కొలకలూరి

రాష్ట్రాలకే రాయల్టీ హక్కు



2005 నుంచి గనులు, ఖనిజ భూములపై బకాయిలు అడగొచ్చు : సుప్రీం స్పష్టీకరణ

- జులై 25 నుంచి అమలు చేయాలన్న కేంద్రం..తిరస్కరించిన సుప్రీం
- ఫెడరలిజం పరిరక్షణకు కేంద్రం జోక్యం ఉండకూడదు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

గనులు, ఖనిజ భూములపై రాయల్టీ వాపస్ విషయంలో అత్యున్నత న్యాయస్థానంలో రాష్ట్రాలకు భారీ విజయం దక్కింది. 2005 ఏప్రిల్ 1 నుంచి రాయల్టీ బకాయిలను కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్రాలు కోరవచ్చని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు బుధవారం కీలక తీర్పు వెలువరించింది. రాయల్టీపై ఇటీవల సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును ఈ ఏడాది జులై 25 నుంచే అమలు చేయాలన్న కేంద్రం అభ్యర్థనను సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం తిరస్కరించింది. కేంద్రం, గనుల కంపెనీలు ఇవ్వాల్సిన బకాయిలను రానున్న 12 ఏండ్లలో దశల వారీగా చెల్లించాలని స్పష్టం చేసింది. అలాగే.. వీటిపై ఎలాంటి పెనాల్టీలు విధించొద్దని రాష్ట్రాలను ఆదేశించింది. ధర్మాసనం 1957 నాటి మైన్స్ అండ్ మినరల్స్ (అభివృద్ధి, నియంత్రణ) చట్టం నుంచి స్వతంత్రంగా మైనింగ్ ...11లో

ఎమ్మెల్సీల నియామకాన్ని నియంత్రించలేం

గవర్నర్ నిర్ణయాన్ని ఆపలేం : దాసోజు శ్రవణ్ కుమార్, సత్యనారాయణ పిటీషన్‌పై సుప్రీం

వివరాలు 11లో

ప్రపంచంతోనే పోటీ

పదేండ్లలో రూ.లక్షకోట్ల ఆర్థికాభివృద్ధే లక్ష్యం


ఫ్యూచర్ సిటీదే భవిష్యత్ : కాగ్నిజెంట్ క్యాంపస్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

పారిశ్రామికాభివృద్ధిలో ప్రపంచంతోనే తాము పోటీ పడుతున్నామని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. వచ్చే పదేండ్లలో తెలంగాణ రూ.లక్షకోట్ల ఆర్థికాభివృద్ధి సాధించాలనేదే తమ లక్ష్యమని చెప్పారు. విదేశీ పర్యటన ముగించుకుని రాష్ట్రానికి తిరిగి వచ్చిన ఆయన బుధవారంనాడిక్కడి కోకాపేటలో కాగ్నిజెంట్ సంస్థ నూతన క్యాంపస్‌ను ప్రారంభించారు. ప్రపంచ అవసరాలు తీర్చేలా అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలో భవిష్యత్ నగరాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు. హైదరాబాద్‌కు 430 సంవత్సరాల చరిత్ర ఉందనీ, ఈ నగర వ్యవస్థాపకుడు కులీకుతుబ్ షా నుంచి తన వరకు ఎవరు పాలించినా, వ్యవస్థలు మారినా, విధానాలతో సంబంధం లేకుండా అందరూ దీని అభివృద్ధికి కృషి చేశారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం మారగానే ఇక్కడి నుంచి పెట్టుబడులు అక్కడి తరలిపోతాయనే చర్చను కొందరు ప్రారంభించారనీ, కానీ తన పోటీ పొరుగురాష్ట్రాలతో కాదనీ, ప్రపంచంతోనే అని స్పష్టం చేశారు. 1992లో ఐటీ పరిశ్రమలకు నాటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి శంకుస్థాపన చేస్తే, ఆ తర్వాత వచ్చిన ముఖ్యమంత్రులు చంద్రబాబునాయుడు, రాజశేఖర్‌రెడ్డి దాని అభివృద్ధిని కొనసాగిస్తూ, సైబరాబాద్ నిర్మించారని తెలిపారు. తాము నూతనంగా నిర్మించబోయే భవిష్యత్ సిటీలో ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞాన విస్తరణ జరుగుతుందని స్పష్టం చేశారు. పదిరోజుల తన విదేశీ పర్యటనలో రూ.31,500 కోట్ల పెట్టుబడులు పెట్టి, 30,750 మందికి పైగా ఉద్యోగావకాశాలు కల్పించేలా ఒప్పందాలు జరిగాయన్నారు. త్వరలోనే మరిన్ని ఒప్పందాలు జరుగుతాయనీ, పెట్టుబడులకు సంబంధించి సమావేశాల నిర్వహణ కోసం ఇన్వెస్టర్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. కాగ్నిజెంట్ సంస్థ విస్తరణకు ప్రభుత్వం తరఫున పూర్తి మద్దతు ఉంటుందని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో అత్యధిక ఉద్యోగాలు కల్పిస్తున్న రెండో సంస్థగా కాగ్నిజెంట్ గుర్తింపు పొందిందనీ, 2002లో హైదరాబాద్‌లో ప్రారంభమైన ఈ సంస్థ లక్ష మందికిపైగా ఉద్యోగాలు కల్పించిందని చెప్పారు. తాము నిర్మించే భవిష్యత్ (ఫ్యూచర్) సిటీలో కూడా కాగ్నిజెంట్ ప్రాంగణం ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్రం, దేశం ఎదుర్కొంటున్న నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలంటే పారిశ్రామిక విధానం పారదర్శకంగా ఉండాలని, పెట్టుబడిదారులను ప్రోత్సహించే విధానం ఉండాలని తమ ప్రభుత్వం విశ్వసిస్తుందని తెలిపారు. అందుకే ప్రభుత్వం మారినా విధానాల్లో మార్పు చేయలేదనీ, ఇంకా వేగంగా, పారదర్శకంగా, పట్టుదలతో తాము పనిచేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు మాట్లాడుతూ హైదరాబాద్ నగరం ఒక్క రోజులో అభివృద్ధి చెందలేదనీ, అంచలంచలుగా ఎదుగుతూ వచ్చిందని చెప్పారు. దావోస్ పర్యటనలో తాము కాగ్నిజెంట్ సీఈవో రవికుమార్, కాగ్నిజెంట్ అమెరికన్ ప్రెసిడెంట్, ఈవీపీ సూర్య గుమ్మడితో క్యాంపస్ విస్తరణపై చర్చించామన్నారు. కేవలం ఆరునెలల్లోనే వారు స్పందించి ఇక్కడ క్యాంపస్ విస్తరణ పూర్తి చేసి, మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారని తెలిపారు. ప్రపంచం ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ), సైబర్ సెక్యూరిటీ, క్వాంటమ్ వంటి విభిన్న రకాల ప్రతిభను అన్వేషిస్తున్నదనీ, దానికి అవసరమైన నైపుణ్యాల అభివృద్ధికి వసతులు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కాగ్నిజెంట్ ఈవీపీ, కాగ్నిజెంట్ అమెరికస్ ప్రెసిడెంట్ సూర్య గుమ్మడి మాట్లాడుతూ ...11లో

వినేశ్ ఫోగట్‌కు నిరాశే..



అనర్హత పిటిషన్ తిరస్కరణ



పారిస్ : ఒలింపిక్స్ పోటీల్లో భాగంగా రెజ్లింగ్‌లో తనపై విధించిన అనర్హతను సవాలు చేస్తూ వినేశ్ ఫోగట్ చేసిన అభ్యర్థనను కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్ (సీఏఎస్) తిరస్కరించింది. ఆమె దాఖలు చేసిన పిటిషన్‌ను బుధవారం కొట్టివేసింది. పారిస్ ఒలింపిక్స్ రెజ్లింగ్ ఫ్రీస్టైల్ 50 కేజీల విభాగంలో 100 గ్రాములు అదనంగా బరువు ఉందని వినేశ్‌పై అనర్హత వేటు పడింది. ఆ నిర్ణయాన్ని సవాల్ చేయడంతోపాటు ఫైనల్లో ఓడిన లోపెజ్ (క్యూబా)తో కలిసి తనకు రజత పతకం ఇవ్వాలని వినేశ్ అప్పీలు చేసింది. కాస్ తీర్పు వచ్చేదాకా పారిస్‌లోనే ఉండాలని ఫోగట్ నిర్ణయించింది. అయితే తీర్పు వ్యతిరేకంగా రావటంతో..ఆమె ఏ విధంగా ముందుకెళ్తారన్న దానిపైనే సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

సీఎం బృందానికి ఘన స్వాగతం

పన్నెండు రోజుల విదేశీ పర్యటనను ముగించుకుని బుధవారం హైదరాబాద్‌కు చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్ బృందానికి శంషాబాద్ విమానాశ్రయంలో కాంగ్రెస్ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. సీఎం బృందంలో పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి ...11లో

నవతెలంగాణ
మీ రక్తం మరగకపోతే.. అది నెత్తురు కాదు నీరు. మాతృభూమికి సేవ చేయకపోతే నువ్వు భారతీయుడివి కాదు - చంద్రశేఖర్ ఆజాద్
గురువారం 15 ఆగస్టు 2024
www.navatelangana.com

సంపాదకీయం

పెట్టుబడుల లోగుట్టు...



పన్నెండు రోజుల విదేశీ పర్యటన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ నేతృత్వంలోని బృందం బుధవారం హైదరాబాద్‌లో అడుగుపెట్టింది. అధికారపార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు,నాయకులు, కార్యకర్తలు, ఉన్నతాధికారులు ఆ టీమ్‌కు ఘనస్వాగతం పలికారు. రాష్ట్రానికి పెట్టుబడులను ఆహ్వానించేందుకు, తద్వారా ఇక్కడి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ఉద్దేశించిన సీఎం పర్యటన జయప్రదంగా ముగియటం హర్షణీయం. అయితే లోగుట్టు పెరుమాళ్లకెరుక అన్నట్టు పెట్టుబడులను ఆకర్షించేందుకోసమంటూ విదేశాలు పట్టుకు తిరుగుతున్న మన పాలకుల ఆర్భాట ప్రచారాలు, ప్రకటనలు వాస్తవంలో మాత్రం అందుకు భిన్నంగా ఉంటున్నాయి.

ఉమ్మడి రాష్ట్రంలో ఆనాటి ముఖ్యమంత్రి చంద్రబాబు అయినా, తెలంగాణ ఏర్పడ్డాక కేసీఆర్, రేవంత్‌ల పరిస్థితి అయినా ఇదే. ఇటీవల అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ముగిసిన మరుసటి రోజే సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వం లోని బృందం అమెరికాకు పయనమైంది. ఎనిమిది రోజులపాటు అక్కడ పర్యటించిన ఆయన టీమ్, ఆ తర్వాత దక్షిణ కొరియాకు కూడా వెళ్లింది. మొత్తం మీద ఆ రెండు దేశాల్లో 50కి పైగా భేటీలు, మూడు రౌండ్‌టేబుల్ సమావేశాల్లో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ పర్యటనల ద్వారా రూ.31,532 కోట్ల మేర పెట్టుబడులను ఆకర్షించామని ప్రభుత్వం వెల్లడించింది. 19 కంపెనీలతో చేసుకున్న వివిధ ఒప్పందాల ద్వారా రాష్ట్రంలో 30,750 కొత్తఉద్యోగాలు లభించ నున్నాయని ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) ప్రకటించింది. ఇవిగాక గత జనవరిలో దావోస్‌లో పర్యటించిన సీఎం...రూ.40,232 కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి రానున్నాయంటూ ప్రకటించారు. ఫిబ్రవరి నుంచి జులై వరకు రాష్ట్ర ప్రభుత్వం వివిధ కంపెనీలతో చేసుకున్న ఒప్పందాల విలువ మరో రూ.9,800 కోట్లంటూ పరిశ్రమల శాఖ లెక్కలేసింది.

ఇందుకు సంబంధించి మనం కొద్దిగా వెనక్కెళ్లి గతంలోకి తొంగిచూస్తే పాలకుల ప్రచారార్భాటాల్లోని డొల్లతనాన్ని అర్థం చేసుకోవచ్చు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తొలిసారి సీఎం అయ్యాక 2015లో చైనాలో పది రోజులపాటు పర్యటించారు. సెల్‌కాన్, మకనో, షాంఘై ఎలక్ట్రిక్ కార్పొరేషన్, లియో గ్రూప్ తదితర కంపెనీలతో ఆయన పలు ఒప్పందాలు చేసుకున్నారు. తద్వారా రూ.1,160 కోట్ల మేర పెట్టుబడులు వస్తాయంటూ ఊదర గొట్టారు. కానీ వీటిలో ఒక్క సెల్‌కాన్ సంస్థ తప్ప మరే కంపెనీ తెలంగాణలో పెట్టుబడులు పెట్టకపోవటం గమనార్హం. అది కూడా కేవలం రూ.160 కోట్ల విలువైన యూనిట్ మాత్రమే నెలకొల్పటం కొసమెరుపు. అదే బీఆర్ఎస్ హయాంలో పరిశ్రమలు, ఐటీశాఖ మంత్రిగా కేటీఆర్... దావోస్‌లో 2022లో నిర్వహించిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్) సదస్సులో పాల్గొని, రూ.4,200 కోట్ల మేర పెట్టుబడులను ఆకర్షించినట్టు ప్రకటించారు. రూ.322 కోట్లతో హైదరాబాద్‌లోని నానక్‌రామ్‌గూడలో తెలంగాణ మొబిలిటీ వ్యాలీని జర్మనీకి చెందిన జడ్.ఎఫ్. అనే కంపెనీ స్థాపించబోతోందని ఆయన అప్పట్లో వెల్లడించారు. ఇలాంటి ఒప్పందాలు, ఉద్యోగాల కల్పనలన్నీ ఆ తర్వాత అనుకున్నంత స్థాయిలో సఫలీకృతం కాలేదన్నది అనుభవంలో తేలిన విషయం.

చంద్రబాబు హయాంలోనూ వివిధ విదేశీ కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్నప్పటికీ అవన్నీ మన నిరుద్యోగ యువతకు పూర్తి స్థాయిలో కొలువులు కల్పించలేకపోయాయి. ఐటీరంగం ద్వారా ఏటా దాదాపు పది వేల ఉద్యోగాలను సృష్టిస్తామంటూ అప్పట్లో ప్రభుత్వం చెప్పినప్పటికీ ఆచరణలో అది అందని ద్రాక్షగానే మిగిలిపోయింది. దేశంలోనూ, అన్ని రాష్ట్రాల్లోనూ 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' అనేది పాలకుల తారకమంత్రం. పెట్టుబడికి ఆంక్షలులేని స్వేచ్ఛనిచ్చిన తర్వాత, మోడీసర్కార్ చట్టాలన్నింటినీ మార్చిపారేస్తున్న నేపథ్యంలో కార్మికులు, ఉద్యోగుల బతుకులు బాగుపడేదేముంది?

ఇక్కడో విషయాన్ని మనం గమనించాలి. దేశంలోగానీ, మన రాష్ట్రంలోగానీ ఇప్పటికీ 60 నుంచి 70 శాతం మంది ప్రజలు వ్యవసాయం, దాని అనుబంధ రంగాల మీద ఆధారపడి జీవిస్తున్నారు. అయితే ఆ రంగంలో యాంత్రీకరణ పెరగటంతో ఉపాధి అవకాశాలు నానాటికీ సన్నగిల్లుతున్నాయి. ఫలితంగా ప్రజలు పనుల కోసం ఊళ్లొదిలిపెట్టాల్సిన దుస్థితి. ఈ క్రమంలో ఒక రాష్ట్రంలో ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు, ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి ఈ వలసలు పెరిగిపోతున్నాయి. అంతిమంగా ఇది అనేక సమస్యలకు కారణమవుతోంది. కరోనాలాంటి విపత్కర సమయాల్లో సైతం అనేక రంగాల్లో ఉద్యోగులను గాలికొదిలేస్తే, వారిని ఆదుకున్నది, అక్కున చేర్చుకున్నది వ్యవసాయరంగమే. అందువల్ల ప్రభుత్వాలు పెట్టుబడులను ఆకర్షించటంతోపాటు 'సాగు'ను బహు'బాగు' చేయటం ద్వారా ప్రజలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

> చంద్రబాబు హయాంలోనూ వివిధ విదేశీ కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్నప్పటికీ అవన్నీ మన నిరుద్యోగ యువతకు పూర్తి స్థాయిలో కొలువులు కల్పించలేకపోయాయి. ఐటీరంగం ద్వారా ఏటా దాదాపు పది వేల ఉద్యోగాలను సృష్టిస్తామంటూ అప్పట్లో ప్రభుత్వం చెప్పినప్పటికీ ఆచరణలో అది అందని ద్రాక్షగానే మిగిలిపోయింది. దేశంలోనూ, అన్ని రాష్ట్రాల్లోనూ 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' అనేది పాలకుల తారకమంత్రం. పెట్టుబడికి ఆంక్షలులేని స్వేచ్ఛనిచ్చిన తర్వాత, మోడీసర్కార్ చట్టాలన్నింటినీ మార్చిపారేస్తున్న నేపథ్యంలో కార్మికులు, ఉద్యోగుల బతుకులు బాగుపడేదేముంది?

జనగణమన..!

అహింస ఎప్పటిలాగే మళ్లీ ఓసారి
చరిత బానిసత్వపు అధిపత్యంపై
గెలిచి డెబ్బై ఎనిమిది వసంతాల
స్వాతంత్ర్య సంబరాలతో ఆదర్శపు
స్ఫూర్తి అంబరాన్ని తాకుతోంది..!

నేటి విశ్వోదయమే
నా త్రివర్ణ పతాకపు
శాంతి వికాసమే ప్రేమతత్వపు
ఎవరెస్ట్ శిఖరమై నవతరపు
వర్తమానానికి భవిష్యత్ తరపు
వందే"మాతరానికి" దిక్సూచైంది.
జగతిని జాగృతం చేస్తూ
"జనగణమన"
సాక్షిగా రవీంద్రుని స్వరం దేశభక్తికి
స్వర్ణమై ప్రకాశిస్తూనే వుంది..!
భిన్నత్వంలో ఏకత్వమై
పరిమళిస్తూనే వుంది..!

మనుషులను ద్వేషపు ఆసనాలతో
రెచ్చగొట్టడం మాని,
మానవత్వపు తేజంతో
స్వేచ్ఛావాయువుల్ని పీల్చాలని
పేదరికపు సంగ్రామంలో
దేశాన్ని గెలిపించాలని
"సత్యమన్న" మహాత్ముడి మాటలు
విశ్వ గమనాన్ని నడిపిస్తున్నాయి..!

విశ్వ గురువుగా మళ్లీ మనకు
పునర్ వైభవం రావాలన్న
వివేకానంద సూక్తులే
సూర్యోదయ కిరణాల్లా
అజ్ఞానపు చీకటిని
తరిమేస్తున్నాయి..!
నేతాజీ జైహింద్ నినాదం కోట్లాది
భారతీయుల నివాసమై
ప్రతిధ్వనిస్తుంది..!
భగత్‌సింగ్ ప్రాణత్యాగం
అశోక చక్రమై
భారతీయతకు ప్రాణం పోస్తుంది..!
అంబేద్కర్ అభ్యుదయం
సమస్త జనవాళికి
చదువు మార్గం చూపెడుతుంది..!
వీరనారి ఝాన్సీ సాహసం
కోహినూర్ వజ్రమై మన జాతినంత
కవనమై కదిలిస్తుంది..
మన గుండె గడపపై జాతీయ
జెండా ఎగురుతున్న ఈ వేళ
లౌకికతత్వపు శోభ ప్రపంచమంతా
ప్రపంచమంతా ప్రభవించాలి
స్వాతంత్ర్యపు స్ఫూర్తి
వేలాది ఉద్యమాలకు ఊపిరి
పోయాలి..!!

- పి.అరుణ్‌కుమార్,
9394749536

(అ)జెండా ఊంచా రహే హమారా!



బివి రాఘవులు



ఎన్‌డిఏ ప్రభుత్వం మూడవ సారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రధానమంత్రి నరేంద్రమోడీ మొదటి స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగం ఆగస్టు 15న ఎర్రకోట బురుజు నుండి వినబోతున్నాము. ఆయన ప్రసంగం వినడానికి, మూడు రంగుల జెండా ఆవిష్కరణను తిలకించడానికి వేలమందికి ప్రత్యేకంగా ఆహ్వానాలు వెళ్లాయి. అందులో నాలుగువేల ఆహ్వానాలు ప్రత్యేకంగా రైతులకు, మహిళలకు, యువకులకు, పేదలకు వెళ్లాయని, ఈ తరగతులకు ప్రధానమంత్రి ఎంత ప్రాధాన్యతనిస్తున్నారో ఇది వెల్లడిస్తున్నదని అప్పుడే మీడియాలో కథనాలు మొదలయ్యాయి. విడ్డూరం ఏమంటే, బీజేపీ మోడీ పాలన మూలంగా ఏ తరగతులైతే ఎక్కువగా ఇక్కట్ల పాలవుతున్నారో ఆ తరగతులనే స్వాతంత్ర్య దినోత్సవ సంరంభానికి ఆహ్వానించడం.

బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం జూన్ 8న ఏర్పడ్డాక గడచిన రెండు నెలల కాలంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, ముఖ్యంగా కేంద్రం 2024-25 సంవత్సరానికి పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రతిపాదనలు సరిగ్గా రైతులకు, మహిళలకు, యువకులకు, పేదలకు నష్టదాయకంగా ఉన్నాయి. ఇప్పుడు వీరందరికీ ఎర్రకోటపై నుండి మోడీగారు ఇచ్చే సందేశం వాతబెట్టి పసరు రాసినట్టుగా ఉంటుంది. రైతుల పరిస్థితి చూస్తే, గత మోడీ ప్రభుత్వం తెచ్చిన రైతు వ్యతిరేక మూడు నల్ల చట్టాలను ఉపసంహరించాలని, మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని 2020లో దేశవ్యాపితంగా వీరోచిత పోరాటాన్ని సాగించారు. నెలల తరబడి ఢిల్లీ రాజధానిని దిగ్బంధనం చేశారు. ఉద్యమానికి తలొగ్గి నల్ల చట్టాలను రద్దు చేసినప్పటికీ, మోసపూరిత ఎత్తుగడలతో కాలయాపన చేసింది తప్ప, మద్దతు ధరకు చట్టబద్ధత ఇవ్వడానికి సిద్ధపడలేదు. ఇప్పుడు కూడా మోడీ ప్రభుత్వానికి అటువంటి ఆలోచన లేదనేది బడ్జెట్ ప్రసంగాలు విదితం చేస్తున్నాయి. పైపెచ్చు మొన్న బడ్జెట్‌లో ఎరువులకు సబ్సిడీ తగ్గించారు. వ్యవసాయ రంగానికి బడ్జెట్టు పెంచలేదు. ఇంకోవైపు వ్యవసాయంలోకి కార్పొరేట్లు ప్రవేశించడానికి వీలుగా అగ్రిస్టాక్ వంటి కొత్త ప్రతిపాదనలు చేశారు. రైతులు, ప్రత్యేకంగా పేద, మధ్యతరగతి, కౌలు రైతులు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. వారి సమస్యలకు పరిష్కారాలు చూపకుండా, భూ వ్యాపారాన్ని వేగిరపర్చడానికి రాష్ట్రాలను ఒత్తిడి చేసేందుకు ప్రోత్సాహక పథకాలను సిద్ధం చేశారు. యువకుల పరిస్థితి మరీ అధ్వాన్నం. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలని మోడీ వాగ్దానం చేసినప్పుడు యువకులు చాలా ఆశపడ్డారు. గత దశాబ్ద కాలంలో బీజేపీ ప్రభుత్వం ఉపాధి కల్పనలో ఘోరంగా విఫలమైంది. నిరుద్యోగం పెరిగింది. ఉపాధిని పెంచే పరిశ్రమలను, ఆర్థిక కార్యకలాపాలను ప్రోత్సహించడం కాకుండా మేక్ ఇన్ ఇండియా వంటి స్కీములన్నీ విదేశీ కంపెనీలు, ఉపాధి సృష్టించని హైటెక్ పరిశ్రమలు పెట్టుకోవడానికి తోడ్పడుతున్నాయి. తాజా బడ్జెట్‌లో ఉపాధి సృష్టికి ప్రకటించిన స్కీంలు ప్రభుత్వ సొమ్మును ఐదు వందల పెద్ద కంపెనీల బొక్కసం నింపడానికి వినియోగపడతాయి తప్ప, యువకులకు ఉపాధినిచ్చేవి కావు.

పార్లమెంటులో ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వేలో ఆశ్చర్యం గొలిపే అంశాలు ప్రస్తావించబడ్డాయి. మన పెట్టుబడిదారుల లాభాలు ఇబ్బడిముబ్బడిగా పెరిగాయని, కానీ వారు పరిశ్రమలలో పెట్టుబడులు పెట్టడంలేదని, యంత్రాలు, పరికరాలు కొనేదానికన్నా విలాసాలకు ఖర్చు పెడుతున్నారని సర్వే వెల్లడించింది. ఇక ఎక్కడినుండి మన యువతకు ఉపాధి వస్తుంది. దేశంలోని యువతరం ఆటపాటల్లో వారు ఏం సాధించారనేది మన ప్రగతికి, దేశ ప్రతిష్టకు ఒక కొలమానం. పారిస్‌లో జరిగిన ఒలంపిక్స్‌లో మన దేశం ఒక వెండి, ఐదు కాంస్య పతకాలతోనే తిరిగి రావాల్సి వచ్చింది. రావలసిన కొన్ని పతకాలు త్రుటిలో తప్పిపోయాయి. ఎంతో సాధనచేసి పోటీల్లో పాల్గొన్న యువతీయువకులను మనం అభినందించాలి. అయితే మనం 140కోట్ల జనాభా కలిగిన, ప్రపంచంలో సంపన్న దేశాల పక్కన చేరాలని ఉవ్విళ్లూరుతున్న దేశంగా చూసుకున్నపుడు, మనం ఎక్కడు న్నామని ప్రశ్నించుకుంటే యువతరాన్ని ఎంత నిర్లక్ష్యం చేస్తున్నామో అర్థమవుతుంది. మన పాఠశాల, కళాశాలస్థాయి విద్యావిధానం ఎంత లోపభూయిష్టంగా ఉందో, మోడీ వచ్చిన తర్వాత నూతన విధానం పేరుతో అది మరింత అధ్వాన్నం ఎలా అయిందో ఆటల్లో వెనకంజ స్పష్టంగా వెల్లడిస్తుంది. యువతరం పట్ల మోడీ ప్రభుత్వ నిర్లక్ష్యం తెలియ జేస్తుంది.

ఇక మహిళలు, దళితులు, గిరిజనులు, మైనారిటీలు, ఇతర సామాజిక తరగతి గురించి చెప్పుకోనక్కరలేదు. ఈ తరగతులపై హింస, అత్యా చారాలు, నిత్యకృత్యమయ్యాయి. పితృస్వామిక భావజాలాన్ని, సనాతనవాదాన్ని గొప్పగా బీజేపీ నాయకులు, సంఘ్ పరివార్ కీర్తిస్తున్న తరుణంలో బలహీనవర్గాలపై అవమానాలు, అఘాయిత్యాలు పెరగడంలో ఆశ్చర్యం లేదు. ఆరెస్సెస్ అనుకూల పత్రిక పాంచజన్యంలో, అత్యంత దుర్మార్గమైన కుల వ్యవస్థను దేశాన్ని సమైక్యంగా ఉంచే ఒక గొప్ప వ్యవస్థగా కీర్తిస్తూ రాశారంటే బీజేపీ అధికారం చేపట్టిన తర్వాత సామాజిక అభివృద్ధి నిరోధకులకు ఎంత ధైర్యం వచ్చిందో చూడవచ్చు. గిరిజనుల పరిస్థితి మరింత దైన్యంగా మారింది. అడవులు, గనులు, కొండలను కార్పొరేట్ల లూటీకి అప్పగించడానికి, వారికి ఇచ్చిన రక్షణలన్నింటిని తొలగిస్తున్నా రు. అభ్యంతరం పెట్టినవాళ్ళపై క్రూర నిర్బంధం ప్రయోగిస్తున్నారు. ఉదాహరణకు పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులైన వేలాది గిరిజన కుటుంబాలను పునరావాసం కల్పించకుండా రోడ్డున పడేశారు. మైనారిటీలైతే బిక్కుబిక్కుమంటూ బతకాల్సిన పరిస్థితిని సృష్టించారు.

పేదలను వాడుకుని విసిరేసే వస్తువులుగా మోడీ ప్రభుత్వం చూస్తున్నది. పేదలకు ఉపయోగపడే ఉపాధి హామీ పథకానికి వరుసగా కోతలు పెడుతున్నది. ఈ బడ్జెట్టులోనూ కేటాయింపులు తగ్గించింది. ఆహార సబ్సిడీని తగ్గించింది. ప్రభుత్వ ఆర్థిక సర్వే ప్రకారమే పెట్టుబడిదారుల లాభాలు ఇరవై శాతానికి పైగా పెరుగుతుంటే, కార్మికులు, కష్టజీవుల ఆదాయాలు పడిపోయాయి. మధ్య తరగతి ఆదాయాలు సైతం ఎదుగుబొదుగు లేకుండా ఉన్నాయి.

> కేంద్రం 2024-25 సంవత్సరానికి పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రతిపాదనలు సరిగ్గా రైతులకు, మహిళలకు, యువకులకు, పేదలకు నష్టదాయకంగా ఉన్నాయి. ఇప్పుడు వీరందరికీ ఎర్రకోటపై నుండి మోడీగారు ఇచ్చే సందేశం వాతబెట్టి పసరు రాసినట్టుగా ఉంటుంది. రైతుల పరిస్థితి చూస్తే, గత మోడీ ప్రభుత్వం తెచ్చిన రైతు వ్యతిరేక మూడు నల్ల చట్టాలను ఉపసంహరించాలని, మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని 2020లో దేశవ్యాపితంగా వీరోచిత పోరాటాన్ని సాగించారు. నెలల తరబడి ఢిల్లీ రాజధానిని దిగ్బంధనం చేశారు. ఉద్యమానికి తలొగ్గి నల్ల చట్టాలను రద్దు చేసినప్పటికీ, మోసపూరిత ఎత్తుగడలతో కాలయాపన చేసింది తప్ప, మద్దతు ధరకు చట్టబద్ధత ఇవ్వడానికి సిద్ధపడలేదు.

పెద్ద పెద్ద భూ యజమానుల ఆదాయాలను కలుపుకుని లెక్కగట్టినా రైతు ఆదాయాలు ఒక్క శాతం మాత్రమే పెరిగాయి. ధరలు మాత్రం ఐదు శాతంపైనే పెరుగుతున్నాయి. పేదలు ఎక్కువగా వినియోగించే ఆహార పదార్థాల ధరలు పదిశాతం పైబడి పెరుగుతున్నాయి. అంటే నిజ ఆదాయాలు ఇంకా తక్కువగా ఉన్నాయన్నమాట. కనీవినీ ఎరుగని లాభాలు గడిస్తున్న కార్పొరేట్ల నుండి అదనపు పన్నులు వసూలు చేసి పేదల ఆదాయాలను పెంచే కార్యక్రమాలు చేపట్టకుండా, ఈ బడ్జెట్‌లో వారికి మరిన్ని రాయితీలు, తాయిలాలు మోడీ ప్రభుత్వం ఇస్తున్నది. ఇది పేదలపై మోడీ చూపిస్తున్న ప్రేమలోని కుటిలత్వం.

పైన ప్రస్తావించినవన్నీ ఒక ఎత్తయితే, మోడీ ప్రభుత్వం ప్రజాస్వామిక విలువలను విధ్వంసం చేసేందుకు తీసుకుంటున్న నిర్ణయాలు మరో ఎత్తు. మూడవసారి అధికారం చేపట్టిన తర్వాత తీసుకుంటున్న చర్యలను చూసినా నిరంకుశ పాలనపై వేగంగా నడుస్తున్నట్లు గమనించవచ్చు. పౌర, నేర చట్టాలలో ప్రజాస్వామిక హక్కులకు భంగం కలిగే అనేక మార్పులు చేసారు. మీడియా నోరు నొక్కేందుకు కొత్త బ్రాడ్‌కాస్టింగ్ బిల్లును ప్రతిపాదిస్తున్నారు. ఒకదేశం - ఒకే ఎన్నిక కోసం రాజ్యాంగంలో తీవ్ర మార్పులు చేయడానికి సిద్ధమవుతున్నారు. మైనారిటీలకు నష్టం కలిగించే రీతిలో వక్ఫ్ బోర్డు చట్టానికి పలు సవరణలు తెస్తున్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలలో పౌరహక్కులను హరించే అనేక రాక్షస చట్టాలను తెస్తున్నారు. రాజ్యాంగ వ్యవస్థల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీస్తున్నారు.

ఇటువంటి దుష్పరిపాలనను కప్పిపుచ్చుకోవడానికి స్వతంత్ర్య దినోత్సవాన్ని ప్రధానమంత్రి మోడీ ఉపయోగపెట్టుకుంటారు. వాగాడంబరంతో నిజాలను కప్పేస్తాడు. మభ్యపెట్టే వాగ్దానాలను చేస్తారు. మనకు తెలుసు మోడీ చెప్పేది ఒకటి, చేసేదొకటి అని.

అందుకే మనం కూడా ప్రజాస్వామ్యాన్ని, లౌకికవాదాన్ని, సామాజిక న్యాయాన్ని ప్రజల జీవన ప్రమాణాలను రక్షించుకునేందుకు ఈ సందర్భంగా కృతనిశ్చయులం కావాలి. ■

> మోడీ ప్రభుత్వం ప్రజాస్వామిక విలువలను విధ్వంసం చేసేందుకు తీసుకుంటున్న నిర్ణయాలు మరో ఎత్తు. మూడవసారి అధికారం చేపట్టిన తర్వాత తీసుకుంటున్న చర్యలను చూసినా నిరంకుశ పాలనపై వేగంగా నడుస్తున్నట్లు గమనించవచ్చు. పౌర, నేర చట్టాలలో ప్రజాస్వామిక హక్కులకు భంగం కలిగే అనేక మార్పులు చేసారు. మీడియా నోరు నొక్కేందుకు కొత్త బ్రాడ్‌కాస్టింగ్ బిల్లును ప్రతిపాదిస్తున్నారు. ఒకదేశం - ఒకే ఎన్నిక కోసం రాజ్యాంగంలో తీవ్ర మార్పులు చేయడానికి సిద్ధమవుతున్నారు. మైనారిటీలకు నష్టం కలిగించే రీతిలో వక్ఫ్ బోర్డు చట్టానికి పలు సవరణలు తెస్తున్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలలో పౌరహక్కులను హరించే అనేక రాక్షస చట్టాలను తెస్తున్నారు. రాజ్యాంగ వ్యవస్థల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీస్తున్నారు.

ప్రాజెక్టు పేరు మారితే చరిత్ర మారుతుందా?



నున్నా నాగేశ్వరరావు
9490098191

ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవాన ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సీతారామ ప్రాజెక్టును రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. దీని కోసం జిల్లాలో పెద్దఎత్తున సన్నాహాలు చేస్తున్నారు. మంత్రుల పర్యటనలు, ట్రయల్ రన్స్ నిర్వహిస్తూ హంగామా చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు ను తెచ్చిన లేదా పూర్తిచేసిన ఘనత తమదంటే తమదేనని కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నాయకులు, మంత్రులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు పోటీలుపడి మీడియా సమావేశాలు నిర్వహిస్తున్నా రు. తమ ఖాతాలో వేసుకోవాలని, తద్వారా రాజకీయ లబ్ది పొందాలని ఆరాటపడుతున్నారు.కానీ ఈ ప్రాజెక్టును సాధించింది ఎవరు? ప్రజల తరపున పోరాడింది ఎవరు? వేల కిలోమీటర్లు పాదయాత్ర చేసింది ఎవరు? ఈ వాస్తవాలు నేడు ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉన్నది.

గోదావరి నది ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే ఎక్కువ దూరం ప్రయాణిస్తుంది. గత కాంగ్రెస్, తెలుగుదేశం పాలకుల నిర్లక్ష్యం వలన వందల టీఎంసీల నీళ్ల వృథాగా సముద్రం పాలవుతున్నాయి. నాగార్జునసాగర్ ఎడమ కాలువ కింద 2.5 లక్షల ఎకరాల ఆయకట్టు ఉన్నప్పటికీ ఒక పంటకు కూడా గ్యారంటీ లేని పరిస్థితి. 1997 నుండి 2003 వరకు వరుసగా అనావృష్టి, కరువు పరిస్థితులు ఏర్పడి ప్రజల జీవితాలు దుర్భరంగా మారాయి. సాగునీరే కాదు, తాగునీరు కూడా దొరకని పరిస్థితి నెలకొన్నది. ఖమ్మం జిల్లాలో సాగు, తాగునీటి సమస్య పరిష్కారానికి గోదావరి జలాలను మళ్లించటమే పరిష్కారమని చాలాకాలంగా ఉభయ కమ్యూనిస్టు పార్టీలు డిమాండ్ చేస్తూ వచ్చాయి.

మహాప్రస్థాన పాదయాత్ర


జిల్లా సమగ్రాభివృద్ధికి, ప్రజల చిరకాల కోరికను తీర్చటానికి తాగు, సాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి దుమ్ముగూడెం ప్రాజెక్టు సాధించటమే ఏకైక పరిష్కారమని సీపీఐ(ఎం) పార్టీ ఖమ్మం జిల్లా కమిటీ భావించింది. ప్రాజెక్టు కార్యరూపం దాల్చటానికి కార్యాచరణను రూపొందించింది. ఆ కార్యాచరణే మహాప్రస్థాన పాదయాత్రగా మారింది. నాటి సీపీఐ(ఎం) ఖమ్మం జిల్లా కార్యదర్శి, ఖమ్మం పార్లమెంట్ మాజీ సభ్యులు కామ్రేడ్ తమ్మినేని వీరభద్రం 2003లో దుమ్ముగూడెం ప్రాజెక్టు సాధనే లక్ష్యంగా పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. వాజేడులో ప్రారంభమైన ఈ యాత్ర సుమారు అయిదు నెలలపాటు 46 మండలాల్లో 2600 కిలోమీటర్లకుపైగా జనప్రవాహంలా సాగి వేలాదిమందితో ఖమ్మంలో ముగిసింది. గ్రామ గ్రామాన ప్రజలు రాజకీయాలకతీతంగా యాత్రకు ఘన స్వాగతం పలికారు. సంపూర్ణ మద్దతు, సంఘీభావాన్ని తెలిపారు. గ్రామాల్లో అనేక సమస్యలు ముందుకొచ్చాయి. అంతర్లీనంగా వాటన్నింటికి దుమ్ము గూడెం ప్రాజెక్టు సాధనే గోదావరి జలాలు జిల్లాలో పారించటమే పరిష్కారంగా ఉన్నది.నాడు సాధ్యం కాదు అన్నవారే నేడు సాధించామం టున్నారు. నాటి టీడీపీ నేతలు యాత్రను అపహాస్యం చేసినా ప్రజలు బ్రహ్మరథం పట్టారు.

2004లో జరిగిన శాసనసభ ఎన్నికలలో 9 స్థానాలకు గాను కాంగ్రెస్, వామపక్షాలు అన్ని స్థానాలు గెలుపొందాయి. టీడీపీ 9 స్థానాలలో ఓటమి పాలైంది. ఖమ్మం, మధిర, భద్రాచలం సీపీఐ(ఎం) గెలుచుకున్నది. జిల్లాలో 8 స్థానాలలో కాంగ్రెస్, వామపక్షాలు కలిసి చేసినప్పటికీ ఖమ్మం అసెంబ్లీ స్థానంలో సర్దుబాటు కుదరలేదు. చతుర్ముఖ పోటీలో మహాప్రస్థాన పాదయాత్ర సారథి తమ్మినేని వీరభద్రం టీడీపీపై పదివేల మెజార్టీతో ఖమ్మం అసెంబ్లీ నుండి గెలుపొందాడు. డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే తమ్మినేని వీరభద్రం 9 మంది శాసనసభ్యులను తీసుకొని ముఖ్యమంత్రిని కలిసి దుమ్ముగూడెం ప్రాజెక్టు మంజూరు చేయమని ఒత్తిడి చేశారు. ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి హామీ నిచ్చారు. రెండేండ్లయినా కార్యరూపం దాల్చకపోవడంతో అసెంబ్లీలో చర్చకు తెచ్చారు. 2007లో దుమ్ముగూడెం ప్రాజెక్టు సాధన కోసం జిల్లా కమిటీ కలెక్టరేట్ ముట్టడికి పిలుపునివ్వగా రెండు రోజులు పదివేల మంది రైతులు పాల్గొన్నారు. అక్కడే వంటావార్పు, బస చేశారు. సీపీఐ(ఎం) ఎమ్మెల్యేలంతా వారితో పాటు భద్రాచలం ఎంపీ మిడియం బాబూరావు పాల్గొన్నారు. త్వరలో ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తానని ముఖ్యమంత్రి మాటగా జిల్లా కలెక్టర్ హామీనివ్వటంతో ఆందోళన విరమించారు.

రాజకీయ ప్రయోజనాల కోసం...

ప్రాజెక్టును వైఎస్ విడగొట్టారు. దుమ్ముగూడెం వద్ద రాజీవ్‌సాగర్ గాను, రుద్రమకోట వద్ద ఇందిరాసాగర్ గాను మార్చి నాలుగు లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు, 2.5 లక్షల ఎకరాల సాగర్ ఆయకట్టు స్థిరీకరణతో పాటు బేతుపల్లి, లంకాసాగర్, వైరా, బయ్యారం, పాలేరు చెరువుల కింద ఆయకట్టు స్థిరీకరణ, తాగునీటి అవసరాలు తీర్చటానికి రూపొందించబడింది.కార్ల యాత్ర అసెంబ్లీకి పాదయాత్రగా మారింది. ఈ రెండు ప్రాజెక్టులకు సుమారు రూ.4వేల కోట్ల అంచనాతో ప్రతిపాదించారు. రెండేండ్లయినా నిధులు కేటాయింపులు చేయలేదు. 2009లో సీపీఐ(ఎం), తెలుగుదేశం, న్యూడెమోక్రసీ పార్టీలతో కలిసి ఖమ్మం నుండి 500 కార్లతో అసెంబ్లీకి వెళ్లాలని కార్యక్రమం చేపట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్బంధాన్ని ప్రయోగించింది. అనుమతి లేదని కార్లను అడ్డుకున్నది. మూడు పార్టీల నాయకులు తమ్మినేని, తుమ్మల నాగేశ్వరరావుల సారథ్యంలో పాదయాత్ర చేపట్టారు.వీరితో పాటు ఆయా పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు వందలాదిగా కదిలారు. ఈ యాత్ర వారం రోజులు సాగి నకిరేకల్ చేరుకునేసరికి నాటి ఆర్థిక మంత్రి రోశయ్య రూ.300 కోట్లు కేటాయిస్తూ బడ్జెట్ పెట్టడంతో యాత్ర ముగిసింది. మోకాళ్ల యాత్ర చేసినా దుమ్ముగూడెం ప్రాజెక్టు సాధ్యం కాదన్న తెలుగుదేశం నాయకులంతా ఈ పాదయాత్రలో పాల్గొనడం కొస మెరుపు.

దుమ్ముగూడెంకు అరకొరగా నిధులు కేటాయించినా



పనులు మాత్రం నత్తనడకన సాగాయి. కృష్ణా జలాలను శ్రీశైలం నుండి పోతిరెడ్డి పాడు సొరంగమార్గం ద్వారా రాయలసీమకు తరలించి, గోదావరి జలాలను నాగార్జునసాగర్‌కు తరలించి ఖమ్మం జిల్లా ప్రజలకు దుమ్ముగూడెం నీళ్ల రాకుండా దుమ్ముగొట్టే కుట్రలకు నాటి వైఎస్ ప్రభుత్వం తెరలేపింది. దాని కోసం దుమ్ముగూడెం నుండి సాగర్ టైల్‌పాండ్ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. 165 టీఎంసీలను తరలించటానికి ప్రాజెక్టు ప్రతిపాదన నిధుల కేటాయింపులు జరిగాయి. దీనిని సీపీఐ(ఎం) పార్టీ తీవ్రంగా వ్యతిరేకించింది. తెలుగుదేశంతో కలిసి జిల్లాలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టింది. జిల్లాకు వచ్చిన ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి పర్యటనను అడ్డుకున్నది.

1500 మందితో మహారైతు పాదయాత్ర

వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి మరణంతో కొంతకాలం సాగర్ టైల్‌పాండ్ ఆగిపోయింది. నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి మళ్లీ కొనసాగించే ప్రయత్నాలు చేశారు. దుమ్ముగూడెం-సాగర్ టైల్‌పాండ్ రద్దు చేయాలి, దుమ్ముగూడెం ప్రాజెక్టును పూర్తిచేయాలి, నిధులివ్వాలనే డిమాండ్‌తో 1500 మంది రైతులతో 2012లో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ రైతు మహాపాదయాత్ర చేపట్టింది. కామ్రేడ్ పోతినేని సుదర్శన్ సారథ్యంలో దుమ్ముగూడెం నుండి భద్రాచలం మీదుగా పాలేరు-ఖమ్మం వరకు 350 కిలోమీటర్లు 23 రోజులు సాగింది. ఈ యాత్రకు ప్రజల నుండి అనూహ్యమైన స్పందన వచ్చింది. ఈ యాత్రలో పాల్గొన్నవారు హైదరాబాద్ ఇందిరాపార్క్‌లో ధర్నాకు దిగారు. అధికార యంత్రాంగంలో కదలిక వచ్చి పనులు ప్రారంభించారు.

సీతారామగా మారిన దుమ్ముగూడెం

ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ఫలితంగా ఆంధ్రప్రదేశ్ రెండుగా విడిపోయి తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. కేసీఆర్ ముఖ్యమంత్రిగా టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటైంది. కేసీఆర్ ప్రభుత్వం రాజకీయ ఆర్థిక ప్రయోజనాల కోసం పెండింగ్ ప్రాజెక్టులను రీడిజైన్ పేరుతో వాటి పేర్లు, అంచనాలు మార్చివేశారు. దుమ్ముగూడెం రాజీవ్‌సాగర్, ఇందిరాసాగర్‌లను మార్చివేసి మొదట శ్రీరామ తదుపరి సీతారామ ప్రాజెక్టుగా మార్చారు. అప్పటి వరకు ఖర్చు పెట్టిన సుమారు రూ.2 వేల కోట్లు వృథా అయ్యాయి. మొదట రూ.13వేల కోట్లు తదుపరి 18 వేల కోట్లతో సీతారామ ప్రాజెక్టు డిజైన్ చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా, మహబూబాబాద్‌లో మొత్తం పది లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ, తాగునీటి పథకాలకు రూపకల్పన చేశారు. రెండేండ్లలో పూర్తిచేస్తామని కేసీఆర్, తుమ్మల నాగేశ్వరరావులు ప్రకటించారు. పదేండ్ల బీ(టీ)ఆర్ఎస్ పాలన ముగిసినా పూర్తికాలేదు. సుమారు రూ.13 వేల కోట్లు ఖర్చు చేశారు. మొదట ప్రతిపాదించిన రోళ్లపాడు, బయ్యారం చెరువులను (బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లుగా మార్చే ప్లానును) మినహాయించారు.

పూర్తికాని ప్రాజెక్టుకు ప్రారంభోత్సవాలా?

తొమ్మిది మాసాల క్రితం 2023లో జరిగిన శాసనసభ ఎన్నికలలో బీఆర్ఎస్ ఓడిపోయింది. రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. అనూహ్యంగా ఖమ్మం జిల్లా నుండే గెలిచిన ఐదుగురిలో ముగ్గురు మంత్రులయ్యారు. ప్రాజెక్టును ఆగస్టు15కల్లా ప్రారంభమవుతుందని ప్రకటించారు. జూలూరుపాడు దాకా వచ్చిన కాల్వను అడ్డం తిప్పి ఏన్కూర్ వద్ద నాగార్జునసాగర్ ఎడమకాల్వలో కలుపుతున్నారు. దీని ఫలితంగా సత్తుపల్లి నియోజకవర్గానికి, వైరా చెరువుకు మాత్రమే నీళ్లు వెళ్తాయి. ఇది మినహా కొత్తగూడెం జిల్లాకు, వైరా, ఖమ్మం, పాలేరు, డోర్నకల్ నియోజకవర్గాలకు ఈ ప్రారంభం ద్వారా ఎకరానికి కూడా నీళ్లు రావు. ప్రధాన కాల్వకు పాలేరు వరకు భూసేకరణ పూర్తికాలేదు. ఇప్పటివరకు అయిన కాల్వకు డిస్ట్రిబ్యూటరీ కాల్వలకు 6500 ఎకరాలు భూసేకరణ జరగాలి, పనులు చేయాలి. ప్రస్తుతం బి.జి.కొత్తూరు, పూసుగూడెం, కమలాపురం పంపుహౌజ్‌లు మాత్రమే పూర్తయ్యాయి. వైరా చెరువు అలుగు పారుతోంది. నాగార్జునసాగర్ నిండింది. ఎడమ కాల్వకు తక్షణం నీళ్లవసరం లేదు. 104 కిలోమీటర్ల ప్రధాన కాల్వను పూర్తిచేసి పాలేరుకు అనుసంధానం చేస్తే రబీ సీజన్‌కు సత్తుపల్లికి కూడా నీళ్లివ్వచ్చు. అసంపూర్తిగా, అసమగ్రంగా ఉన్న ప్రాజెక్టును ప్రారంభించటమంటే పేరు కోసమో, గత ప్రభుత్వం చేయలేదు గనుక తాము చేశామని చెప్పుకోవటానికి మాత్రమే ఇది ఉపయోగపడుతుంది.

సమగ్రంగా ప్రాజెక్టును పూర్తిచేయాలి

మండల స్థాయి, గ్రామస్థాయి పాదయాత్రలు, మహాప్రస్థాన, మహారైతు పాదయాత్రలు, అసెంబ్లీకి పాదయాత్ర, హైదరాబాద్‌లో ధర్నాలు, కలెక్టరేట్ ముట్టడులు, మండల రెవెన్యూ ఆఫీసుల దిగ్బంధనాలు, అరెస్టులు, కేసులు, నిర్బంధాలు, లాఠీ ఛార్జీలు ఎదుర్కొని ప్రభుత్వాల మెడలు వంచి ఈ ప్రాజెక్టును సాధించింది సీపీఐ(ఎం). మిగతా వామపక్షాలు కూడా తమ తమ పద్ధతుల్లో ఆందోళనలు, పోరాటాలు చేశాయి. గత కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాల అసమర్థత, నిర్లక్ష్యం వలన రెండు దశాబ్దాలు గడిచినా పూర్తికాలేదు. కొత్త సీసాలో పాత సారాయిలాగా అదే నాయకులు మంత్రులుగా ఉన్నారు. ప్రజలు మూల్యం చెల్లిస్తున్నారు. రూ.4వేల కోట్లతో పూర్తయ్యే పనులు 20 వేల కోట్లు దాటుతున్నాయి. ఆగస్టు 15న అరకొరగా ప్రారంభించి వదిలేయకుండా పినపాక, కొత్తగూడెం, అశ్వారావుపేట, సత్తుపల్లి, వైరా, ఇల్లందు, ఖమ్మం, డోర్నకల్, మధిర నియోజకవర్గాలతో పాటు దుమ్ముగూడెం వైపు ప్రగళ్లపల్లి లిప్టును కూడా పూర్తిచేసి పదిలక్షల ఎకరాలకు నీళ్లివ్వాలి. రోళ్లపాడు, బయ్యారం, వైరా, బేతుపల్లి, లంకాసాగర్, తుమ్మల చెరువు తదితర చెరువులను అనుసంధానం చేయాలి. అప్పుడే ఈ ప్రాజెక్టు పూర్తవుతుంది. అప్పటిదాకా సీపీఐ(ఎం) ప్రజల పక్షాన పోరాడుతూనే ఉంటుంది.

> మండల స్థాయి, గ్రామస్థాయి పాదయాత్రలు, మహాప్రస్థాన, మహారైతు పాదయాత్రలు, అసెంబ్లీకి పాదయాత్ర, హైదరాబాద్‌లో ధర్నాలు, కలెక్టరేట్ ముట్టడులు, మండల రెవెన్యూ ఆఫీసుల దిగ్బంధనాలు, అరెస్టులు, కేసులు, నిర్బంధాలు, లాఠీ ఛార్జీలు ఎదుర్కొని ప్రభుత్వాల మెడలు వంచి ఈ ప్రాజెక్టును సాధించింది సీపీఐ(ఎం). మిగతా వామపక్షాలు కూడా తమ తమ పద్ధతుల్లో ఆందోళనలు, పోరాటాలు చేశాయి. గత కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాల అసమర్థత, నిర్లక్ష్యం వలన రెండు దశాబ్దాలు గడిచినా పూర్తికాలేదు. కొత్త సీసాలో పాత సారాయిలాగా అదే నాయకులు మంత్రులుగా ఉన్నారు. ప్రజలు మూల్యం చెల్లిస్తున్నారు. రూ.4వేల కోట్లతో పూర్తయ్యే పనులు 20 వేల కోట్లు దాటుతున్నాయి.

నేడు మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయాల్లో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు

జెండా ఎగురవేయనున్న ఎంపీ ఆర్ఆర్ఆర్

నవతెలంగాణ- ఖమ్మం

స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖమ్మం, కూసుమంచి క్యాంపు కార్యాలయాల్లో వేడుకలను నిర్వహిస్తున్నట్లు మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఎనిమిది గంటలకు జెండా వందనం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఖమ్మం క్యాంపు కార్యాలయంలో జరిగే వేడుకల్లో ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి జెండా ఎగురవేస్తారని తెలిపారు. ఖమ్మం, పాలేరు నియోజకవర్గాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

వైద్యశిబిరం



నవతెలంగాణ-ఖమ్మంరూరల్

ఖమ్మంలోని ప్రభుత్వ ఆయుర్వేదిక్ వైద్యశాల ఆధ్వర్యంలో మండల పరిధిలోని సాయిగనర్ కాలనీ, భద్రాద్రి కాలనీ, రాజీవ్ గృహ కల్ప కాలనీ, నాలుగో తరగతి ఉద్యోగుల కాలనీలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందజేశారు. పారిశుద్ధ్యం, ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో క్యాంపు ఇన్చార్జ్ వైద్యులు దశరథ్ ,సిబ్బంది ప్రకాశ్, అన్సర్, బాబు, గణపతిరెడ్డి, వెంకటరాజు, హరికుమార్, సురేశ్, పోలేపల్లి పంచాయతీ కార్యదర్శి ఇమామ్, సిబ్బంది మున్నా పాల్గొన్నారు.

గురుకుల కళాశాలలో లెక్చరర్ పోస్టుల భర్తీకి దరఖాస్తు

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

మండలంలోని కోదాడ క్రాస్ రోడ్ వద్ద గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్, స్టాటిస్టిక్స్, ఫిజిక్స్, మైక్రో బయాలజీలలో బోధన కోసం పార్ట్ టైం ప్రాతిపదికన లెక్చరర్లుగా పని చేయుటకు ఆసక్తిగల మహిళా అభ్యర్థుల నుండి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు సంబంధిత పోస్ట్-గ్రాడ్యుయేషన్‌లో 55 శాతం మార్కులు పొంది ఉండాలని సూచించారు. పీహెచ్.డి, నెట్, సెట్ ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు. అభ్యర్థులు తమ దరఖాస్తులకు సర్టిఫికెట్ కాపీలను జత చేసి ఈ నెల 16వ తేదీ సాయంత్రం 4 గంటలలోగా గురుకుల మహిళా డిగ్రీ కళాశాల (ఎస్‌బిసిఇ విద్యాసంస్థల క్యాంపస్, కోదాడక్రాస్‌రోడ్ మద్దులపల్లి) ప్రిన్సిపాల్ కార్యాలయంలో అందజేయాలని శర్మ తెలిపారు. స్క్రీనింగ్ టెస్ట్, డేమో ద్వారా ఉద్యోగ నియామకం ఉంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు. వివరాలకు ఈ నంబర్‌ను 95154 35518 సంప్రదించవల్సిందిగా ప్రిన్సిపాల్ కోరారు.



సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి స్రవంతి

నవతెలంగాణ - బోనకల్

సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ నిత్యం అప్రమత్తంగా ఉండాలని మండల ప్రాథమిక వైద్యాధికారి వేముల స్రవంతి కోరారు. జిల్లా వైద్యాధికారుల ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని రైతు వేదిక నందు బోనకల్ మండల గ్రామీణ వైద్యులకు సీజనల్ వ్యాధుల పట్ల బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ అవగాహన సదస్సులో వేముల స్రవంతి మాట్లాడుత గ్రామీణ వైద్యులకు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించి, జ్వరం కేసులు నమోదు అయినపుడు వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందికి సమాచారం ఇవ్వాలని కోరారు. ఎటువంటి ఐవి యాంటీబయోటిక్స్ గాని అవి ఫ్లూయిడ్స్ కానీ వాడొద్దని ఆర్ఎంపీలకు సూచించారు. కేవలం ఫస్ట్ ఎయిడ్ వైద్యం మాత్రమే ఆర్ఎంపీలు చేయాలన్నారు. రోజు పరిస్థితి ఏమాత్రం తేడా అనిపించినా వెంటనే మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రిఫర్ చేయాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువమంది పేద ప్రజలు ఉంటారని అటువంటి వారిని ప్రభుత్వ ఆసుపత్రులకే పంపించాలని ఆర్ఎంపీలను కోరారు. ప్రభుత్వ ఆసుపత్రులపై కొంతమంది కాపాలు ఉన్నాయని అపోహలను తొలగించుకొని ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్య సేవలు వినియోగించుకోవాలని కోరారు. గ్రామాల్లో ఉండే సిబ్బందితో ఆర్ఎంపీలు సమన్వయం చేసుకొని సీజన్ జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఒకరికొకరు సహాయ సహకారాలు అందించుకోవాలని కోరారు. ఈ అవగాహన సదస్సులో ఆర్ఎంపీ డబ్ల్యూ ఏ జిల్లా అధ్యక్షులు బొమ్మనబోయిన కొండల్ రావు ఆ సంఘం జిల్లా నాయకులు షేక్ హస్సన్ మాట్లాడుతూ ప్రభుత్వ సిబ్బందికి తాము పూర్తిగా సహకరిస్తామన్నారు. ఈ అవగాహన సదస్సులో గ్రామీణ వైద్యులు, సిహెచ్ఓ శ్రీనివాసరావు, సూపర్వైజర్ మంద దానయ్య ఫిమేల్ సూపర్వైజర్స్ శ్రీ లక్ష్మీ శోభ ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జనరల్ యూనివర్శిటీకి మోక్షం ఎప్పుడు?

నవతెలంగాణ-వైరాటౌన్

రెండు దశాబ్దాల పోరాటం, ఖమ్మం జిల్లా లక్షలాది మంది విద్యార్థుల ఆకాంక్ష, ప్రభుత్వ జనరల్ యూనివర్సిటీ ఏర్పాటు ఎప్పుడు? రెండు దశాబ్దాల కాలంలో నలుగురు ముఖ్యమంత్రులు ఖమ్మం విద్యార్థులకు ఇచ్చిన హామీ నేటి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమలు చేయాలని, ఆగస్టు 15న ఖమ్మం జిల్లా పర్యటన వైరా నియోజకవర్గంకు వస్తున్న సందర్భంగా ముఖ్యమంత్రి యూనివర్సిటీ డిమాండ్‌పై స్పష్టమైన హామీ ఇవ్వాలని, రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న 8 వేల కోట్లు స్కాలర్‌షిప్స్, రియంబర్స్మెంట్ విడుదల చేయాలనీ, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని పీడీఎస్‌యు ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వైరా నియోజకవర్గ కేంద్రంలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యు ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగూరి వెంకటేష్, పివైఎల్ రాష్ట్ర నాయకులు మందా సురేష్, శ్రీను, లక్ష్మణ్, సంధ్య ప్రియాంక, అనూష, అక్బర్, ఝాన్సీ, జాన్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు పట్టువస్త్రాలు

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లిలో కొలువై ఉన్న ముత్యాలమ్మ తల్లి అమ్మవారికి బుధవారం బోనాల సందర్భంగా మాజీ ఎంపీటీసి ఇమ్మడి రమాదేవి-తిరుపతిరావు దంపతులు పట్టు వస్త్రములను సమర్పించారు. ముత్యాలమ్మ తల్లికి పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు పెద్ద ఎత్తున మేళతాళాలతో ఊరేగింపుగా తరలి వచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో గ్రామ పెదలు తురక నారాయణ, చెవుల చందు, ఓరుగంటి రంగనాథ్, తొగరు శ్రీను, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

న్యూలక్ష్మీపురంలో డెంగ్యూ కేసు నమోదు

నవతెలంగాణ-ముదిగొండ

మండలపరిధిలో న్యూలక్ష్మీపురంలో డెంగ్యూ కేసు బుధవారం నమోదయింది. గ్రామంలోని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ వెంకటరమణ సందర్శించి డెంగ్యూ కేసు నమోదైన కుటుంబాన్ని పరామర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైనందున ప్రజలు ఆరోగ్యానికి నియమాలను పాటిస్తూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.వైద్య సిబ్బంది గ్రామాలలో అందుబాటులో ఉండి ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు.వైద్య సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఆయన వెంట మండల వైద్యాధికారి అంకం అరుణాదేవి వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

వయనాడ్ వరద బాధితుల సహాయ నిధికి విరాళం



నవతెలంగాణ-ఖమ్మం

కేరళ వయనాడ్ వరద బాధితుల సహాయ నిధికి ఖమ్మం సత్యసాయి ధ్యాన మండలి సభ్యులు రూ..5వేల విరాళం సేకరించి సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరావుకు పార్టీ జిల్లా కార్యాలయం సుందరయ్య భవనంలో అందజేశారు. మానవతా దృక్పథంతో వరద బాధితుల సహాయనిధికి విరాళం సేకరించి అందజేసినందుకు సత్యసాయి ధ్యాన మండలికి నున్నా ధన్యవాదాలు తెలిపారు. సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో సత్యసాయి ధ్యాన మండలి అధ్యక్షులు పి.శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి దామా స్వరూప, మండలి సభ్యులు చల్లా శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, పార్టీ జిల్లా కమిటీ సభ్యురాలు పారుపల్లి ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

సీఎం గారూ...సమస్యలు పరిష్కరించండి

ముఖ్యమంత్రికి సీపీఐ(ఎం) బహిరంగ లేఖ

నవతెలంగాణ-ఖమ్మం

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తొలిసారి ఖమ్మం జిల్లాకు రావటాన్ని స్వాగతిస్తున్నామని, ఈ జిల్లా అభివృద్ధి కోసం పలు సమస్యలు పరిష్కరించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు కోరారు. ఈ మేరకు సీఎంకు ఆయన బుధవారం బహిరంగ లేఖ రాశారు.

- పూర్తికాని సీతారామ ప్రాజెక్టును మీరు ప్రారంభించినప్పటికీ, దానిని పాలేరు వరకు పూర్తి చేయటానికి కావల్సిన నిధులు కేటాయించాలి.
- ఖమ్మం పరిసర జిల్లాలకు కేంద్రంగా విద్యారంగంలో అభివృద్ధి చెందుతుంది. ఇప్పటికే ఉన్న ఎస్ఆర్అండ్ బీజీఎన్ఆర్ కళాశాల మరియు పీజీ కళాశాలలను కలిపి యూనివర్శిటీని మంజూరు చేయాలి.
- ఖమ్మంలో నిమ్స్ తరహాలో హాస్పిటల్ కట్టిస్తానని గత ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ యిచ్చి అమలు చేయలేదు. మీరు దానిని మంజూరు చేసి పేదలకు, మధ్య తరగతి వర్గాలకు ఉచిత వైద్యాన్ని అందించాలి.
- జిల్లాలో జర్నలిస్టులు ఇళ్ళ స్థలాల కోసం ఎంతో కాలంగా ఎదురు చూస్తున్నారు. గత పాలకులు మోసం చేశారు. మీరు జర్నలిస్టులందరికీ ఇళ్ళ స్థలాలు యిచ్చి ఇందిరమ్మ పథకంలో 5 లక్షలు మంజూరు చేసి ఆదుకోవాలి.
- ఖమ్మం జిల్లాలో గ్రానైట్ మినహా పరిశ్రమలు ఏమీ లేవు. లక్షల సంఖ్యలో చదువుకున్న నిరుద్యోగ యువత ఉంది. వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ సెంటర్ నెలకొల్పాలి. కూరగాయలు, యితర ఆహార పంటలు నిల్వ చేసుకొనే విధంగా ప్రభుత్వం శీతల గిడ్డంగులు నిర్మించాలి. విత్తనాలు, చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాలను నెలకొల్పటం ద్వారా స్వయం ఉపాధి, ఉద్యోగాలు కల్పించవచ్చు.



- ఖమ్మంలో ఐ.టి.హబ్‌ను విస్తరిస్తే హైద్రాబాద్, బెంగళూరు, పూణె, చెన్నై లాంటి దూర ప్రాంతాలకు వెళ్ళే యువత ఇక్కడే ఉద్యోగాలు పొందవచ్చు. ఐటి పరిశ్రమలు పెట్టే వారికి ఖమ్మంలో ప్రాధాన్యత యివ్వాలి.
- రైతు రుణమాఫీ మార్గదర్శకాలలో తెల్లరేషన్ కార్డును తొలగించాలి. దాని వలన మీరు ప్రకటించిన రుణమాఫీ లక్ష కూడా వర్తించనివారు అధిక సంఖ్యలో ఉన్నారు. షరతులు లేకుండా 2 లక్షల రుణమాఫీని వైరాలో ప్రకటించాలి. జీఓ ఇవ్వాలి.
- జిల్లాలో మంజూరైన 100 పడకల ఆసుపత్రులకు వెంటనే సిబ్బందిని కేటాయించాలి. జేఎన్‌టీయు, నర్సింగ్ కళాశాలలు మంజూరైనప్పటికీ, వాటికి సిబ్బందిని పూర్తిగా కేటాయించలేదు. సొంత భవనాలు నిర్మించాలి.
- మీరు ప్రకటించిన 6 గ్యారెంటీలను పొందాలంటే పెద్ద సంఖ్యలో ఉన్న అర్హులకు తెల్లరేషన్ కార్డులు లేకపోవటంతో పొందలేకపోతున్నారు. కనుక మంజూరు చేయగలరు.
- ఖమ్మం నగరానికి మున్నేరు వరద ముంపును నివారించటానికి మంజూరైన ఆర్‌సిసి వాల్‌కు నిధులు మంజూరు చేసి, పనులు ప్రారంభించాలి.

ఈ సమస్యలపై స్పందించాలని, వైరా సభలో మీరు ఖమ్మం జిల్లాకు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నామని నున్నా ఆ లేఖలో పేర్కొన్నారు.

బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అస్తవ్యస్తం

ఆ పార్టీవి చిల్లర రాజకీయాలు

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



నవతెలంగాణ- వైరా

బీఆర్ఎస్ పదేళ్లపాటు కొనసాగిన అస్తవ్యస్త పాలన వల్ల రాష్ట్రం మొత్తం చిన్నాభిన్నమైందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు ధ్వజమెత్తారు. ఖమ్మం జిల్లా వైరాలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొనే సభావేదిక ఏర్పాట్లను తుమ్మల బుధవారం సాయంత్రం పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు ఏ మాత్రం సిగ్గు లేకుండా అసత్యప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. ఆ ప్రభుత్వ హయాంలో రైతులను అన్ని విధాలుగా మోసం చేసి ఇప్పుడు చిల్లర రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు కూడా పూర్తికాకముందే 42 లక్షల మంది రైతులకు రూ.31వేల కోట్ల రూ.రెండులక్షల రుణమాఫీని గురువారంతో అమలు చేస్తున్నామని తెలిపారు. కనీసం బిడ్డ పుట్టడానికైనా 9 నెలల సమయం పడుతుందని, అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అదికారంలోకి వచ్చి తొమ్మిదినెలలు కూడా కాకముందే బీఆర్ఎస్ నాయకులు చిల్లర రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ఇలాంటి చిల్లర రాజకీయాలను తాము పట్టించుకోబోమని స్పష్టం చేశారు. ఐదేళ్ల ముందు రైతుల రుణాలను మాఫీ చేయలేని బీఆర్ఎస్ నాయకులు ఇప్పుడు మొసలికన్నీరు కారుస్తున్నారని ఎద్దేవా చేశారు. రైతులను రెచ్చగొట్టే విధంగా కాంగ్రెస్‌ను విమర్శిస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కలెక్టర్ ముజమ్మిలా ఖాన్, సీపీ సునీల్ దత్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, మార్క్ఫెడ్ రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు నల్లమల వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శీలం వెంకట నర్సిరెడ్డి, టిపిసిసి కార్యదర్శి కట్ల రంగారావు, కొప్పురావురి శబరి, పనితీ సైదులు తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం పూర్తి చేయాలి

పేదలకు పంపిణీ చేయాలి : సీపీఐ(ఎం)

నవతెలంగాణ-నేలకొండపల్లి

మండల కేంద్రంలో అసంపూర్తి నిర్మాణంతో నిరుపయోగంగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను తక్షణమే నిరుపేదలైన లబ్ధిదారులకు కేటాయించి పంపిణీ చేయాలని నేలకొండపల్లి సిపిఐ(ఎం) పట్టణ కార్యదర్శి మందడపు మురళీకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని కూసుమంచి రోడ్‌లో స్థానిక మోడల్ డిగ్రీ కళాశాల ప్రక్కనగల అసంపూర్తి నిర్మాణంతో ఉన్న 48 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని నిరుపేద లబ్ధిదారుల సొంతింటి కల సాకారం చేయాలనే లక్ష్యంతో గత బిఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా అసంపూర్తిగా నిలిచిపోయాయన్నారు. ఏళ్లు గడుస్తున్నా ఇండ్ల నిర్మాణాన్ని పూర్తి చేయకపోవడం, పేదలకు పంపిణీ చేయకపోవడంతో నిరుపయోగంగా ఉండి పలు అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారుతున్నాయన్నారు. కోట్ల రూపాయలు నిధులు వెచ్చించి నిర్మాణాలు ప్రారంభించిన ప్రభుత్వ నిర్లక్ష్యం, అధికారుల అలసత్వంతో పూర్తి చేయకపోవడంతో పాటు పేదలకు పంపిణీ చేయకపోవడంతో ప్రజాధనం దుర్వినియోగం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అసంపూర్తిగా నిరుపయోగంగా ఉన్న 48 డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణాలను తక్షణమే పూర్తి చేసి పేదలకు పంపిణీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేని యెడల పేదలందరిని సమీకరించి ఆందోళనకు పూనుకుంటామని హెచ్చరించారు.





కార్పొరేట్‌శక్తులకు ఏజెంట్లుగా పాలకులు : సీపీఐ(ఎం)

నవతెలంగాణ- నేలకొండపల్లి

జాతీయ రహదారుల పేరుతో ప్రభుత్వాలు ప్రాణాల్ని హరిస్తూ కార్పొరేట్‌శక్తులు, పెట్టుబడిదారులకు ఏజెంట్లుగా సేవ చేస్తున్నాయని సిపిఐ(ఎం) మండల కార్యదర్శి కెవి రామిరెడ్డి, పట్టణ కార్యదర్శి మందడపు మురళీకృష్ణ, ఆమ్‌ఆద్మీ పార్టీ తెలంగాణా కోర్ కమిటీ సభ్యులు, ప్రముఖ కవి, రచయిత నల్లమోతు తిరుమలరావు విమర్శించారు. బుధవారం ఆమ్‌ఆద్మీ పార్టీ ఆద్వర్యంలో పసుమర్తి శ్రీనివాస్ చేపట్టిన నిరసన దీక్షను వారు ప్రారంబించి ప్రసంగించారు. ప్రజల భూములు గుంజుకొని, టోల్ టాక్స్ పేరుతో ఏళ్ళ తరబడి జేబులు కొల్లగొట్టడం కోసం అవకాశం కల్పిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలు సౌకర్యం గురించి పట్టించుకోవడం లేదని విమర్శించారు. అదానీ, అంబానీ, మెగా కృష్ణారెడ్డి లాంటి కార్పొరేట్‌శక్తుల చేతిలో ప్రభుత్వాలు కీలుబొమ్మలుగా మారాయని దుయ్యబట్టారు. జాతీయ రహదారి పేర ప్రభుత్వాలకు, కార్పొరేట్ శక్తులకు లాభాలు చేకూర్చుతూ భూ నిర్వాసితులుగా, బాధితులుగా, సౌకర్యాలు లేనివారుగా ప్రజలు ఉండాలా? అని ప్రశ్నించారు. పేద విద్యార్థులు ప్రజలకు నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం గురించి పట్టించుకోని ప్రభుత్వాలు కమీషన్ల కోసం కార్పొరేట్ శక్తులకు దళారీలుగా మారి సేవ చేస్తున్నాయని మండిపడ్డారు. పసుమర్తి శ్రీనివాస్ మాఊరికి దారేది? పేరుతో చేస్తున్న నిరసన దీక్షకు అన్నివర్గాలు మద్దతు తెలపాలని కోరారు. ప్రముఖ పర్యాటక కేంద్రం, చారిత్రక ప్రాధాన్యత కలిగిన పట్టణం నేలకొండపల్లి అని, ఆసియా ఖండంలోనే పెద్ద బౌద్ధ స్తూపం, భక్త రామదాసు జన్మస్థలం, విస్తరించిన గ్రానైట్ పరిశ్రమ, చెరుకు కర్మాగారం తదితర ప్రాదాన్యతల రీత్య నేలకొండపల్లి పట్టణం వద్ద నేషనల్ హైవేకి అప్రోచ్ రోడ్డు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. భవిష్యత్లో ఈ విషయంలో జరిగే ఆందోళనలో ప్రజలు, ప్రజాస్వామ్యశక్తులు కలిసి రావాలని కోరారు. ఈ దీక్షా శిబిరాన్ని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అద్యక్షులు స్వర్ణ, సుబ్బారావు, జిల్లా సహాయ కార్యదర్శి సిద్దెల రాంబాబు, సిపిఎం నాయకులు కొత్తా రమేష్, అభిషేక్, బిఆర్ఎస్ నాయకులు నాగుబండి శ్రీనివాసరావు, ఎండి వాజీద్, బసిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు జేసిబి కృష్ణా, యంయల్ పార్టీ నాయకులు పగిడికత్తుల రామదాస్ సందర్శించి సంపూర్ణం సంఘీభావం తెలిపారు.

ముఖ్యమంత్రి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి

అగ్రిగోల్డ్ ఆస్తులను వేలం వేసి బాధితులకు డబ్బులు చెల్లించాలి

అగ్రిగోల్డ్ బాధితుల సంఘం వైరా నియోజకవర్గ ఇంచార్జి యర్రా బాబు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గుడిమెట్ల రజిత

నవతెలంగాణ-వైరాటౌన్

తెలంగాణ రాష్ట్రంలోని అగ్రిగోల్డ్ ఆస్తులను వేలం వేసి బాధితులకు డబ్బులు చెల్లించి న్యాయం చేస్తామని ఎన్నికల సమయంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని అగ్రిగోల్డ్ బాధితుల సంఘం వైరా నియోజకవర్గం ఇంచార్జి యర్రా బాబు, తెలంగాణ అగ్రిగోల్డ్ బాధితుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గుడిమెట్ల రజిత డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో అగ్రిగోల్డ్ బాధితుల సంఘం వైరా అధ్యక్షులు యామాల గోపాలరావు అధ్యక్షతన జరిగిన అగ్రిగోల్డ్ బాధితులు, ఏజెంట్ల సమావేశంలో యర్రా బాబు, గుడిమెట్ల రజిత మాట్లాడుతూ 1995లో ప్రారంభించబడిన అగ్రిగోల్డ్ కంపెనీలో డిపాజిట్ చేస్తే ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మించి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రంలో దాదాపు 5000 కోట్ల రూపాయిల డిపాజిట్లు వసూలు చేశారని అన్నారు. 2015లో డిపాజిట్‌దారులకు డబ్బులు తిరిగి ఇవ్వావలసి వచ్చినప్పుడు అగ్రిగోల్డ్ మేనేజ్మెంట్ చేతులెత్తేసిందని, మేనేజ్మెంట్‌ను అరెస్టు చేసి గత ప్రభుత్వాలు చేతులు దులుపుకున్నాయన్నారు. తమ కష్టార్జితాన్ని నష్టపోయామని, మోసపోయామని అనుకున్న కొంతమంది డిపాజిట్‌దారులు ఆత్మహత్యలు చేసుకున్నారని, మరి కొంతమంది డిపాజిట్‌దారులు వారిని చేర్పించిన ఏజెంట్ల ఇండ్ల మీద దాడులు చేసి కొట్టారని అన్నారు. డిపాజిట్ దారులు ఒత్తిడితో రాష్ట్ర ప్రభుత్వాలు అగ్రిగోల్డ్ ఆస్తులను జప్తు చేసి బాధితులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కానీ ఆచరణలో ఒక ఆంధ్రప్రదేశ్లో తప్ప ఎక్కడా డిపాజిట్‌దారులకు డబ్బులు రాలేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అగ్రిగోల్డ్ బాధితులు దాదాపు 5 లక్షల మంది ఉన్నారు. వారి మొత్తం డిపాజిట్లు 500 కోట్ల రూపాయల వరకు ఉంటాయన్నారు. తెలంగాణలో అగ్రిగోల్డ్ ఆస్తులు 1000 కోట్లకు పైగా ఉన్నాయి. అగ్రిగోల్డ్ కంపెనీ మూతబడి తొమ్మిది సంవత్సరాలు గడిచినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఎన్నికల సమయంలో అగ్రిగోల్డ్ బాధితులు రేవంత్‌రెడ్డిని కలిసినప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో మిట్టపల్లి రాఘవరావు, గారపాటి అశోక్, కొండా, ముత్యాల రాజు, కొండా రామకృష్ణ, దాసరి హరీష్, ఇజ్జగాని నాగేశ్వరరావు, వేణు, సైదులు, పద్మ, రాజు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



న్యూవిజన్‌లో బోనాల సందడి

నవతెలంగాణ-ఖమ్మం

పోతురాజుల ఆటలతో పులివేశగాళ్ల నృత్యాలతో శివసత్తుల పూనకాలతో అంగరంగ వైభవంగా సాగేటటువంటి బోనాల పండుగను ఈ బుధవారం నగరంలోని న్యూ విజన్ పాఠశాలలో ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.డి అబాద్‌అలీ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర పండుగ అయినటువంటి బోనాలు ఆవశ్యకతను విద్యార్థులకు తెలపడానికి ప్రత్యేకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని పాఠశాల అకడమిక్ డైరెక్టర్ సిహెచ్ కార్తీక్ తెలిపారు. అమ్మవారి వేషంలో కొందరు చిన్నారులు అలరించారు. పులివేశం, పోతురాజు, శివ సత్తుల సమూహం తోడు రాగా బోనాలు ధరించిన చిన్నారులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. పాఠశాల ప్రాంగణం అంత డప్పు శబ్దాలతో మారుమ్రోగింది. తదనంతరం అమ్మవారిని స్తుతిస్తూ చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల అకడమిక్ డైరెక్టర్ సిహెచ్ కార్తీక్, పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.డి అబాద్ అలీ మరియు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



వైరా సభలో ఖమ్మంకు ఐటిడిఎ ప్రకటించాలి

తెలంగాణ గిరిజన సంఘం

జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి గిరిజన సంఘం లేఖ



నవతెలంగాణ-వైరాటౌన్

ఖమ్మం జిల్లాలోని గిరిజనుల సమస్యలను పరిష్కరించాలని, ఆశ్రమ పాఠశాలకు పర్మినెట్ టీచర్ పోస్టు నియమించాలని, ప్రతి గ్రామపంచాయతీ అభివృద్ధికి 25 లక్షల రూపాయలు కేటాయించాలని, గిరిజన బెస్ట్ అవైలబుల్ సీట్ల సంఖ్య ప్రతి జిల్లాకు 300 కేటాయించి ప్రతి విద్యార్థికి ఎనభై వేల రూపాయల స్కాలర్షిప్ చెల్లించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తెలంగాణ గిరిజన సంఘం ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం బుధవారం లేఖ రాశారు.

-తెలంగాణ రాష్ట్ర క్యాబినెట్‌లో గిరిజన సంక్షేమ శాఖకు మంత్రిని నియమించాలి.

-నాలుగు లక్షల మంది గిరిజనుల సంక్షేమం అభివృద్ధి కొరకు వైరా సభలో ఖమ్మంకు ఐటీడీఏ మంజూరు చేయాలి.

-ఏజెన్సీ మండలం కారేపల్లి ప్రజలకు వైద్య అవసరం నిమిత్తం 50 పడకల ఆసుపత్రి మంజూరి చేయాలి.

-జిల్లాలో సాగు చేస్తున్న పోడు రైతులకు హక్కులు కల్పించాలి.గిరి వికాస్ ద్వారా బోర్లు, విద్యుత్ సౌకర్యం మంజూరు చేయాలి.

-సీతారామ ప్రాజెక్ట్ ద్వారా గిరిజన మండలాలకు సాగునీటి సౌకర్యం అందే విధంగా డిజైన్ రూపొందించాలి.

-గిరిజన ఆశ్రమ, గురుకులాల పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించాలి నాణ్యమైన భోజనం అందించే విధంగా మెనును పెంచాలి.

-కొణిజర్ల మండలం లాలాపురం, అంజనాపురం వద్ద వాగులపై హై లెవెల్ బ్రిడ్జి మంజూరు చేయాలి.

-ఏన్కూరు మండలం కొత్త మేడిపల్లి గ్రామానికి రహదారులు, విద్యుత్ సౌకర్యం, రేషన్‌కార్డులు, వలస గుత్తికోయలు గిరిజనులకు సర్టిఫికెట్లు వచ్చే విధంగా చర్యలు చేపట్టాలి.

-వైరాలో నిర్మిస్తున్న గిరిజన భవన్‌కు అదనపు నిధులు కేటాయించి పనులు పూర్తి చేసే విధంగా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలి.

-జూలూరుపాడు మండలం పాపగోలు అటవీ ప్రాంతం నుండి నుండి కారేపల్లి మండలం చీమలపాడు వైపు అటవీ ప్రాంతంలో స్వరంగం ద్వారా రహదారి నిర్మించాలి.

-వైరా, ఏన్కూర్, కారేపల్లిలో డిగ్రీ కళాశాల మంజూరు చేయాలి. జూలూరుపాడులో జూనియర్ కళాశాల మంజూరు చేయాలి.

-పల్లె దావఖానలో డాక్టర్లు, తగిన స్థాయిలో సిబ్బందిని నియమించాలి. ఇల్లు లేని పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించి ఇండ్లు నిర్మించి ఇవ్వాలని లేఖలో కోరారు.

వరదబాధితుల సహాయార్థం విరాళాల సేకరణ

నవతెలంగాణ-తల్లాడ



కేరళలోని వయనాడు వరద బాధితులు సహాయార్థం సీపీఐ(ఎం) మండల ఇన్‌చార్జి మాదినేని రమేష్ ఆధ్వర్యంలో మండల కమిటీ పట్టణంలో బుధవారం విరాళాలు సేకరించింది. రూ.11,093 నిధులు సేకరించి, వరద బాధితుల సహాయ నిధికి పంపించినట్లు మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యురాలు మాచర్ల భారతి, శీలం సత్యనారాయణరెడ్డి, నల్లమోతు మోహన్‌రావు, శీలం పకీరమ్మ, కళ్యాణం కృష్ణయ్య, షేక్ మస్తాన్, సత్తెనపల్లి నరేషు, కృష్ణయ్య, చల్ల నాగేశ్వరరావు, రావూరి కృష్ణయ్య, పామర్తి సత్యం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఈసీ మెంబర్‌గా 'వరికూటి'

నవతెలంగాణ-ఖమ్మం



హ్యాండ్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సెక్రెటరీ ఆఫ్ జనరల్ ప్రీత్ పాల్ సింగ్ సలోజన వరికూటి మోహన్‌ను తెలంగాణ రాష్ట్ర హ్యాండ్ బాల్ అసోసియేషన్ లో ఈసీ మెంబర్‌గా ఎన్నుకున్నారు. ఇందుకుగాను ఖమ్మం జిల్లా అన్ని గేమ్స్ సంఘాల సెక్రటరీలు, ప్రెసిడెంట్లు కోచ్‌లు, క్రీడాకారులు సీనియర్ హ్యాండ్ బాల్ క్రీడాకారులు, వివిధ సంఘాల నాయకులు, పెద్దలు వరికూటి మోహన్ అభినందించారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ కొంత కాలం స్టేడియంలో హ్యాండ్బాల్ కోర్టులో శిక్షకుడిగా వ్యవహరించానని, తన సేవలు గుర్తించి రాష్ట్ర సంఘంలో ఈసీ సభ్యుడిగా తీసుకోవడం జరిగిందన్నారు. నూతన కార్యవర్గంలో ఈ అవకాశం కల్పించినందుకు రాష్ట్ర సంఘం నాయకులకు, ప్రతి ఒక్కరికి పేరుపేరునా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

దశాబ్దాల పోరాటాల ఫలితమే నేటి 'సీతారామ'

నవతెలంగాణ-వైరా

ఉమ్మడి ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలే శరణ్యమని నమ్మి దాదాపు రెండు దశాబ్దాల పోరాట ఫలితమే పాక్షికంగా నైనా గోదావరి నీళ్ళు వస్తున్నాయి. పాదయాత్రలు, ఆందోళనలు, పోరాటాల ఫలితంగా దుమ్ముగూడెం ప్రాజెక్టు నిర్మాణానికి నాంది పలికారు. 2005 డిసెంబర్ 31 న అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి, ఆస్వాపురం కుమ్మరిగూడెం దగ్గర శంఖుస్థాపన చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 4.50 లక్షల ఎకరాల నూతన ఆయకట్టుకు, 2.50 లక్షల ఎకరాల ఎన్ ఎస్‌పీ ఆయకట్టు స్థిరీకరణకు నీరు అందించే లక్ష్యంతో దుమ్ముగూడెం ప్రాజెక్టును డిజైన్ చేయబడింది.. శంఖుస్థాపన జరిగిన 2005 డిసెంబర్ నాటికి ప్రాజెక్టును ఇందిరా సాగర్, రాజీవ్ సాగర్‌లుగా విడగొట్టి రాజీవ్ సాగర్‌కు కుమ్మరిగూడెం దగ్గర, ఇందిరా సాగర్‌కు వేలేరుపాడు మండలం రుద్రంకోట వద్ద శంఖుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టు సాధనకు ఖమ్మం మాజీ పార్లమెంటు సభ్యులు తమ్మినేని వీరభద్రం వాజేడు మండలం పేరూరు దగ్గర గోదావరి ఒడ్డునుండి పాలేరు వరకు 100 రోజులు పాదయాత్ర (మహా ప్రస్థానం) చేశారు. 2001-2003 వరకు జిల్లాలో ఏర్పడిన వర్షాభావ పరిస్థితులు, సాగర్ నీళ్ళు రాని దైన్యం రైతాంగాన్ని దిక్కు తోచని స్థితికి నెట్టాయి. ఆ దశలో సీపీఐ(ఎం) నిర్వహించిన పాదయాత్రకు రైతాంగం నుండి విశేష ఆదరణ లభించింది. 2004 మే లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఖమ్మం అసెంబ్లీ నుండి తమ్మినేని వీరభద్రం విజయం సాధించారు. వైఎస్. రాజశేఖర్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో కాంగ్రెస్





ప్రభుత్వం ఏర్పడింది. అధికారంలోకి వచ్చేందుకు రాజశేఖర్‌రెడ్డి కూడా చేవెళ్ల నుండి ఇచ్ఛాపురం వరకు పాదయాత్ర చేశారు. రాష్ట్రంలోని సమస్యలను అవగతం చేసుకున్న వైఎస్.రాజశేఖర్ రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జల యజ్ఞం పథకం ప్రారంభించారు. ఆ సమయంలో ఖమ్మం ఎంఎల్ఏగా తమ్మినేని జిల్లా ఎంఎల్ఏలను ఐక్య పరిచి ముఖ్యమంత్రి వద్దకు వెళ్లి దుమ్ముగూడెం ప్రాజెక్టు ఆవశ్యకతను వివరించి ప్రాజెక్టు నిర్మాణానికి ఒప్పించారు. పై తేదీలో శంఖుస్థాపన చేయించారు. కాని ఒక సంవత్సరం పాటు ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు కేటాయించ లేదు. ఆలస్యాన్ని గమనించిన సీపీఐ(ఎం), టీడీపీ, ఎంఎల్ పార్టీలు ఖమ్మం నుండి హైద్రాబాద్‌కు భారీ కార్ల ర్యాలీ బయలు దేరగా ర్యాలీకి అనుమతులు లేవన్న కారణంతో ప్రభుత్వం ర్యాలీని నిలిపివేసింది. కాని రాజకీయ పార్టీలు ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్ నుండే హైద్రాబాద్ అసెంబ్లీకి పాదయాత్ర చేపట్టి నకెరికల్ పట్టణానికి ర్యాలీ చేరుకోగానే ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు కేటాయించినట్లు అసెంబ్లీలో ప్రకటన చేసింది. పాదయాత్రను అక్కడే ముగిసింది. నిధులు కేటాయించి నా అరకొర పనులతో ప్రాజెక్టు పనులు నత్త నడకను తలపిస్తూ సంవత్సరాలు గడిచి పోతున్న తరుణంలో సీపీఐ(ఎం) మరలా పోరుబాట పట్టింది. దుమ్ముగూడెం నుండి పాలేరు వరకు నాయకులు, కార్యకర్తలతో 14 రోజుల పాటు పాదయాత్ర చేసింది. ఇందిరా, రాజీవ్‌సాగర్‌ల నిర్మాణానికి వైఎస్ఆర్ ప్రభుత్వం భూగర్భంలో పైపులు వేశారు. రాజశేఖర్‌రెడ్డి మరణాంతరం ప్రాజెక్టు పనులు దాదాపు నిలిచి పోయినవి. రాష్ట్ర విభజన ప్రకటన రావటం రాజకీయ అస్థిరత ఏర్పడటం వలన ప్రాజెక్టు నిర్మాణం నిలిచి పోయింది. రాష్ట్ర విభజన అనంతరం ఏర్పడిన బీఆర్ఎస్ ప్రభుత్వం నీళ్ళు నిధులు నియామకాలు నినాదంతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ప్రభుత్వంలో ప్రాజెక్టులు నిర్మాణమై సాగు నీరు వస్తుందని నమ్మారు. రాజకీయ పార్టీలు కూడా ఆందోళనలను వెనక పట్టు పట్టించినవి. కేసీఆర్ ప్రభుత్వం దశల వారీగా నిధులు కేటాయించి ప్రాజెక్టుకు రీ డిజన్ చేసి, మరలా పేరు మార్చి సీతారామ ప్రాజెక్టుగా నామకరణం చేసి ముఖ్యమంత్రి కేసీఆర్ టేకులపల్లి మండలం రోళ్లపాడు దగ్గర శంఖుస్థాపన చేసారు. రీ డిజైన్ ప్రకారం ఇల్లందు, బయ్యారం, డోర్నకల్, మహబూబాబాద్ మీదుగా పాలేరుకు అనుసంధానం చేయుటకు నిర్ణయం జరిగింది. 2005 నుండి ఈ ప్రాజెక్టు నిర్మాణానికి పర్యావరణ, అటవీ అనుమతులు రాలేదు. ఈ విషయమై సుప్రీం కోర్టులో కేసు కూడా నడుస్తుంది. ఈ ప్రాజెక్టును రోళ్ళపాడుకు అనుసంధానం చేయాలంటే కిన్నెరసాని పై భాగం అభయారణ్యం నుండి సుమారు 18 కిమీ కాలువ రావలసి ఉంది. ఇప్పుడు ఆ ఆటంకాలను అధిగమించేందుకు ములకలపల్లి, చంద్రుగొండ, జూలూరు పాడు, కామేపల్లి, గార్ల, డోర్నకల్, తిరుమలాయపాలెం ద్వారా పాలేరు కు అనుసంధానం చేసే లా డిజైన చేసారు. ఈ డిజైన్ గోదావరి వరద నీటి మట్టం 28,32 అడుగుల ప్రవాహం ఉన్నప్పుడు సర్ ఆర్థర్ కాటన్ నిర్మించిన చప్టా వలన గోదావరి నుండి 10 కిమీ దూరంలో ఉన్న బీజీ కొత్తూరు వద్ద సీతారామ మొదటి పంప్‌హౌస్‌కు గ్రావిటీ ద్వారా నీరు వస్తుంది. గోదావరి నీటి మట్టం తగ్గినప్పుడు కూడా నీరు వచ్చేందుకు గోదావరిపై సీతమ్మ బ్యారేజీని ఆనాటి ప్రభుత్వం చేపట్టి అసంపూర్తిగా వదిలేసింది. సీతమ్మ బ్యారేజి పూర్తి అయితే 65 టీఎంసీల నీటిని ఉమ్మడి ఖమ్మం జిల్లాకు తరలించే అవకాశమున్నది. దీనికి జలమండలి అనుమతులు లభించినా ఆంధ్ర ప్రదేశ్ అభ్యంతరాలతో గోదావరి రివర్ మేనేజ్ మెంట్ అనుమతి రాలేదు. సీతారామ ప్రాజెక్టు నుండి పాలేరుకు అనుసంధానం చేయాలంటే 3 వేల ఎకరాల భూ సేకరణ జరగాలి. గత ప్రభుత్వం బీజీ కొత్తూరు పంప్ హౌస్, పూసుగూడెం, కమలాపురం పంప్ హౌస్‌లను పూర్తి చేసి వాటికి అవసరమైన విద్యుత్ సబ్ స్టేషన్‌లో నిర్మాణం కూడా పూర్తి చేసింది. వాటిని ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేడు ప్రారంభిస్తున్నారు. బీజీ . కొత్తూరు పంప్ హౌస్ ఆన్ చేస్తే 44 కి మీ గ్రావిటీ ద్వారా పూసుగూడెం పంప్ హౌస్‌కు అక్కడ ఆన్ చేస్తే కమలాపురం పంప్ హౌస్‌కు నీరు వస్తుంది. కమలాపురం పంప్ హౌస్ వద్ద రెండు భాగాలుగా విడిపోయి ఒకటి పాలేరుకూ 4 మోటార్లు, మరొకటి సత్తుపల్లికి మూడుమోటార్లుతో నీటిని పంపుతారు. పాలేరుకు అనుసంధానం చేయు కాలువ ప్రస్తుతం జూలూరుపాడు మండలం వినోబా నగర్ వద్ద లింక్ కెనాల్ పేరుతో దారి మళ్లించి సుమారు 8 కిమీ కాలువ తవ్వి ఏనుకూర్ దగ్గర ఎన్ఎస్‌పిహెడ్ రెగ్యులేటర్ వద్ద లింక్ చేసారు. ఈ రెగ్యులేటర్‌ను మూసి ఉంచటం ద్వారా13 కిమీ బ్యాక్ వాటర్ ఎన్ఎస్పీ యెర్రబోడు తండా వద్ద యేస్కేప్ లాకుల వరకు చేరి వాగుల ద్వారా వైరా రిజ్వాయర్‌కు గోదావరి జలాలను అనుసంధానం చేస్తున్నారు. ఏనుకూరు రెగ్యులేటర్ ద్వారా ఎన్ఎస్పీ రెండవ జోన్‌లో ఉన్న తల్లాడ, కల్లూరు, సత్తుపల్లి పెనుబల్లి, మధిర, యెర్రుపాలెం వరకు ఆంధ్రాలోని కొంత ప్రాతానికి గోదావరి నీళు అందనున్నవి. ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిర్మాణం జరగాలంటే 3 వేల ఎకరాల భూ సేకరణ జరగాలి. నష్టపరిహారం ఇవ్వాలి. పాపకొల్లు, చీమలపాడు గుట్టల్లో రెండున్నర కిమీ టన్నెల్ నిర్మించాల్సి ఉంది.

రైతు దినోత్సవ పండుగకు తరలి రావాలి

- సీఎంకు కృతజ్ఞతలు చెప్పాలి
- మంత్రి తుమ్మల పిలుపు

నవతెలంగాణ-వైరా

వైరాలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం రైతు దినోత్సవ పండుగ జరుగుతుందని రాష్ట్ర వ్యవసాయ, సహకారశాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. వైరా గడ్డపై జరిగే ఈ రైతు దినోత్సవ పండుగకు రైతులు భారీ సంఖ్యలో తరలివచ్చి సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలపాలని పిలుపునిచ్చారు. గురువారం వైరాలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొనే రైతు బహిరంగ సదస్సు ఏర్పాట్లను బుధవారం స్థానిక ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్లా ఖాన్, సీపీ సునీల్‌దత్, పలువురు ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. వ్యవసాయ, ఇతర శాఖల అధికారుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న 30 స్టాల్స్‌ను పరిశీలించి పలు సలహాలు, సూచనలు చేశారు. సభావేదిక ఇతర ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా తుమ్మల నాగేశ్వరరావు



మాట్లాడారు. పీసీసీ అధ్యకుడి హోదాలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఎంత కష్టమైనా, భారమైనా రూ.రెండులక్షల రుణమాఫీని దేశంలో ఎవరూ చేయని విధంగా అమలుచేసి చూపిస్తున్నారని తెలిపారు. వైరా వస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి సభకు భారీగా తరలివచ్చి సీఎంను, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. తన జీవిత కోరిక, జీవిత ఆశయం గోదావరి జలాలను ఉమ్మడి ఖమ్మంజిల్లాలోని బీడుభూములకు అందించటమేనని స్పష్టం చేశారు. గురవారం సీఎం చేతులమీదుగా తన ప్రయత్నం పాక్షికంగా సఫలీకృతమవుతుందని అందుకు సంతోషంగా ఉందని వ్యాఖ్యానించారు. సీతారామ ప్రాజెక్టు ఇంకా 70శాతం పూర్తికావల్సి ఉందని తెలిపారు. వాటి నిర్మాణానికి అవసరమైన భూసేకరణ, ఫారెసు క్లియరెన్స్, యాతాలకుంట బీరోలు, జూలూరుపాడు టెన్నెల్ పూర్తి కావాల్సి ఉందని, వీటికి అవసరమైన అనుముతులు, నిధుల సాధన కోసం రేవంత్ రెడ్డి పాల్గొనే రైతు సదస్సును సద్వినియోగం చేసుకుంటామని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మెన్ రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, మార్క్‌ఫెడ్ రాష్ట్ర మాజీ వైస్ చైర్మెన్ బొర్రా రాజశేఖర్, కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు నల్లమల వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శీలం వెంకట నర్సిరెడ్డి, వైరా మున్సిపాల్ చైర్మెన్ సూతకాని జైపాల్, నాయకులు పణితి సైదులు, కొపురావూరి శబరి, కొల్లి రమేష్, గొల్లపూడి కృష్ణారావు, చప్పిడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తల్లాడను హెల్త్ ఎమర్జెన్సీగా ప్రకటించాలి

- ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు మాచర్ల భారతి

నవతెలంగాణ-తల్లాడ

తల్లాడ మండలాన్ని వెంటనే హెల్త్ ఎమర్జెన్సీగా ప్రకటించి ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు మాచర్ల భారతి డిమాండ్ చేశారు. బుధవారం దొడ్డ కృష్ణయ్య భవన్‌లో శీలం పకీరమ్మ అధ్యక్షతన పార్టీ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాచర్ల భారతి మాట్లాడుతూ...మండలంలోని అన్ని గ్రామాలలో జ్వరాలతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. డెంగీ, చికెన్ గున్యా, టైఫాయిడ్ జ్వరాలు ఎక్కువగా ప్రజలను ఇబ్బందులు గురిచేస్తున్నాయని, ప్రభుత్వాస్పత్రిలో తగినంత



మంది సిబ్బంది లేకపోవడం, సరైన మందులు అందుబాటులో లేకపోవడం, పేదలు ప్రైవేట్ వైద్యం చేయించుకోలేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రజా ప్రతినిధుల పదవీకాలం ముగియడంతో పాలన వ్యవస్థ కుంటూ పడిందని ఆరోపించారు. కాలనీ, నివాసాల్లో మురుగు నీరు నిలిచి ఆయా ప్రాంతాల్లో వ్యాధులు విజృంభిస్తున్నాయని తెలిపారు. గ్రామ పంచాయతీలలో నిధులు లేని కారణంగా చెత్త పేరుకుపోయి, గడ్డి జాతి మొక్కలు ఎక్కువగా పెరిగి దోమలకు ఆవాసంగా మారాయి. దోమల నివారణకు మందులు స్ప్రే చేయకపోవడం, మురికి కాలువల్లో పేరుకుపోయిన చెత్త తొలగించకపోవడంతో అన్ని గ్రామాలలో విష జ్వరాలు ప్రబలుతున్నాయని చెప్పారు. అన్ని గ్రామాలలో హెల్త్ క్యాంపులు నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మాదినేని రమేష్, మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వర రావు, నల్లమోతు మోహన్‌రావు, షేక్ మస్తాన్స, సత్తెనపల్లి నరేష్, కళ్యాణం కృష్ణయ్య పులి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

వైరా అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొంతు రాంబాబు

నవతెలంగాణ-వైరాటౌన్

ఈనెల 15న వైరా నియోజకవర్గ కేంద్రంలో రైతు సభలో ముఖ్య మంత్రి వైరా అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొంతు రాంబాబు అన్నారు. బుధవారం వైరా మండలం ముసలమడుగు గ్రామంలో రైతు నేత నర్వనేని సత్యనారాయణ మూడోవ వర్ధంతి నిర్వహించారు. నర్వనేని సత్యనారాయణ స్మారక స్థూపం వద్ద చిత్రపటానికి నర్వనేని పద్మావతి, బొంతు రాంబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ(ఎం) జెండాను గ్రామశాఖ కార్యదర్శి, మాజీ సర్పంచ్ ఎస్‌కే.మోహిద్దీన్ ఆవిష్కరించారు. పార్టీ మండల కార్యదర్శి తోట నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో బొంతు రాంబాబు, పార్టీ జిల్లా సీనియర్ నాయకులు సామినేని రామారావు మాట్లాడుతూ ప్రజా ఉద్యమాల్లో నిబద్ధతతో పనిచేసిన నర్వనేని సత్యనారాయణ జీవితం ఆదర్శనియమన్నారు. వైరా నియోజకవర్గ కేంద్రంలో ముఖ్యమంత్రి సభ




సందర్భంగా వైరా ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కోసం, వైరా సమగ్ర అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు ప్రకటించాలని కోరారు. వైరా రింగ్ రోడ్డు నుంచి తల్లాడ వైపు జాతీయ రహదారి రెండు వైపులా డ్రయినేజీ నిర్మాణం, వాసవి కళ్యాణ మండపం రహదారి డ్రయినేజీ, రోడ్డు నిర్మాణం, కిరాయి ఇండ్లలో నివాసం ఉంటూ స్వంత స్థలాలు లేని నిరుపేదలు నివాసం కోసం మోడల్ కాలనీ నిర్మాణం, వైరా రిజర్వాయర్ చుట్టూ ట్యాంక్ బండ్ నిర్మాణం, ప్రభుత్వ పాల్ టెక్నిక్, డిగ్రీ కళాశాల నిర్మాణం, వైరా బస్టాండ్, గురుకుల పాఠశాల ఎదురుగా ప్రభుత్వ దుకాణాల సముదాయం నిర్మాణం, డంపింగ్ యార్డ్ నిర్మాణంకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరారు. రైతు రుణమాఫీలో ఉన్న సమస్యలు పరిష్కారం చేసి బ్యాంకులో అప్పు ఉన్న ప్రతి రైతుకు రుణమాఫీ చేయాలన్నారు. వైరాలో చెరుకు పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయాలని, పామాయిల్ టన్నుకు ఇరవై వేల రూపాయలు మద్దతు ధర ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు సుంకర సుధాకర్, సీనియర్ నాయకులు మచ్చా మణి, వనమా చిన్న సత్యనారాయణ, చింతనిప్పు చలపతిరావు, మండల కార్యదర్శివర్గ సభ్యులు బాజోజు రమణ, నల్లమల కోటేశ్వరరావు, చింతనిప్పు చంద్రరావు, కుటుంబ సభ్యులు నర్వనేని కృష్ణయ్య వెంకట్రావు, శ్రీనివాసరావు, సుధాకర్, రాజీనీ మద్దినేని బాలగోపాల్, గుమ్మా నరసింహరావు, గుడిమెట్ల మోహన్‌రావు, గుడూరు రమణారెడ్డి, యనమద్ది రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మా గోస చూడండి సారూ...

- చినుకుపడితే ఆ రహదారి చిత్తడే..
- పంటపొలాలకు వెళ్లలేక రైతుల ఇబ్బంది

నవతెలంగాణ-కామేపల్లి

మండల పరిధిలోని మధులపల్లి గ్రామపంచాయతీలో రైతుల పంట పొలాలకు వెళ్లడానికి రహదారులు లేక బురద డొంకలోనే కాలినడకన వెళ్తున్నారు. రైతులు బురదలో నిలబడి ఆందోళన చేశారు. కామేపల్లి మండల పరిధిలోని మద్దులపల్లి గ్రామానికి చెందిన ఇమ్మడి రామానాథం పంటపొలం నుండి ముద్దులపల్లి పెద్ద చెరువుకు వెళ్లే రహదారిలో రోడ్డు లేక రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పంట పొలాలకు రైతులు వెళ్లాలంటే చినుకు పడితే చిత్తడిగా ఈ రహదారి మారుతుంది. దీంతో రైతుల గోస



వర్ణనాతీతం.. ప్రభుత్వాలు మారిన పాలకులు మారినా ఈ రోడ్డు వైపు కన్నెత్తి చూసిన నాదుడే లేడని రైతులు ఆ డొంకలో నిలబడి ఆందోళన నిర్వహించారు. వెంటనే ప్రభుత్వం, సంబంధించిన అధికారులు స్పందించి రోడ్డు వేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనియెడల ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. మండలంలో మూడు మండలాలకు లింకు రహదారి అయిన లాల్య తండా నుండి జగన్నాధతండ వరకు వెళ్లే రహదారికి రోడ్డు లేక రైతులు ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈరోడ్డు వేయడం వలన ఈప్రాంత రైతులతో పాటు కామేపల్లి, ఏన్కూర్, రఘునాధపాలేం మండలాల ప్రజలకు ప్రయాణికులకు ఖమ్మం పఠణానికి విద్య వైద్యం కొరకు సౌకర్యంగా ఉంటుందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ లింకు రహదారులను వెంటనే నిర్మించినట్లయితే రైతులతో పాటు మూడు మండలాలకు సంబంధించిన ప్రజలు ప్రయాణికులను ఇక్కట్లను నివారించవచ్చునని ఆందోళన చేశారు. వెంటనే ప్రభుత్వం స్పందించి ఈ లింకు రహదారిని నిర్మించి నిమ్మ వాగు పై బ్రిడ్జిని నిర్మించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు ఇమ్మడి రామానాథం, గట్టి కొప్పుల నారాయణరెడ్డి, మాజీ ఎంపీటీసీ గుగులోతు గబ్రూనాయక్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడు వీరనరసింహారెడ్డికి నివాళి


నవతెలంగాణ-తల్లాడ

తల్లాడ గ్రామపంచాయతీ పరిధిలోని నారాయణపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు రెడ్డెం వీరనరసింహారెడ్డి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. బుధవారం దశదినకర్మ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కాపా సుధాకర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ దుండేటి వీరారెడ్డి, పొట్టేటి జనార్దన్‌రెడ్డి, షేక్ యాకుపాషా, యుగంధర్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కటికి కిరణ్, జమాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎవరి మతం వాళ్లకు గొప్పది

- వక్ఫ్ భూములపై ముసాయిదా బిల్లు రాజ్యాంగ విరుద్ధం
- మైనార్టీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పదవికి రాజీనామా
- విలేకరుల సమావేశంలో షేక్ నబి

నవతెలంగాణ-ఖమ్మం



ఎవరి మతం వాళ్లకు గొప్పది...మైనార్టీలను కావాలనే కొంత మంది పనిగట్టుకుని కించపరిచే విధంగా మాట్లాడడం పద్ధతికాదని మైనార్టీ మోర్చా నాయకుడిగా జీర్ణించుకోలేక మైనార్టీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పదవికి రాజీనామా చేస్తున్నానని షేక్ నబి తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నబి మాట్లాడారు. భారతదేశం సర్వ మతాల కలయికని అని, మతాలు వేరైనా భిన్నత్వంలో ఏకత్వంగా సోదర భావం కలిగి జీవించాలని భారత రాజ్యాంగం తెలియజేస్తుందన్నారు. బీజేపీ పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నన్న వక్ఫ్ భూముల ముసాయిదా బిల్లు ఇటు ముస్లింలకు, అటు రాజ్యాంగానికి విరుద్ధమన్నారు. బీజేపీ కావాలనే కార్పొరేట్ సంస్థల వ్యక్తులకు వక్ఫ్ భూములను కట్టబెట్టేందుకు కుట్ర చేస్తోందని ఆరోపించారు. ముస్లింలపై బీజేపీలోని కొందరి నాయకుల దుశ్చర్యల వల్ల పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు నబి ప్రకటించారు.

తుమ్మల మదినుంచి ఉద్భవించింది 'సీతారామ'

- కల్లబొల్లి మాటలతో గులాబీల దుష్ప్రచారాలు నమ్మరు
- ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్

నవతెలంగాణ-సత్తుపల్లి



సీతారామ ప్రాజెక్టు రూపకల్పన అనేది మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మదినుంచి ఉద్భవించిందనే విషయం జిల్లాలో గడప గడపకు తిరిగి ఎవరినడిగినా చెబుతారని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. సీతారామ ప్రాజెక్టుపై బీఆర్ఎస్ రాష్ట్ర, జిల్లా నాయకులు చేస్తున్న అబద్దపు ప్రచారాలపై ఎమ్మెల్యే మండిపడ్డారు. రాష్ట్ర మంత్రులు తుమ్మల, పొంగులేటి, భట్టిలపై హరీశ్‌రావుతో పాటు మరికొంత మంది గులాబీ నాయకులు సీతారామపై చేసిన వ్యాఖ్యలపై క్యాంపు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే గరం అయ్యారు. బీఆర్ఎస్ పాలనలో సీతారామ పనులు సాఫీగా సాగక, కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించక ప్రాజెక్టును గాలికొదిలేశారని ఎమ్మెల్యే తెలిపారు. సీతారామకు కేటాయించిన నిధులను కాళేశ్వరం ప్రాజెక్టు తరలించి నిధులను ఆగమాగం చేశారని దుయ్యబట్టారు. ఆ కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు ఏమైనా మంచిగా కట్టారా అంటే అదీ లేదన్నారు. ప్రజాధనాన్ని కాళేశ్వరం నీళ్ల పాల్జేశారని విమర్శించారు. పిల్లర్లు బీటలు వారి ఆ ప్రాజెక్టు పరిస్థితి మున్ముందు ఎలా ఉంటుందనే విషయం ప్రశ్నార్థకంగా మారిందన్నారు. సీతారామకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం 8వేల కోట్లు ఖర్చుచేసినా నిర్మాణ విషయంలో ఎలాంటి పురోగతి లేకుండా పోయిందన్నారు. 40యేండ్ల తన రాజకీయ అనుభవంతో సీతారామకు రూపకల్పన చేయించి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పనులు మొదలైనా నత్తనడకన సాగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో పాటుగా జిల్లా మంత్రులు భట్టి, తుమ్మల, పొంగులేటిల కృషితో సీతారామ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. కాంట్రాక్టర్లకు ఆగిన బిల్లులు చెల్లించి పనులను వేగవంతం చేయించి నేడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా సీతారామ ద్వారా గోదావరి జలాలను జిల్లాకు రప్పిస్తున్న ఘనత తుమ్మలకు దక్కుతుందన్నారు. గోదావరి నీళ్లను పారించి ఖమ్మం జిల్లాను మరో కోనసీమగా మార్చి అన్నదాతల జీవితాల్లో మరో సువర్ణ అధ్యయనానికి నాంధి పకలబోతున్న అపర భగీరథుడు తుమ్మల అని ఎమ్మెల్యే అన్నారు. సీతారామ ప్రాజెక్టు క్రెడిట్ అంతా కాంగ్రెస్‌కే పోతుందనే అక్కసుతో బీఆర్ఎస్ నాయకులు లేనిపోని దుష్ప్రచారాలకు తెరలేపారని రాగమయి దయానంద్ అన్నారు. ఇకనైనా తప్పుడు ఆరోపణలు మానకుంటే జిల్లా ప్రజలు బుద్ధి చెప్పక మానరని ఎమ్మెల్యే రాగమయి దయానంద్ హెచ్చరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్, నాయకులు చల్లగుళ్ల నరసింహారావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శివా వేణుబాబు, గాదె చెన్నకేశవరావు, ఉడతనేని అప్పారావు, భీమిరెడ్డి సుబ్బారెడ్డి, నారాయణవరపు శ్రీనివాస్, గోలి శ్రీనివాసరెడ్డి, పింగిలి సామేలు, వినుకొండ కృష్ణ, దొడ్డా గోపాలరావు, ఎండీ గఫార్, కొప్పుల నరేందర్‌రెడ్డి, టోపీ శ్రీను, కౌన్సిలర్ కంటె నాగలక్ష్మి పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి సభను విజయవంతం చేద్దాం

ఎమ్మెల్యే రాగమయి దయానంద్

నేడు (గురువారం) వైరాలో జరిగే ముఖ్యమంత్రి సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్, చల్లగుళ్ల నరసింహారావు, ఉడతనేని అప్పారావు, శివా వేణుబాబు కోరారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలి వెళ్లాలని ఈ సందర్భంగా వారు కోరారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
7
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం ఆగస్టు 15, 2024 www.navatelangana.com



సీతారామ ప్రాజెక్టు జలాలు మండలానికి ఇవ్వాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కనకయ్య

నవతెలంగాణ-బూర్గంపాడు

సీతారామ ప్రాజెక్టు జలాలు బూర్గంపాడు మండల రైతులకు అందించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని సారపాకలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలోని ప్రతి రైతాంగానికి సీతారామ ప్రాజెక్టు జలాలను సాగునీటికి అందించాలని ఆయన అన్నారు. టేకుల చెరువు గ్రామ చెరువుకి ప్రాజెక్ట్ నీళ్లు ఇవ్వాలని ఆయన అన్నారు. రైతు పొలాలకు వేల ఎకరాలకు సాగునీరు, తాగునీరు అందించొచ్చని ఆయన అన్నారు. ప్రభుత్వం సీతారాం ప్రాజెక్టు జలాలు సమీప ప్రాంత వాసులకు ఇవ్వకుండా వేరే జిల్లాకు తరలించకపోవడం శోచనీయమని ఆయన అన్నారు. ఈ ప్రాంత వాసులకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోమని ఆయన అన్నారు. పెద్ద ఎత్తున ఉద్యమాలు ఆందోళన చేపడతామని ఆయన అన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న పంట పొలాలకు నీరు ఇవ్వకుండా తీసుకుపోతే పెద్ద ఎత్తున రైతులు తరఫున పోరాటానికి ముందుంటామని ఆయన అన్నారు. రైతులకు మద్దతుగా రైతులు పక్షాన పోరాటాలు చేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబి నర్సారెడ్డి, మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు, నాయకులు పాండవుల రామనాదం, భయ్యా రాము, పాపినేని సరోజన, ఎస్.కె అబిద, గుంటక కృష్ణ, కనకం వెంకటేశ్వర్లు, కందుకూరి నాగేశ్వరావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



నేడు సీతారామ ప్రాజెక్ట్ ప్రారంభం

- సీఎం రేవంత్ రెడ్డి రాక
- వైరాలో జరిగే బహిరంగ సభ జయప్రదం చేయండి
- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-మణుగూరు

ఉమ్మడి ఖమ్మం, మహబూబాద్ జిల్లాల రైతుల చిరకాల కోరికను గోదావరిపై అశ్వాపురం వద్ద నిర్మించిన సీతారామ ప్రాజెక్టును రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నేడు ప్రారంభించనున్నాడని పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ అనంతరం వైరాలో భారీ బహిరంగ సభ ఉంటుందని, దీనిని జయప్రదం చేయాలని రైతులను, ప్రజలను కోరారు. ఈ కార్యక్రమాలకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, జిల్లా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమకుమార్ రెడ్డి, ఉమ్మడి ఖమ్మం జిల్లా శాసనసభ్యులు, అధికారులు హాజరవుతున్నారని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అన్ని మండలాలకు గోదావరి జలాలు అందుతాయని అన్నారు. పినపాక నియోజకవర్గంలో పులుసుబంత ప్రాజెక్ట్ నా చిరకాల స్వప్నమని అన్నారు. పులుసుబంత ప్రాజెక్టును కూడా పూర్తి చేస్తామన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పినపాక నియోజకవర్గం కోఆర్డినేటర్ కాటిబోయిన నాగేశ్వరరావు, మణుగూరు మండల అధ్యక్షులు నవీన్, కూచిపూడి బాబు, గుడి కోటేశ్వరరావు, సామ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నియోజక వర్గం వైపు సీతరామ ప్రాజెక్ట్

- పనులు ప్రారంభించే వరకూ పోరాటం ఆగదు
- విలేకర్ల సమావేశంలో అఖిలపక్షం

నవతెలంగాణ-ఇల్లందు



సీతరామ్ ప్రాజెక్ట్ ద్వారా గోదావరి నది జలాలు ఏజెన్సీ మండలాలతో పాటు ఇల్లందు నియోజకవర్గ ప్రాంతానికి వచ్చేంతవరకూ పోరాటం ఆగదని అఖిలపక్ష నేతలు స్పష్టం చేశారు. ఎల్లన్న భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర నాయకులు, మాజీ శాసనసభ్యులు గుమ్మడి నరసయ్య, సిపిఐ అనుబంధ రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షులు ఏపూరి బ్రహ్మం, సీపీఐ(ఎం) జిల్లా నాయకులు ఎస్‌ఏ. నబి, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు రామ్ సింగ్, టీడీపీ మండల అధ్యక్షులు ఉపేందర్ కాంగ్రెస్ నాయకులు మోహన్ రావు మాట్లాడారు. అఖిలపక్ష రాజకీయ పార్టీలు రైతు సంఘాలు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మంత్రులను, ఎమ్మెల్యేలను కలిసే కార్యక్రమం పూర్తయిందని ఇక డిప్యూటీ సీఎం, సీఎంను కలవాల్సి ఉందని అన్నారు. మేలుకొనకపోతే ఒక చుక్క సాగు నీరు ఇల్లందు నియోజకవర్గానికి పారదని ఈ అన్యాయన్ని చూస్తూ ఊరుకోలేమని అడగందే అమ్మయినా అన్నం పెట్టదని గ్రహించి ఇల్లందు నియోజకవర్గ అఖిలపక్ష రాజకీయ పార్టీలరైతు సంఘాల నాయకులుగా ప్రతిఘటించాల్సిన బాధ్యతమాపైన వున్నదని అన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా నాయకులు దేవరకొండ శంకర్ పట్టణ కార్యదర్శి బంధం నాగయ్య, సీపీఐ(ఎం) నాయకులు అలేటి కిరణ్, ఆలూరి కృష్ణ, ఎంఎల్ మాస్ లైన్ నాయకులు నయని రాజు బుర్ర వెంకన్న టిడిపి నాయకులు క్లింట్ రోచ్, తదితరులు పాల్గొన్నారు.

ఆళ్ళపల్లి మదర్ థెరిసా సమ్మక్క

- ఘనంగా వీడ్కోలు, సన్మానం

నవతెలంగాణ-ఆళ్ళపల్లి

ఆళ్ళపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్యశాలలో పనిచేసిన స్టాఫ్ నర్స్ సమ్మక్క మండల ప్రజలకు మదర్ థెరీసా వలే వైద్య సేవలు అందించారని స్థానికులు పలువురు ఆమె సేవలను కొనియాడారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో హెల్త్ సూపర్వైజర్ రమేష్ బాబు, హెల్త్ విజిటర్ లక్ష్మి, స్టాఫ్ నర్స్ సమ్మక్క, ఫార్మసిస్టు విజయ, సుదక్షిణాదేవి సాధారణ బదిలీలలో భాగంగా ఇటీవల కాలంలో వేర్వేరు ప్రాంతాలకు బదిలీ అయ్యారు. బదిలీ అయిన వారికి పిహెచ్‌సి డాక్టర్లు అర్వపల్లి రేవంత్, సంఘమిత్ర, కార్తీక్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా వీడ్కోలు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

మా నీళ్లు మాకిచ్చి గోదావరి నీటిని తరలించకపోండి

- సీపీఐ జిల్లా కార్యదర్శి షాబీర్ పాష

నవతెలంగాణ-మణుగూరు

అశ్వాపురం మండలంలో నిర్మించిన సీతారాం ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ఏజెన్సీ మండలాలకు చుక్క నీరు అందడం లేదని ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ఏజెన్సీ మండలాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె షబీర్ పాషా అన్నారు. బుధవారం సీపీఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ దుమ్ముగూడెం ప్రాజెక్టును నిర్మించి ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయాలని, రాష్ట్ర వ్యాప్తంగా గోదారి జలాలను ఉపయోగించుకోవాలని సీపీఐ పార్టీ మొదట ఆందోళన చేసిందన్నారు. పార్టీ నాయకులు కొల్లి నాగేశ్వరరావు దుమ్ముగూడెం ప్రాజెక్టు కోసం ఆమరణ దీక్ష చేపట్టారన్నారు. అనేక పోరాటాల ద్వారా దుమ్ముగూడెం సాధన కోసం కృషి చేశామన్నారు. సీతారామ ప్రాజెక్టు పూర్తికాకుండానే తుమ్మల నాగేశ్వరరావు పాలేరుకు గోదావరి జలాలను తీసుకెళ్తున్నారని అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఏజెన్సీ నియోజకవర్గం పినపాక, ఇల్లందుకు చుక్క నీరు అందే అవకాశం లేదన్నారు. జిల్లా అడవులను నాశనం చేసి రైతుల భూములు లాక్కొని చుక్క నీరు ఇవ్వకుండా గోదావరి జలాలను బలవంతంగా లాక్కెళ్తున్నారన్నారు. ఈ విషయంపై దశల వారి ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.అయోధ్య చారి, మున్నా లక్ష్మకుమారి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కమటం వెంకన్న, దుర్గ్యాల సుధాకర్, కుటుంబరావు, రాములు తదితరులు పాల్గొన్నారు.

పల్లె దవాఖానకు వెళ్లాలంటే ఎన్ని కష్టాలో..

నవతెలంగాణ-చంద్రుగొండ



మండలంలోని తుంగారం గ్రామపంచాయతీలోని ఆరోగ్య కేంద్రానికి వెళ్లాలంటే ప్రజలు భయపడుతున్నారు. రేపల్లె వాడ, తుంగారం గ్రామాల ఆరోగ్య కేంద్రానికి గ్రామస్తులు భయపడుతూ వెళ్తున్నారు. వర్షం వస్తే ఆరోగ్య కేంద్రం మొత్తం పూర్తిగా మురికి నీళ్లతో బురదమయం అవుతుందని జ్వరం వచ్చిందని కేంద్రానికి వెళ్తే ఎక్కడ జారి కిందపడి కాలు విరుగుతుందో అన్న భయంతో కేంద్రానికి వెళ్లకుండా ప్రయివేటు మెడికల్ షాపులకు వెళ్తున్నామని, గత వారం రోజుల క్రితం కిందపడి గాయాల పాలు అయ్యారని గ్రామస్తులు వాపోతున్నారు. వర్షం వచ్చిందంటే ఈ కేంద్రం మొత్తం పూర్తిగా నీటితో నిండి రాలేని పరిస్థితి నెలకొన్నది. ఆరోగ్య కేంద్రం పూర్తిగా రహదారికి దిగువన ఉండటం వలన చిన్న చినుకు పడితే ఆరోగ్య కేంద్రం నీళ్ళు చేరుతున్నాయి. దీంతో రోగులు ఎన్నో ఇబ్బందులు ఎదురుకోవలసి వస్తుందని ప్రజలు అంటున్నారు. స్థానిక శాసనసభ్యులు, ప్రభుత్వం చొరవ చూపి మరమ్మతులు చేపట్టాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

గోదావరి జలాలు అందించడమే లక్ష్యం

- రాష్ట్ర వ్యవసాయశాఖామంత్రి తుమ్మల

నవతెలంగాణ-ములకలపల్లి





గోదావరి జలాలను ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని బీడు భూములకు మళ్లించడం తన చిరకాల స్వప్నమని ఎన్నో ప్రభుత్వాలు గతంలో వరంగల్, నల్గొండ, ఉమ్మడి ఖమ్మం జిల్లాలకు గోదావరి జలాలను తరలించేందుకు ప్రయత్నాలు చేసినప్పటికీ అది ఫలించలేదని, రేవంత్‌రెడ్డి సర్కారు రూపంలో నేడు నెరవేరనుందని తనకెంతో ఆనందంగా ఉందని రాష్ట్ర వ్యవసాయశాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని ఒడ్డురామవరం గ్రామం వద్ద బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని సీఎం చేతులమీదుగా పంపుహౌస్లను ప్రారంభింపచేయడం రైతుపండుగగా ఆయన అభివర్ణించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని యాతాలకుంట టన్నెల్ పూర్తిచేసి సత్తుపల్లి చెరువుకు నీటిని మళ్లిస్తే రెండు లక్షల ఎకరాలు సాగులోకి వస్తాయని, అలాగే జూలూరుపాడు టన్నెల్ పనులు పూర్తయితే పాలేరు రిజర్వాయర్కు నీటి సరఫరా సాధ్యమవుతుందన్నారు. ఇప్పటివరకు ఈ రెండు కాలువలకు సంబంధించి 35శాతం మాత్రమే పనులు పూర్తయ్యాయని, పనులు పూర్తికావాలంటే పెద్ద ఎత్తున నిధులు అవసరపడతాయని ఈ విషయాన్ని వివరించేందుకే నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమకుమార్రెడ్డితో పాటు సాక్షాత్తు ముఖ్యమంత్రి రేవంత్రెడ్డిని ఇక్కడకు పిలిపించి రైతాంగ సమస్యలు వివరించి పంపుహౌస్లను ప్రారంభిస్తున్నట్లు తుమ్మల తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పినపాక, కొత్తగూడెం, అశ్వారావుపేట నియోజకవర్గాలకు సీతారామ నీటిని అందించేందుకు అవసరమైన టన్నెల్ పనులు పూర్తిచేసి వచ్చే ఏడాది నాటికి ఈ ప్రాంత భూములకు నీరందిస్తామని తుమ్మల స్పష్టం చేశారు.

ఏకకాలంలో రూ.30వేల కోట్లు రుణమాఫీ చేసిన దేశంలోనే ఏకైక ప్రభుత్వం రేవంత్ ప్రభుత్వమని కొనియాడారు. కృష్ణా, గోదావరి జలాల సంగమం వద్ద ఈ మహోత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నట్లు ఆయన ప్రకటించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలతో పాటు తన చిరకాల కోరిక స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా తీరనుండటం సంతోషదాయకమన్నారు.

జూనియర్ కళాశాల సమస్యలను పరిష్కరిస్తా

- ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

నవతెలంగాణ-దుమ్ముగూడెం



మండల వాసిగా దుమ్ముగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల సమస్యలను పరిష్కరించే బాధ్యత తను తీసుకుంటానని కళాశాల యాజమాన్యానికి భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు హామీ ఇచ్చారు. బుధవారం ఆయన జూనియర్ కళాశాలను సందర్శించారు. ముందుగా కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్ కృష్ణవేణి ఎమ్మెల్యేకు పూల బొకే అందజేసి అనంతరం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. కళాశాల చుట్టూ ప్రహరీ గోడతో పాటు, క్రీడా మైదానం, సుదూర ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థుల కోసం హాస్టల్ వసతి, పలు తరగతి గదులు కురుస్తున్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే కళాశాలలో నెలకొన్న ప్రతి సమస్యను పరిష్కరించే విధంగా తాను బాధ్యత తీసుకుంటానని అన్నారు. అనంతరం విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట మాజీ జడ్పీటీసీ తెల్లం సీతమ్మ, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

వచ్చే విద్యా సంవత్సరం నుంచి 'సింగరేణి'లో సీబీఎస్ సిలబస్

- జెకె 5 ఓసీ విస్తరణ కోసం త్వరలో అనుమతులు
- ఇల్లందులో విస్తృతంగా పర్యటించిన సింగరేణి సంస్థ సీఅండ్ఎండి ఎన్.బలరామ్

నవతెలంగాణ-ఇల్లందు





సింగరేణి సంస్థ చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరాం ఐఆర్ఎస్ బుధవారం విస్తృతంగా పర్యటించారు. జీఎం కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించి ఇల్లందు ఏరియా ఉత్పత్తి, ఉత్పాతకత వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సింగరేణి వైద్యశాలలోని జనరల్ వార్డు, ల్యాబ్, ఎక్స్ రే, మెడికల్ స్టోర్‌ను తనిఖీ చేసి వైద్యులు, సిబ్బందికి పలు సూచనలు, సలహాలు చేశారు. ప్రతి ఒక్కరూ విధుల పట్ల అంకితభావంతో పనిచేయాలని, వైద్యశాలకు వచ్చే వారిపట్ల మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు. వైద్యశాలకు వచ్చేవారిపట్ల అమర్యాదగా ప్రవర్తిస్తే సహించేది లేదని హెచ్చరించారు. వైద్యశాలలో వైద్యులు, సిబ్బంది కొరత ఉన్నట్లయితే త్వరితగతిన నియమిస్తామని పేర్కొన్నారు. జెకె 5 ఓసీ విస్తరణ కోసం దాదాపుగా అన్ని అనుమతులు వస్తాయని త్వరలోనే ప్రాజెక్టు పనులు ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. తదుపరి వారు జెకె 5 ఓసీ డంప్ యార్డ్ పై ఒక మొక్కను నాటారు. సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియాలో నూతనంగా నిర్మించనున్న పంప్ స్టోరేజ్ పవర్ ప్లాంట్ ప్రాంతాన్ని పరిశీలించి సాధ్య అసాధ్యలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జెకె 5 ఓసిను వ్యూ పాయింట్ నుండి అక్కడ జరుగుతున్న వివరాలను ఏరియా జీఎం జాన్ ఆనంద్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంస్థ నిర్దేశించిన లక్ష్యాన్ని సకాలంలో పూర్తి చేయాలనీ, రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని ఏరియా అధికారులకు తెలిపారు.

ఉపాధ్యాయుడుగా మారిన సీ అండ్ ఎండీ

ఇల్లందు పర్యటనలో భాగంగా సింగరేణి ఉన్నత పాఠశాలలో బలరాం ఉపాధ్యాయులుగా మారి విద్యార్థులకు పాఠాలు బోధించారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడుగుతూ వారిలో ఉన్న విద్య నైపుణ్యతను స్వయంగా తెలుసుకున్నారు. పాఠశాలలో ఏమైనా సమస్యలు ఉన్నాయని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. సింగరేణి పాఠశాలలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ కోఆర్డినేషన్ ఎస్‌డీఎం సుభాని, జీఎం(సోలార్) జానకి రాం, యస్ఓ టూ డైరెక్టర్ కె.వి.రావు, సీఎంఓ సుజాత, ఏరియా యస్ఓటూ జీఎం బొల్లం వెంకటేశ్వర్లు, డీజీఎం (పర్సనల్) జి.వి. మోహన్ రావు, ఏరియా అధికారులు పాల్గొన్నారు.


అభినవ 'రాఘవుడు'

నవతెలంగాణ-దమ్మపేట









ప్రస్తుత కాలంలో గోరంత చేసి కొండంత చేసామని చెప్పుకొని అవార్డులు, రివార్డులు కోసం పాకులాడి రాజకీయ లబ్ది కోసం ఆనాయకుడు, ఈ నాయకుడు తమకు తెలుసునని ప్రగల్భాలు పలుకుతూ గోరంతలను కొండంతలు చేసే నేటి సమాజంలో చలామణి అవుతున్న నాయకుల్ని ఎంతో మందిని చూసే ఉంటాం. ఈ నేపథ్యంలో దమ్మపేట మండలం, నాచారం గ్రామానికి చెందిన అభినవ నాచారం రాఘవుడిగా పేరుగాంచిన ఎల్లిన రాఘవరావు సాధారణ రైతు కుటుంబంలో జన్మించి వ్యవసాయమే జీవనాధారంగా కొనసాగుతూ తనకు ఓటు హక్కు వచ్చిన నాటి నుండి నేటి వరకు రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరావును తన రాజకీయ గురువుగా భావించి ఆయన స్ఫూర్తితో సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు రాజకీయంగా తుమ్మలను అనుసరిస్తూ ప్రస్థానం కొనసాగిస్తున్నారు. తొలుత తెలుగుదేశం పార్టీలో నాచారం గ్రామశాఖాధ్యక్షుడిగా, బీఆర్‌యస్ పార్టీలో నాచారం గ్రామ శాఖ పార్టీ అధ్యక్షుడిగా, ప్రస్తుతం దమ్మపేట ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మెన్‌గా కొనసాగుతున్నారు. ఎల్లిన రాఘవరావు సుమారుగా నాచారంతో పాటు, నాగుపల్లి, తొట్టిపంపు, గణేష్‌పాడు, సీతారాంపురం, ఆసన్నగూడెం, తదితర గ్రామ పంచాయతీలలో పెద్దఎత్తున అభిమానులను సంపాదించుకుని ఆయా ప్రాంతాలతో పాటు వివిధ గ్రామాలలో ఎవరికి ఏ ఆపద వచ్చినా రెప్పపాటు కాలంలో తనను నమ్ముకున్న వారి కోసం సహాయ సహకారాలు అందించడంతో పాటు కష్టకాలంలో వారికి చేయూతను అందించడం రాఘవరావు ప్రత్యేకశైలికి నిదర్శనం. 2005వ సంవత్సరంలో నాచారం గ్రామంలో ప్రజల సహకారంతో పెద్దఎత్తున రామాలయాన్ని నిర్మించి రామాలయంలో నిత్యం దూప, దీప, నైవేద్యాలు జరిగే విధంగా అవసరమైన ఏర్పాట్లను చేసి కొంత కాలం ఆ దేవాలయంలో పనిచేసే అర్చకులకు తన స్వంత డబ్బులతో రాఘవరావు జీతాలు చెల్లించడం మంత్రి తుమ్మల సహకారంతో ఆ రామాలయాన్ని ఎండోమెంట్ డిపార్ట్‌మెంటుకు అనుసందానం చేయడమే కాకుండా ఉగాధి, శ్రీరామనవమి, విజయదశమి, కార్తీక, ధనుర్మాసాలలో ఆలయంలో దేవతా మూర్తులకి నూతన వస్త్రాలు సమర్పించడం వేడుకగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం, ప్రసాద, అన్న సంతర్పణలను వితరణ చేయడం నేటికి ఆ ఆలయానికి రాఘవరావు చైర్మెన్‌గా కొనసాగడం ఆయన అంకిత భావానికి నిదర్శనం. వ్యవసాయం చేసే రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని సీతారాంపురం ప్రక్కనే సుమారు 4.5 లక్షల తన సొంత సొమ్మును వెచ్చించి విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం చేయడానికి తన అమ్మమ్మ మోరంపూడి సంజీవమ్మ పేరుతో స్థలాన్ని కొనుగోలు చేసి ప్రభుత్వానికి ఇచ్చిది. 30-03-2015న ప్రారంభోత్సవం చేయించడంలో రాఘవరావు రైతుల పక్షపాతిగా ముద్రపడ్డారు. నాచారం గ్రామంలో ఎస్‌సీ కాలనీలో అంగన్‌వాడీ సెంటర్ నిర్వహించడానికి సరైన వసతులు లేకపోవడంతో తమకు సంబంధించిన య॥ 0-04 కుంటల భూమిని అంగన్ వాడీ కేంద్రం నిర్మించడానికి తన అమ్మమ్మ మోరంపూడి సంజీవమ్మ పేరుతో దానం చేయడంతో ప్రస్తుతం అక్కడ అంగన్‌వాడీ సెంటర్ ద్వారా మాతా, శిశువులకు సేవలందుతున్నాయి. దీంతో ఎల్లిన రాఘవరావు ఆ ప్రాంత ప్రజలకు ఆపద్భాంధవుడయ్యాడు. నాచారం గ్రామంలో కొండపై జగదాంబ సమేత జయలింగేశ్వరస్వామి, లక్ష్మీనరసింహ స్వామి దేవాలయాలను నిర్మించడానికి ఉన్నత హోదాల్లో ఉన్న నాచారం గ్రామానికి చెందిన నరుకుళ్ళ త్రినాథ్, భవాని శంకర్‌ల సూచనలు, సలహాలు మేరకు గ్రామస్తుల అందరి సహకారంతో రూ.50 లక్షల నగదును సేకరించడంలో కీలకపాత్ర పోషించి ప్రభుత్వం నుండి సుమారు రూ.కోటిన్నర దేవాలయాల నిర్మాణాలకు నిధుల రూపంలో మంజూరి చేయించడంలో కీలకపాత్ర వహించడమే కాకుండా కొండపై దేవాలయాల నిర్మాణానికి స్థలం చాలకపోవడంతో సుమారుగా తన సొంత సొమ్ము రూ.5.80 లక్షల వెచ్చించి భూమిని చదును చేయించి దేవాలయాలు నిర్మాణం అవడానికి ముఖ్య భూమిక పోషించి తన ఆధ్యాత్మిక భావనను చాటుకోవడంలో నాచారం రాఘవుడిగా పేరుతెచ్చుకున్నారని ఆ ప్రాంత ప్రజల భావన. నాచారం గ్రామంలో తన ఇంటి వద్దే సుమారు రూ.3 లక్షల ఖర్చుతో మినరల్ వాటర్ ప్లాంటును ఏర్పాటు చేసి నాచారం ప్రాంత ప్రజలందరికీ ఉచితంగా సరఫరా చేయడంతో నాచారం ప్రాంత వాసులకు దాహార్తిని తీర్చినవాడయ్యాడు. దమ్మపేట సొసైటీ చైర్మెన్‌గా గత డిశంబర్‌లో బాధ్యతలు స్వీకరించిన ఎల్లిన రాఘవరావు చిన్న రైతులకు రూ.25 వేల నుండి 50 వేలు సొసైటీ ద్వారా రుణాలు ఇప్పించడం కోసం కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. పామాయిల్ రైతులకు 5 ఎకరాలు పై బడి సాగు చేస్తున్న రైతులకు 20 లక్షల వరకు రుణాలు ఇప్పించాలనే సంకల్పంతో ప్రణాళిక రూపొందిస్తున్నట్టు వివరించారు. సొసైటీ కారాలయం ఎదురుగా షాపింగ్ కాంప్లెక్స్ నాబార్డు నిధుల ద్వారా నిర్మాణం చేపట్టి పై అంతస్తులో డీసీసీబీ బ్యాంకును తరలించడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. పట్వారిగూడెం, నాగుపల్లి ప్రాంతాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా ఎరువులు గోడౌన్‌లను నిర్మించడానికి స్థలాన్ని సేకరించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని వివరించారు. రూ.30 లక్షలు రుణ మాఫీ పొందిన చిన్న రైతులకు తిరిగి ఆ రైతులకే రెన్యువల్‌గా ఋణాలు ఇచ్చినట్టు రాఘవరావు నవతెలంగాణకు వివరించారు. తాను రైతు బిడ్డను కావడంతో రైతులకు సేవ చేసుకునే భాగ్యాన్ని, అవకాశాన్ని సొసైటీ చైర్మెన్‌గా తనను ఎంపిక చేసిన రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరావుకు అన్ని సందర్భాలలో తనకృతజ్ఞతా భావంతో వ్యవహరిస్తానని తెలియజేశారు.

బర్లగూడెం రహదారికి మరమ్మతులు

నవతెలంగాణ-టేకులపల్లి



మండలంలోని కొప్పురాయి నుండి బర్లగూడెం వరకు రహదారి మరమ్మతు చేయించాలని బర్లగూడెం జంగాలపల్లి గ్రామస్తులు ఎమ్మెల్యే కోరం కనకయ్యకు తెలపగా స్పందించిన ఎమ్మెల్యే గురువారం కొప్పురాయి నుండి బర్లగూడెం వరకు మరమ్మతులను చేయించారు. మరమ్మతుల పనులను నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు కోరం సురేందర్ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు మోకాళ్ళ పోషాలు, ఇది గణేష్, భూక్య సర్దార్, బానోతు రవి, భూక్య చందర్ సింగ్, మోహన్, చింత కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

సీతారామ ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందించండి

- మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్

నవతెలంగాణ-టేకులపల్లి



సీతారామ ప్రాజెక్టు ద్వారా రోళ్ళపాడు ప్రాజెక్టుకు సాగునీరు అందించాలని ఇల్లందు నియోజకవర్గ మాజీ శాసన సభ్యురాలు బానోత్ హరిప్రియ నాయక్ ప్రభుత్వాన్ని బుధవారం డిమాండ్ చేశారు. బస్టాండ్ సెంటర్ నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, అనంతరం ఆమె మాట్లాడారు. రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ప్రతి ఎకరంకు సాగునీరు అందించాలని, ఒక గొప్ప భగీరథ ప్రయత్నాన్ని మొదలు పెట్టడం జరిగిందని, కాని నేటి కాంగ్రెస్ ప్రభుత్వం నీరు ఉన్న చోటికి తిరిగి గోదావరి జలాలను తరలిస్తూ, కొత్తగూడెం జిల్లా నది పరివాహక ప్రాంతాలకు, ఇల్లందు నియోజకవర్గానికి సాగునీరు అందించకుండా రైతులకు తీరని అన్యాయం చేస్తుందన్నారు. ఇల్లందు నియోజక వర్గంలో కామేపల్లి, గార్ల మండలాల నుండి కాలువలు పోయినప్పటికీ అక్కడి రైతులకు ఎటువంటి ఉపయోగం లేదన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షులు లక్కినేని సురేందర్ రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు వరప్రసాద్, ప్రధాన కార్యదర్శి బోడ బాలు నాయక్, మాజీ ఎంపీటీసీ జాలాది అప్పారావు, మాజీ మండల అధ్యక్షులు తేజావత్ రవి, నాయకులు బానోత్ కిషన్, బానోత్ రామా నాయక్, లాలు, బాలు, రవి, లచ్చు తదితరులు పాల్గొన్నారు.

హరీష్‌రావు ఒళ్ళు దగ్గర పెట్టుకొని మాట్లాడు..

- అభివృద్ధి ప్రదాత తుమ్మలను అవమానిస్తే సహించం
- మండల కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-దమ్మపేట

మాజీ మంత్రి హరీష్ రావు ఒళ్ళు దగ్గర పెట్టుకొని మాట్లాడాలని మండల కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. బుధవారం మండల పరిధిలోని నాచారం గ్రామంలో కాంగ్రెస్ నాయకులు ఎల్లిన మురళి ఇంటివ వద్ద జరిగిన సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖమ్మం జిల్లా అభివృద్ధి ప్రదాత రాష్ట్ర వ్యవసాయ, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును విమర్శించే హక్కు హరీష్ రావుకు లేదని అన్నారు. 45 ఏళ్ల రాజకీయ జీవితంలో తుమ్మల నాగేశ్వరరావు ఏనాడు వ్యక్తిగత స్వలాభం కోసం ఏ పని చేయలేదని, ప్రతినిత్యం ఉమ్మడి ఖమ్మం జిల్లాను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేశారని, అలాంటి వ్యక్తిపై మాజీ మంత్రి హరీష్ రావు అసత్య మాటలు మాట్లాడటం మంచిది కాదన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు ఆలపాటి రామచంద్ర ప్రసాద్, కాసాని నాగాప్రసాద్, కెవి సత్యనారాయణ, మాజీ ఎంపీపీ సోయం ప్రసాద్, అచ్యుతరావు, ఏల్లిన రాఘవరావు, ఉపేంద్ర బాబు, ఎర్ర వసంతరావు, కక్కిరాల రమేష్, రాధాకష్ణ యాదవ్, మన్నె అప్పారావు, దొడ్డ ప్రసాద్, ఇస్లావత్ శ్రీను, బొల్లికొండ నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రుణమాఫీ నగదు పంపిణీ

నవతెలంగాణ-చంద్రుగొండ



రైతులకు ఇచ్చే రుణమాఫీ నగదును పంటకు పెట్టుబడి కింద వాడుకోవాలని గానుగపాడు సహకార సంఘం చైర్మెన్ చెవుల చంద్రావు సూచించారు. బుధవారం స్థానిక సహకార సంఘం కార్యాలయంలో రెండు విడతలల్లో 336 మంది రైతులకు రూ.1.30 కోట్లు రుణమాఫీ నగదు సొసైటీ చైర్మెన్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా చంద్రావు మాట్లాడుతూ... ఏజెన్సీ ఏరియాలో పట్టదారు పాసుపుస్తకాలతో సంబంధం లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలన్నారు. ప్రభుత్వం సొసైటీల్లో ఉన్న రైతులకు కండీషన్లతో పనిలేకుండా రుణమాఫీ చేయాలన్నారు. కొంత మంది రైతులకు మాత్రమే రుణమాఫీ చేయటం వల్ల రైతుల్లో సైతం తారతమ్య బేధాలు వస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సెక్రటరీ లంక నరసింహరావు, వైస్ చైర్మెన్ భూపతి ధనలక్ష్మి, డైరక్టర్లు, రైతులు పాల్గొన్నారు.



ఐకేపీ వివోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి

- కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి
- ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం ఐక్యంగా పోరాడుదాం
- వివోఏ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌వి.రమ

నవతెలంగాణ-కొత్తగూడెం

ఐకేపీ వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, ప్రభుత్వం ఎన్నికల ముందు హామీ ఇచ్చిన విధంగా రూ.26,000ల కనీస వేతనం ఇవ్వాలని తెలంగాణ ఐకెపి వివోఏ ఉద్యోగుల సంఘం (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌వి.రమ డిమాండ్ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఐకెపి వీవోఏ ఉద్యోగుల సంఘం జిల్లా సదస్సు సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు రేష్మ అధ్యక్షతన బుధవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో జరిగింది. ఈ సదస్సులో ఎస్‌వి.రమ మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు ఐకెపి వివోఏలు సమ్మె చేశారని సమ్మె చేస్తున్న సందర్భంలో, తర్వాత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.26,000ల కనీస వేతనం ఇస్తామని కరపత్రాలు పంపిణీ చేశారని, కరపత్రాలు పంచినవారు ఇప్పుడు మంత్రులుగా వున్నారు. అయిన వీఓఏల సమస్యలుపరిష్కారం చేయటంలేదన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో సైతం వేతనాలు పెంచుతామని, రూ.18,000ల వేతనం ఇస్తామని కాంగ్రెస్ వాగ్దానం చేసిందని గుర్తు చేశారు. చేసిన వాగ్దానాలకు విరుద్ధంగా ప్రభుత్వం ఐకెపి వివోఏల సమస్యలను నిర్లక్ష్యం చేస్తుందని విమర్శించారు. తీవ్రమైన పని భారాన్ని పెంచుతున్న ప్రభుత్వం వివోఏల శ్రమను గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల నుంచి పొదుపును సేకరించడంలో రాష్ట్ర ఆర్థిక ప్రగతికి తోడ్పాటు అందించడంలో విఓఏల పాత్ర కీలకంగా ఉందని పేర్కొన్నారు. వివోఏలకు సంబంధం లేని అనేక రకాల పనులు, సర్వేలను ప్రభుత్వం చేయిస్తుందని ఈ పని భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. ఐకెపి వివోఏలకు రూ.10 లక్షలు ఇన్సూరెన్స్ పథకాన్ని అమలు చేయాలని, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌ల వల్ల కార్మికులు పోరాడే హక్కు కోల్పోతారని పేర్కొన్నారు. ప్రజల మీద, కార్మిక వర్గం మీద ఆర్థిక భారాలు వేస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కూడా ఐకెపి వివోఏలు పోరాటం చేయాలని పిలుపు నిచ్చారు. రాష్ట్రంలో సమస్యల పరిష్కారం కోసం ఇప్పటికే పలుమార్లు మంత్రులకు, అధికారులకు వినతి పత్రాలు ఇచ్చామని వారు స్పందించి సమస్యలు పరిష్కారం చేస్తే మంచిదని లేనియెడల సమరశీల పోరాటాలు తప్పవని సిఐటియు పేర్కొన్నది. ఈ జిల్లా సదస్సులో తెలంగాణ ఐకెపి వివోఏ ఉద్యోగుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుధాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం. నగేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు లక్ష్మారెడ్డి, జిల్లా సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.బ్రహ్మాచారి, ఏజే.రమేష్, జిల్లా కోశాధికారి జి.పద్మ, తెలంగాణ ఐకెపి వివోఏల సంఘం జిల్లా కార్యదర్శి అరుణ, కోశాధికారి చంద్రలీల, జిల్లా నాయకులు సుల్తానా, ఇర్పా అనురాధ, వెంకటలక్ష్మి, సులోచన, పాపారావు, ఈసం రాము, కుమారి, రోజా, సిఐటియు జిల్లా నాయకులు డి.వీరన్న, కె.సత్య భూక్య రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై గ్రామసభలు

నవతెలంగాణ-చండ్రుగొండ

మండలంలో 2023-24 సంవత్సరంలో జరిగిన జాతీయ గ్రామీణ ఉపాధి పనులపై బుధవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించారు. పనులకు వెచ్చించిన నిధుల వివరాలను వెల్లడించారు. ఉపాధి పథకం కింద నాటిన మొక్కల్లో 40 శాతం చనిపోయాయని ఆడిట్ సభ్యులు తెలిపారు. ఈ నెల 16న రైతువేదికలో ఓపెన్‌ఫోరం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో చండ్రుగొండ ఎంపీడీవో బయ్యారపు అశోక్, ఎంపీవో ఖాన్, చండ్రుగొండ పంచాయతీ కార్యదర్శి రాజేందర్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు వెంకట రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్మశాన వాటికకు వెళ్లే దారిని బాగు చేయండి

నవతెలంగాణ-దుమ్ముగూడెం

మండలంలోని నడికుడి గ్రామ పంచాయతీలో గల స్మశాన వాటికకు వెళ్లే రహదారిని బాగు చేయాలంటూ అనేక మార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఆ రహదారికి మాత్రం మోక్షం కలగడం లేదని మాజీ ఎంపీటీసీ సోడి తిరుపతిరావు ఆరోపిస్తున్నారు. బుధవారం నందులచెలక గ్రామానికి చెందిన సోయం రామమ్మ అనారోగ్యంతో మృతి చెందడం జరిగిందన్నారు. రామమ్మ పార్థివదేహాన్ని స్మశాన వాటికకి తీసుకెళ్లడానికి గ్రామస్థులు రహదారి సౌకర్యం లేక మోకాళ్ళ లోతు బురదలో వెళ్లాల్సి వచ్చిందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్మశాన వాటికకు వెళ్లే దారిని బాగు చేయాలని వేడుకుంటున్నారు.

విజృంభిస్తున్న విష జ్వరాలు

- పట్టించుకోని అధికారులు

నవతెలంగాణ-లక్ష్మీదేవి పల్లి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయని బీజేపీ లక్ష్మీదేవి పల్లి మండల అధ్యక్షుడు మాలోత్ గాంధీ నాయక్ అన్నారు. గ్రామంలో రోగాల బారినబడిన పలువురిని ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ విష జ్వరాల వల్ల ఆస్పత్రుల్లో రోగులు పెరుగుతున్నారని, గ్రామాల్లో పారిశుధ్యం పేరుకుపోయిందని, గ్రామాల్లో దోమల మందు పిచకారి చేయించాలని, అంతర్గత రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. పారిశుధ్య లోపం వల్ల డెంగీ, మలేరియా, జ్వరాలు విస్తరించడంతో ఆస్పత్రులన్నీ రోగులతో కిటకిటలాడుతున్నాయి. డెంగీ, మలేరియా జ్వరాలతో గ్రామీణ ప్రాంత ప్రజలు వణికిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనేకమంది ప్రజలు దగ్గు, జలుబుతో పాటు ఇతర లక్షణాలతో ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారన్నారు. గ్రామాల్లో మెడికల్‌క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు.



రైతాంగ ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- రైతు రుణాల చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే తెల్లం

నవతెలంగాణ-దుమ్ముగూడెం

రైతాంగ ఆర్థికాభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, వరంగల్ రైతు డిక్లరేషన్‌లో రాహుల్ గాంధీ ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కట్టుబడి ఉన్నారన్నారని ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ అన్నారు. బుధవారం ఆయన దుమ్ముగూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార కార్యాలయ ఆవరణలో రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడత రెండో విడత మంజూరు చేసిన రుణమాఫీ చెక్కులను ఆయన రైతులకు అందజేశారు. అర్హులైన రైతులకు అందరికీ రుణమాఫీ వస్తుందని, రైతులు అధైర్య పడవలసిన పని లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తుందన్నారు. చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు కిలిమి ఎల్లారెడ్డి, డిసిసిబి ఏజీఎం జి.ప్రవీణ్, మాజీ జడ్పీటీసీ తెల్లం సీతమ్మ సంఘం డైరెక్టర్లు యలమంచి శ్రీనివాసరావు (శ్రీను బాబు), బొల్లి సూర్యచంద్రరావు, బొల్లి వెంకట్రావు, కాల్వ పూర్ణయ్య, పిసోడి వెంకటేష్, పాయం చలపతి, కోపరేటివ్ బ్యాంక్ మేనేజర్ సిహెచ్ త్రిమూర్తులు, సంఘం సీఈవో హిమబిందు, కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతులు పాల్గొన్నారు.

పల్లె దవాఖానకు వెళ్లాలంటే ఎన్ని కష్టాలో..



నవతెలంగాణ-చండ్రుగొండ

మండలంలోని తుంగారం గ్రామపంచాయతీలోని ఆరోగ్య కేంద్రానికి వెళ్లాలంటే ప్రజలు భయపడుతున్నారు. రేపల్లె వాడ, తుంగారం గ్రామాల ఆరోగ్య కేంద్రానికి గ్రామస్తులు భయపడుతూ వెళ్తున్నారు. వర్షం వస్తే ఆరోగ్య కేంద్రం మొత్తం పూర్తిగా మురికి నీళ్లతో బురదమయం అవుతుందని జ్వరం వచ్చిందని కేంద్రానికి వెళ్తే ఎక్కడ జారి కిందపడి కాలు విరుగుతుందో అన్న భయంతో కేంద్రానికి వెళ్లకుండా ప్రయివేటు మెడికల్ షాపులకు వెళ్తున్నామని, గత వారం రోజుల క్రితం కిందపడి గాయాల పాలు అయ్యారని గ్రామస్తులు వాపోతున్నారు. వర్షం వచ్చిందంటే ఈ కేంద్రం మొత్తం పూర్తిగా నీటితో నిండి రాలేని పరిస్థితి నెలకొన్నది. ఆరోగ్య కేంద్రం పూర్తిగా రహదారికి దిగువన ఉండటం వలన చిన్న చినుకు పడితే ఆరోగ్య కేంద్రం నీళ్ళు చేరుతున్నాయి. దీంతో రోగులు ఎన్నో ఇబ్బందులు ఎదురుకోవలసి వస్తుందని ప్రజలు అంటున్నారు. స్థానిక శాసనసభ్యులు, ప్రభుత్వం చొరవ చూపి మరమ్మతులు చేపట్టాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

'సీతారామ' కరుణించేనా..?

- వృథా అయిన రైతుల త్యాగం..
- ప్రాజెక్టు మన ప్రాంతంలో ఉన్న ఎకరాకు పారని నీరు
- నేడు మంత్రులతో ఫేస్ 1 పంప్ హౌస్ ప్రారంభం

నవతెలంగాణ-అశ్వాపురం

పినపాక రైతులను సీతారామ ప్రాజెక్టు కరుణించకుండానే పోతోంది. అశ్వాపురం మండలంలోని కుమ్మరిగూడెం సమీపంలో గల గోదావరి నదిపై ప్రతిష్టాత్మకంగా నిర్మాణమైన సీతారామ ప్రాజెక్టు నిర్మాణం కోసం ప్రధానంగా అశ్వాపురం మండలంలోని అమ్మగారిపల్లి, అమేర్ద, సంద్రాలబోడు, మొండికుంట పంచాయతీలోని రైతులు ప్రాజెక్టుకు భూములు ఇచ్చి త్యాగాన్ని చాటుకున్నారు. భూములు కోల్పోయిన రైతులు తమకు నష్టం జరిగిన వేలాది మంది రైతులకు న్యాయం జరుగుతుందన్న ఉద్దేశంతో ప్రాజెక్టుకు దశాబ్దాలుగా సాగు చేసుకున్న భూములను దారా దత్తం చేశారు. ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే పినపాక నియోజకవర్గంలోని బీడు భూములన్ని సాగుభూములుగా మారి మట్టిలో మాణిక్యం పండుతుందన్న ఆశతో రైతులు ఉన్నారు. ఇప్పుడు పినపాక నియోజకవర్గానికి సుక్క నీరు కూడా రావట్లేదని తెలుసుకోవడంతో నిరాశకు గురవుతున్నారు.

నియోజకవర్గంలోని భూమాతకు బీటలు



సీతారామ ప్రాజెక్టు నిర్మాణంలో భూములు ఇచ్చిన రైతులు తాము చేసిన త్యాగం ఫలించకపోవడంపై తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. మన ప్రాంతంలో సాగునీరు ప్రాజెక్టు ఉంటే తమకెంతో మేలు జరుగుతుందని ఆశపడిన అన్నదాతలకు నిరాశ ఎదురవుతోందని ఆవేదన చెందుతున్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతో పినపాక నియోజకవర్గం తో పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైతాంగానికి సీతారామ ప్రాజెక్టు నీళ్లు అందించేలా డిజైన్ చేయకపోవడం వల్ల సీతారామ నీళ్ల అందించడంలో భద్రాద్రి జిల్లాకు అన్యాయం జరుగుతుందని రైతులు అంటున్నారు. త్యాగం మేం చేస్తే భోగం మరొకరు అనుభవించేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నదాతల అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం భద్రాద్రి జిల్లాతో పాటు ప్రాజెక్టు పురిటి గడ్డైనా అశ్వాపురం అలాగే పినపాక నియోజకవర్గం లోని అన్ని ప్రాంతాలకు సీతారామ నీళ్లు ఇచ్చేలా కార్యాచరణను సిద్ధం చేసి యుద్ధ ప్రాతిపదికన సాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టాలని రైతులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

నేడు మంత్రులచే సీతారామ పేజ్ వన్ పంప్ హౌస్ ప్రారంభం

భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని బిజీ కొత్తూరు సమీపంలో గల సీతారామ పేస్ వన్ పంప్ హౌస్‌ను రాష్ట్ర మంత్రులు గురువారం ప్రారంభించనున్నారు. జిల్లా ప్రజల చిరకాల వాంఛగా నిర్మితమైన ఈ ప్రాజెక్టు గురువారం నుండి జలసిరులను సంతరించుకోనుంది. ఫేస్ వన్ మోటార్ల ప్రారంభంతో గ్రావిటీ కెనాల్ ద్వారా ములకలపల్లి, పూసుగూడెం ఫేస్ వన్ ఫేస్ టు పంప్ హౌస్ లను ఇక్కడి గోదావరి జలాలు తాకనున్నాయి.



ఉద్యోగాలు సాధించిన వారికి సన్మానం

అశ్వారావుపేట : అక్షరాభ్యాసం నుండి ఉన్నత విద్య వరకు ప్రభుత్వ రంగ విద్యనే పొంది, సత్ఫలితాలు సాధించి ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన రిక్రూట్ మెంట్ లో అశ్వారావుపేటలోని దొంతికుంటకు చెందిన ఇరువురు దళిత యువకులు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. వీరిని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అనిత బుధవారం కళాశాలలో అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థి కాని మరే ఇతర రంగానికి చెందిన వ్యక్తులు అయిన సమయాన్ని సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో మెలిగితే సత్ఫలితాలు పొందడం సునాయాసం అవుతుందని అన్నారు. అశ్వారావుపేట పంచాయతీ దొంతికుంటకు చెందిన రామక్రిష్ణ, యోహానులు ఇరువురు బాల్యం నుండి స్నేహితులు. వీరు ఇరువురు పాఠశాల నుండి కళాశాల విద్య వరకు ప్రభుత్వం రంగంలోనే చదువుకున్నారు. వీరు ఇరువురు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుకున్నారు. అనంతరం ఉన్నత విద్యను పూర్తి చేసారు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన రిక్రూట్మెంట్‌లో రామక్రిష్ణ అగ్నిమాపక, విపత్తులు శాఖలో కానిస్టేబుల్‌గా, యోహాను బెటాలియన్‌లో ఉద్యోగం సాదించారు. వీరిని కళాశాల ప్రిన్సిపాల్ తో సహా లెక్చరర్స్ అరవింద్,దామెర నరసింహారావు, డేగల నరసింహారావు, సురేష్, అభినందించారు.

మోడీ పాలనలో మహిళలకు రక్షణ కరువు

- ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బుగ్గ వీటి సరళ
- మహిళా రక్షణ చట్టాలు కాగితాలకే పరిమితం
- ఐద్వా జిల్లా కార్యదర్శి ఎం.జ్యోతి
- అట్టహాసంగా ప్రారంభమైన ఐద్వా భద్రాచలం పట్టణ 12వ మహాసభ

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

నరేంద్ర మోడీ నేతృత్వంలోని ఎన్డీఏ పాలనలో దేశంలో మహిళల మాన ప్రాణాలకు రక్షణ లేకుండా పోతుందని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి సరళ విమర్శించారు. బుధవారం పట్టణంలోని చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో మహిళా సంఘం జిల్లా కమిటీ సభ్యులు నాదెండ్ల లీలావతి, జీవనజ్యోతిల అధ్యక్షతన జరిగిన 12వ పట్టణ మహాసభకు ముఖ్య అతిథిగా బుగ్గవీటి సరళ పాల్గొని మాట్లాడుతూ.. పశ్చిమ బెంగాల్లో అత్యంత పాశవికంగా మహిళా జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం చేసి హత్య చేసినా మోడీ నోరు విప్పటం లేదని విమర్శించారు. ప్రతిరోజు ఎక్కడో ఒకచోట మూడు నెలల పాప నుండి 60 ఏళ్ల ముసలమ్మల వరకు అత్యాచారాలు జరుగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు చిన్నారులపై అగాత్యాలు జరుగుతున్న కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదని ఆరోపించారు. దేశ సంపాదన మొత్తం అదాని అంబానీలకే దారపోస్తూ దేశంలో రోజురోజుకీ నిరుద్యోగాన్ని పెంచి పోషిస్తున్నారని అన్నారు. మోడీ మూడోసారి అధికారం చేపట్టాక మైనార్టీ హక్కులపై మరింతగా దాడులు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఐక్య పోరాటాలు నిర్మించేందుకు ఐద్వాసిద్ధంగా ఉందని అందులో భాగంగానే గ్రామస్థాయి నుండి ఆలిండియా స్థాయి వరకు మహాసభలు ప్రారంభిస్తున్నామని ఈ మహాసభలలో రానున్న రోజులలో మహిళా సమస్యల పరిష్కారానికి కావలసిన కార్యరూపాన్ని రూపొందిస్తున్నామని సరళ స్పష్టం చేశారు.



మహిళా చట్టాలు కాగితాలకే పరిమితం : మందలపు జ్యోతి, జిల్లా కార్యదర్శి

మహిళల రక్షణ కోసం రూపొందించిన చట్టాలు కేవలం కాగితాలకే పరిమితం అవుతున్నాయని మహిళా సంఘం జిల్లా కార్యదర్శి జ్యోతి ఆరోపించారు. రెండు తెలుగు రాష్ట్రాలలో ఏర్పడ్డ నూతన ప్రభుత్వాలు మహిళల రక్షణ కోసం ప్రత్యేక కార్యచరణ అంటూ ఏది రూపొందించలేదని ఆ ఫలితంగా రెండు రాష్ట్రాలలో కూడా మహిళలపై దాడులు రోజురోజుకీ అంతకంతకు పెరుగుతూనే ఉన్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అనేక మహిళా ఉద్యమాలకు కేంద్రమైన భద్రాచలం పట్టణ 12వ మహాసభ రెండు రోజులపాటు అట్టహాసంగా నిర్వహించి నూతన కమిటీని ఎన్నుకోబోతున్నామని జ్యోతి తెలిపారు. ఈ మహాసభకి సీనియర్ నాయకురాలు నాదెండ్ల లీలావతి సంఘం జెండాను ఆవిష్కరించగా మహిళా సంఘం పట్టణ కార్యదర్శి డి.సీతాలక్ష్మి 3 సంవత్సరాల కార్యక్రమాల నివేదికను ప్రవేశపెట్టారు. ఈ మహాసభలో పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు రాధ, సక్కుబాయి, మచ్చ రమాదేవి, ఏజే గౌతమి, పుణ్యవతి, పూర్ణిమ, గణపతి అమ్మ కనక శ్రీ, తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెం జిల్లా కోర్టులో ఐఎల్‌పీఏ గోడపత్రిక ఆవిష్కరణ చేసిన 'బార్' అధ్యక్షుడు లక్కినేని

నవతెలంగాణ-కొత్తగూడెం

ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఐఎల్‌పీఏ వారు ఈనెల 25న హైద్రాబాద్, మాసబ్ ట్యాంక్, జవహర్లాల్ నెహ్రూ ఫైనాన్స్ యూనివర్సిటీ ప్రాంగణంలో నిర్వహిస్తున్న "ఓబీసీ అడ్వకేట్స్ కన్వెన్షన్" వెన్యూ విజయ వంతం చేయాలని బార్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ కోరారు. గురువారం కొత్తగూడెం కోర్టు ఆవరణంలో కన్వెన్షన్‌ని జయప్రదం చేయాలని గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని లక్కినేని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ మినిస్టర్ ఫర్ బీసీ వెల్ఫేర్ అండ్ ట్రాన్స్‌పోర్టు పొన్నం ప్రభాకర్ గౌడ్, తెలంగాణ హైకోర్టు హానర్ బుల్ జస్టిస్ సూరేపల్లి నందా, డాక్టర్ వకుళాభరణం, కృష్ణ మోహన్ రావు, చైర్మన్ బీసీ కమిషన్‌లు హాజరవుతారని తెలిపారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు

నవతెలంగాణ-దుమ్ముగూడెం

దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మారాయి గూడెం, సిరిగుండం గ్రామాలతో పాటు నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సీతారాంపురం గ్రామంలో బుధవారం వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. వైద్యాధికారులు పుల్లారెడ్డి, సుభాష్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఫీవర్ ఉన్నవారికి ఆర్‌టిడి కిట్ల ద్వారా రక్త పరీక్షలు నిర్వహించారు. గ్రామాలలో ఇంటింటి ఫీవర్ సర్వే నిర్వహిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి ఒక్కరూ రాత్రిపూట విధిగా దోమతెరలను ఉపయోగించాలని, ఇంటి ముందు నీళ్ల నిలువ లేకుండా చూసుకోవాలని సూచించినట్లు వైద్యులు తెలిపారు. వైద్య శిబిరంలో ఆయా వైద్యశాలకు చెందిన వైద్య సిబ్బందితోపాటు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



వేతనాలు చెల్లించేంత వరకూ సమ్మె విరమించేది లేదు

- కార్మికుల జీవితాలతో ఆటలాడుతున్న కాంట్రాక్టర్‌ని బ్లాక్ లిస్టులో పెట్టాలి
- కొనసాగుతున్న ఆస్పత్రి కార్మికుల సమ్మె
- శిబిరాన్ని ప్రారంభించిన మచ్చా వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

ఆస్పత్రి కార్మికుల వేతనాలను చెల్లించేంత వరకూ సమ్మె విరమించేది లేదని కార్మికులు చేస్తున్న పోరాటానికి సీపీఐ(ఎం) సంపూర్ణ మద్దతు ఇచ్చి అండగా నిలుస్తుందని పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. బుధవారం భద్రాచలం ఏరియా హాస్పిటల్‌లో పనిచేస్తున్న కాంటాక్ట్ కార్మికులు చేస్తున్న సమ్మె శిబిరాన్ని రెండవ రోజు మచ్చా వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా మచ్చ కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ.. గత మూడు నెలలుగా వేతనాలు పెండింగ్లో ఉండటం వల్ల కార్మికులకు ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ ఇంటి అద్దెలు కట్టలేక కిరాణా సరుకులు కొనలేక అప్పులు ఇచ్చేవారు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కార్మికులు అనివార్య పరిస్థితులలో సమ్మెకు దిగినారని కనీస వేతనం 26,000 ఇవ్వాలని, పని భద్రత కల్పించాలని, ఈఎస్ఐ సౌకర్యం పీఎఫ్ సౌకర్యం కల్పించాలని ఎన్నో సంవత్సరాలుగా ఆందోళన పోరాటాలు నిర్వహిస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వంగాని ఇప్పుడు ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంగాని కార్మికుల సమస్యలను పెడచెవిన పెడుతున్నదని విమర్శించారు. ఏ ప్రభుత్వాలు వచ్చినా కార్మికులకు ఏమి ఒరిగేది లేదని, ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు, అధికారులు, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకొని వెంటనే మూడు నెలల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల వేతనాలు విడుదల చేసే వరకు నిరవధిక సమ్మె కొనసాగిస్తారని దీనికి సిపిఎం పార్టీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని భవిష్యత్తులో కూడా వారి పోరాటాలకు పూర్తిస్థాయి మద్దతు ఇస్తామని తెలిపారు. సీఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎంబి నర్సారెడ్డి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, సీఐటియు పట్టణ నాయకులు బి.శరత్ బాబు, వైవి రామారావు, పి.సంతోష్, నాగరాజు, లక్ష్మణ్, కార్మిక సంఘం నాయకులు రమాదేవి, రమణమ్మ, గీత, నిర్మల, కుమారి, మెహబూబ్, నాగరాజు, నరసింహారావు, నరేంద్ర, భాస్కర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి జిల్లా వాటా తేల్చండి

- 'సీతారామ' నీటిపై సీఎం స్పష్టమైన హామీ ఇవ్వాలి
- రైతు సంఘాల డిమాండ్
- జిల్లా రైతు సంఘాలతో చర్చలు జరపాలి
- లేకుంటే మేమే రేవంత్‌రెడ్డి వద్దకు వస్తాం
- విలేకర్ల సమావేశంలో సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) నాయకుల హెచ్చరిక

నవతెలంగాణ-కొత్తగూడెం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నిర్మిస్తున్న సీతారామ ప్రాజెక్టు ద్వారా ఈ జిల్లాకి రావాల్సిన నీటి వాటాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టమైన హామీతో ప్రకటించాలని, ఎప్పటి వరకు నీరు అందించేది తెలియజేయాలని సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు డిమాండ్ చేశారు. ప్రాజెక్టుపై మాట్లాడటానికి రైతు సంఘాలకు అవకాశం ఇవ్వాలని లేనియెడల రైతు సంఘాల నాయకులే ముఖ్యమంత్రి దగ్గరికి వస్తారని సమయుక్తి కిసాన్ మోర్చా నాయకులు కాసాని ఐలయ్య, ముత్యాల విశ్వనాథం, జాటోత్ కృష్ణ, నాగేశ్వరరావు, ఉక్లా నాయక్‌లు హెచ్చరించారు. బుధవారం స్థానిక మంచి కంటి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రూ.18,600 కోట్లతో నిర్మితమవుతున్న సీతారామ ప్రాజెక్టు ప్రభుత్వం చెప్పిన లెక్కల ప్రకారం రూ.8600 కోట్లు మాత్రమే ఇప్పటికి ఖర్చయ్యాయని ఇంకా పదివేల కోట్లు ఖర్చు పెట్టాల్సిన అవసరం ఉందని తెలిపారు. అటువంటి దశలో హడావుడిగా ప్రాజెక్టుని నిర్మించాల్సిన అవసరం ఏమి వచ్చిందని వారు ప్రశ్నించారు. నేడు ఉమ్మడి జిల్లా మంత్రులుగా ఉన్న తుమ్మల నాగేశ్వరరావు, బట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలు తమ స్వార్ధ ప్రయోజనం కోసం ఈ జిల్లాకి రావాల్సిన నీటి వాటాలను పక్కనపెట్టి గోదావరి వరదలతో వచ్చిన నీటిని సాగర్‌కి లింక్ చేసి తరలించటం ఈ జిల్లా ప్రజలను మోసం చేయడం కాదా...? అని ప్రశ్నించారు. ఈ జిల్లా నుండి పుట్టి, పెరిగి, తాను రాజకీయంగా తయారైన తుమ్మల నాగేశ్వరరావు ఈ జిల్లాకి ద్రోహం చేస్తున్నారని ఆరోపించారు. ఈ సీతారామ ప్రాజెక్టు ద్వారా నీరు ఇవ్వాలంటే సీతమ్మ సాగర్ పూర్తి కాకుండా ఇవ్వడం సాధ్యం కాదని తెలిపారు. సీతమ్మ సాగర్ కూడా మధ్యలోనే నిర్మాణంలో ఉందని అది పూర్తిగా కావడానికి కనీసం రెండు సంవత్సరాలు సమయం పడుతుందని తేల్చి చెప్పారు. అటువంటి దశలో ఉన్న ప్రాజెక్టుని గురువారం ముఖ్యమంత్రి హడావడిగా ప్రారంభించాల్సిన అవసరం ఏమి వచ్చిందన్నారు. ఈ జిల్లా నుండి 8 మండలాల నుండి ప్రవహిస్తున్న ప్రధాన కెనాల్‌కి మేజర్ సబ్ బ్రాంచ్ కెనాల్‌కి ఏర్పాటు చేయాల్సిన లాక్‌లు, తూములు ఏర్పాటు చేయలేదని మండి పడ్డారు. అలాంటప్పుడు ఈ జిల్లాకి నీరు ఎలా ఇస్తారని వారు నిలదీశారు. దీనిపై రాష్ట్ర ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పాత డిజైన్‌ని మార్చి ఈ జిల్లాకి తీవ్ర అన్యాయం చేశారని ఆరోపించారు. పాత డిజైన్ ప్రకారం ఈ జిల్లాలో మూడున్నర లక్షల ఎకరాలు సాగునీటికి సేద్యంలోకి రావడానికి అవకాశం ఉందని అటువంటిది ప్రస్తుత డిజైన్ ప్రకారం కోల్పోతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ జిల్లా అభివృద్ధికి సస్యశ్యామలానికి పాత డిజైన్‌ని అమలు చేయాలని కోరారు. అలా చేసి 20 మండలాలకి సీతారామ ప్రాజెక్టు కెనాల్‌ను అనుసంధానం చేసి నీరు అందించాలని డిమాండ్ చేశారు. దీనిపై ముఖ్యమంత్రి రైతు సంఘాల నాయకులతో మాట్లాడాలని, జిల్లా అధికారులు మాట్లాడించాలని వారి డిమాండ్ చేశారు. ఒకవేళ ముఖ్యమంత్రి సమయం కేటాయించకపోతే ప్రారంభోత్సవం దగ్గరికి మేమే వచ్చి మాట్లాడదామని వారు తెలిపారు. ఆ సందర్భంగా ఎటువంటి ఘటన జరిగిన ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు. ఈ విలేకర్ల సమావేశంలో సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు అన్నవరపు సత్యనారాయణ, చంద్రా నరేంద్ర కుమార్, చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు, సలిగంటి శ్రీనివాస్, పి.సతీష్, రాంచందర్, చంద్రశేఖర్, మల్లికార్జునరావు, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభానికి అన్ని ఏర్పాట్లు చేయాలి : ఎమ్మెల్యే పాయం

నవతెలంగాణ-అశ్వాపురం :

మండలంలోని బిజీ కొత్తూరు సమీపంలో గల ఫేజ్ వన్ పంప్ హౌస్ ప్రారంభ పనులను బుధవారం పినపాక నియోజకవర్గం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పరిశీలించారు. గురువారం ఈ పంప్ హౌస్ ను మంత్రులు ప్రారంభించనున్న నేపథ్యంలో ఆయన సందర్శించి అధికారులతో మాట్లాడారు. ప్రారంభానికి ఎటువంటి ఆటంకాలు జరగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని సీతారామ ప్రాజెక్టు అధికారులను ఆయన కోరారు. అదేవిధంగా ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలని ఈ సందర్భంగా అధికారులను ఆయన ఆదేశించారు. ఎమ్మెల్యే తో పాటు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఐటీడీఏ పీవో రాహుల్, భద్రాచలం ఆర్డీవో దామోదర్ తహశీల్దార్లు స్వర్ణ, రాఘవరెడ్డి, సూర్యనారాయణ ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంపీ ఓ ముత్యాలరావు, సీతారామ అధికారులు ఆయన వెంట ఉన్నారు.

9

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం

గురువారం | ఆగస్టు 15, 2024 | www.navatelangana.com

ముంపు బాధిత పాస్టర్లకు ఆర్థిక సాయం

- రూ.రెండు లక్షల ఐదువేల విలువ గల బియ్యం, నిత్యావసర సరుకులు అందజేత

నవతెలంగాణ-బూర్గంపాడు



సికింద్రాబాద్‌కు చెందిన షిలోహు మిషనరీ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో గోదావరి వరద ముంపు ప్రాంతాలైన వీఆర్‌పురం, కూనవరం, బూర్గంపాడు, కుకునూరు, వేలేరుపాడు మండలాలకు చెందిన 50 మంది పాస్టర్లకు రూ.రెండు లక్షల 5000 విలువ కలిగిన బియ్యం, నిత్యావసర సరుకులను బుధవారం అందజేశారు. బూర్గంపాడు మండలం సారపాకలోని సీయోను ప్రేయర్ హౌస్ చర్చిలో వ్యవస్థాపక అధ్యక్షులు పాస్టర్ మోజెస్ ములక వీటిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టకాలంలో ఉన్నప్పుడు తోటి వారికి సహాయం చేయటం, వారిని ఆదుకోవడం క్రీస్తు చూపిన ప్రేమను తెలుపుతుందని ఆయన అన్నారు. గోదావరి వరదల వల్ల ప్రతిసారి నష్టపోతున్న ఆయా ప్రాంతాలకు చెందిన పాస్టర్లకు ఈ మిని స్ట్రీస్ ద్వారా అనేక విధములుగా సహాయం అందజేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. 50 మంది పాస్టర్లకు ఒక్కొక్కరికి రూ.3500 చొప్పున బియ్యం, నిత్యావసర సరుకులను అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. ములకలపల్లి మండలం మూకమామిడి గ్రామానికి చెందిన పూర్తి అందత్వంతో బాధపడుతున్న సమూయేలు, దావీదులకు జీవనోపాధి ద్వారా ఆర్థిక అభివృద్ధి సాధించాలని ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున రూ.30 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో షిలోహు మిషనరీ మినిస్ట్రీస్ వ్యవస్థాపక అధ్యక్షులు పాస్టర్ మోజెస్ ములక, బృందం పాస్టర్ టీఎస్ జాషువా, పాస్టర్ డి.పెద్దారావు, పాస్టర్ టి.మహిమ కుమార్, ఇమ్మా నుయేల్, ఎం.చరణ్, తదితరులు పాల్గొన్నారు.

హాజరు శాతం పెంపు, క్రమశిక్షణపై ప్రత్యేక దృష్టి

- ప్రభుత్వ కళాశాలలో చదివిన విద్యార్థులకు ప్రయివేట్ ఇంజనీరింగ్ చదువులో పూర్తి రాయితీ
- ప్రిన్సిపాల్ అల్లు అనిత

నవతెలంగాణ-అశ్వారావుపేట



విద్యార్థుల హాజరు శాతం పెంపుదల, వారి ప్రవర్తనలో క్రమశిక్షణ పెంపొందించేందుకు ప్రత్యేక దృష్టి సారించినట్టు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అల్లు అనిత తెలిపారు. బుధవారం నవతెలంగాణతో ఆమె మాట్లాడారు. ప్రస్తుతం కళాశాలలో రెండు సంవత్సరాలకు కలుపుకుని 210 మంది విద్యార్థులు నమోదు అయ్యారని, కానీ నేటి హాజరు మాత్రం 71 మాత్రమేనని అన్నారు. ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయరని, లిఫ్ట్ చేసినా బాధ్యతారాహిత్యంగా సమాధానం చెప్తారని ఆవేదన వ్యక్తం చేసారు. గతంలో హాజరుకు పరీక్షలకు సంబంధం ఉండేదని, కనీసం 75 శాతం హాజరు ఉంటేనే పరీక్షలు రాసే విధంగా నిబంధన ఉండేదని నేడు అలాంటి ఏ నిబంధన లేకపోవడంతో నేరుగా పరీక్షల ఫీజు కట్టే సమయంలో వచ్చి ఫీజు చెల్లించి పరీక్షలు రాయడానికి మాత్రమే హాజరు అవుతున్నారని వారు అన్నారు. ఇందుకోసం విద్యార్థులు హాజరు పెంపుతో పాటు క్రమశిక్షణ పెంపొందించేందుకు కార్యాచరణ చేపడుతున్నాం అని అన్నారు. ఏ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీ చదివిన విద్యార్థులకు అయినా ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రభుత్వం పూర్తి రాయితీ విద్యను అందించే సౌకర్యం తెలంగాణ ప్రభుత్వం కల్పిస్తుందని అన్నారు. ఈ సదావకాశాన్ని ప్రతీ విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మీసేవా కేంద్రాలను పరిశీలించిన తహసీల్దార్

నవతెలంగాణ-దుమ్ముగూడెం

మండల కేంద్రమైన లక్ష్మీనగరం, ములకపాడు, కాటాయిగూడెం గ్రామాలలో గల మీసేవ కేంద్రాలను తహసీల్దార్ ఎం.అశోక్ కుమార్ బుధవారం పరిశీలించారు. లక్ష్మీనగరం గ్రామంలో గల బాలాజీ మీ సేవ కేంద్రంతో పాటు, అనిల్ మీ సేవ కేంద్రం, ములకపాడు గ్రామంలో గల డేవిడ్ మీసేవ, కాటాయిగూడెం గ్రామంలో గల వెంకటేశ్వర మీసేవ కేంద్రాలను పరిశీలించారు. రేట్లతో కూడిన వివరాల పట్టికతో పాటు మీసేవ కేంద్రాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. తాగునీరు వంటి సౌకర్యం కల్పించాలన్నారు. అధిక ధరలు వసూలు చేస్తే చర్యలు తప్పని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మీ సేవ కేంద్రాల రిజిస్టర్లను పరిశీలించారు. ఆయన వెంట కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విష జ్వరాలను అరికట్టండి

నవతెలంగాణ-టేకులపల్లి

గ్రామాలలో వ్యాపిస్తున్న విష జ్వరాలను అరికట్టాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారికి వినతి పత్రం అందజేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి కల్తి వెంకటేశ్వర్లు మాట్లాడారు. మండలంలో వైరల్ జ్వరాలతో వందలాది మంది మంచం ఎక్కారన్నారన్నారు. ఆయిల్ బాల్స్ తయారుచేసి నీరు నిల్వ ప్రాంతాలలో వదలాలన్నారు. దోమ తెరలను విరివిగా అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియు రాష్ట్ర నాయకులు డి.ప్రసాద్, జిల్లా నాయకులు గుగులోతు రామచందర్, పీవైఎల్ జిల్లా నాయకులు కోడెం రవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై అవగాహన

నవతెలంగాణ-టేకులపల్లి

మండలంలోని బోడు జిల్లా ప్రజా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన సందర్భంగా నిర్మూలనకు అందరూ కృషి చేయాలని బోడు ఎస్ఐ పి.శ్రీకాంత్ బుధవారం తెలిపారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. సమస్యలు ఎదురైనప్పుడు 100, 181, 1098 హెల్ప్ లైన్ నంబర్లను ఉపయోగించుకోవాలన్నారు. విద్యార్థులకు మత్తుపదార్థాల వల్ల వచ్చే అనర్థాలపై అవగాహన కల్పించారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు జగన్ మాట్లాడారు. విద్యార్థులు చిన్న వయస్సునుంచే మంచి అలవాట్లలో నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బందితోపాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

టెండర్ కొనసాగింపు చర్యలు చేపట్టాలి

- ఏరియా ఇంజనీర్ ఆర్ శ్రీనివాస్‌కి వినతి

నవతెలంగాణ-మణుగూరు

పీకే ఓసీ మడ్ క్లీనింగ్ కాంటాక్ట్ కార్మికుల టెండర్ కొనసాగింపు చర్యలు చేపట్టాలని కోరుతూ ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో బుధవారం ఏరియా ఇంజనీర్ ఆర్.శ్రీనివాస్‌కి వినతి పత్రం అందజేసారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి యస్‌డీ నాసర్ పాషా మాట్లాడుతూ మణుగూరు ఏరియా పీకే ఓసి భారీ యంత్రాల మడ్ క్లీనింగ్ టెండర్ రోజుకి ముప్పయి మంది కాంటాక్ట్ వర్కర్లను సప్లై చేసే విధంగా సంబంధించిన కాంట్రాక్టర్ దొమ్మేటి రవికి టెండర్ గురువారం నాటికి రెండు సంవత్సరాలు పూర్తి అయినదనీ మరలా కొత్త టెండర్ ఖరారు. చేయవలసి ఉండగా ఎందుచేతనో జాప్యం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా నాయకులు అంగోత్ మంగీలాల్, మడ్ క్లీనింగ్ కాంటాక్ట్ కార్మికులు రవి, వట్టం నరేష్, కాంతారావు, వర ప్రసాద్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీ అయినా ఉప్ప తపాలా అధికారికి సన్మానం

నవతెలంగాణ-చంద్రుగొండ

చంద్రుగొండ ఉప తపాలా కార్యాలయంలో తపాలాధికారిగా పనిచేసి బదిలీ అయిన అన్వేష్ని బుధవారం గ్రామీణ తపాల ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. చంద్రుగొండ ఉప తపాలాధికారిగా కొత్తగూడెం ప్రధాన తపాల కార్యాలయం నుంచి సైదారావు వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ తపాల ఉద్యోగులు వెంకటేశ్వరరావు, వెంకట క్రిష్ణ పురుషోత్తం, గణేష్, బాల గణేష్, ఆదర్శ్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ దినదినాభివృద్ధి చెందాలి

మాజీ ఎంపీపీ చీమల నాగరత్నమ్మ జాని, ఇల్లందు



మత సామరస్యం లౌకిక విధానాలు అనసరిస్తూ శ్రమ జీవుల పక్షాన నిలుస్తున్న అభ్యుదయ పత్రిక నవతెలంగాణ. కొత్త పుంతలు తొక్కుతూ దినదినాభివృద్ధి చెందాలి. మరిన్ని కొత్త శీర్షికలు, వీక్లీ మ్యాక్జిన్ తేవాలి. నిష్పాక్షికంగా నిలుస్తున్న నవతెంగాణ 9వ వార్షికోత్సవం జరుకోవడం సంతోషకరం. పత్రిక నిర్వాహకులు, ఎడిటర్, సబ్ ఎడిటర్స్, బ్యూరోలు, స్టాఫర్స్, ఇన్‌చార్జిలు, మండల విలేకర్లకు అభినందనలు.

ఫాగింగ్ మిషన్ వేరే పంచాయతీకి ఇవ్వడమేంటి ?

- అధికారులను నిలదీసిన స్థానికులు

నవతెలంగాణ-వేంసూరు



మర్లపాడు పంచాయతీ పాగింగ్ మిషన్ వేరే పంచాయతీలకు ఇచ్చి మా గ్రామంలో దోమల మందు పిచికారీ చేయకపోవడంతో గ్రామాల్లో ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారని, ఫాగింగ్ మిషన్ వేరే పంచాయతీకి ఇవ్వడమేంటి అని స్థానికులు ప్రశ్నించారు. ఈ గ్రామపంచాయతీ కోసం కొనుగోలు చేసిన పాగింగ్ మిషను బయట పంచాయతీలకు ఇవ్వడం ఏమిటి ఎస్సీ కాలనీలో తాగునీరు రాక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే పంచాయతీ వర్కర్‌ను దమ్మపేట పంపించాల్సిన అవసరం ఏమిటి అంటూ స్థానికుడు సీనియర్ నాయకులు భీమిరెడ్డి రంగారెడ్డి పంచాయతీ అధికారిని కార్యదర్శిని బుధవారం నిలదీశారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించి ప్రతి ఇంట్లో అనారోగ్యాలకు గురవుతున్న పట్టించుకోరా.. మీ విధానం మారకుంటే స్థానిక ఎమ్మెల్యేకు, జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

సమాజ మార్పులు నవతెలంగాణ పత్రిక ది కీలక పాత్ర

- సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు

ఎర్రం శెట్టి వెంకట్రామారావు, భద్రాచలం రూరల్



సమాజ మార్పు కోసం సవాలును ఎదుర్కొంటూ నీతి నిజాయితీకి తేడాని తెలుపుతూ విలువలకు కట్టుబడి సమస్యలను ఎత్తిచూపుతు ప్రభుత్వానికి ప్రజలకు వారిదిగా ముందుకు మునుముందుకు వెళుతున్న నవతెలంగాణ దినపత్రికకు సిబ్బందికి 9వ వార్షికోత్సవ శుభాకాంక్షలు. నేటి సమాజం అనేక సమస్యలను ఎదుర్కొంటున్న సందర్భంలో మతం, కులం, పేరుతో అధికార దాహంతో అవకాశవాదులు ప్రజలను మభ్యపెట్టడానికి సంక్షేమం అనే పేరుతో ఆడుతున్న ఈ క్రీడల్లో అనేకమంది ప్రజలు నలుగుతున్నారు. సందర్భాన్ని అనుగుణంగా తీసుకున్న పాలకుల పాత్ర సరిగ్గా లేని కారణంగా యువతని లక్ష్యంగా కొన్ని శక్తులు మత్తులో దేశాన్ని దింపారు ప్రధానంగా యువతకు స్వాతంత్రం వచ్చి ఇన్ని సంవత్సరాలైనా చరిత్రను రాజ్యాంగాన్ని ప్రజలకి యువతకి తెలియకుండా ఇప్పుడున్న పాలకులు వారు చెప్పిందే రాజ్యాంగం అనే పద్ధతిలో ప్రజలను మోసం చేస్తున్నారు. అయినా పత్రిక విలువలను కాపాడుకుంటూ ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటూ ఏది నిజం ఏది అబద్ధం ఏది నీతి ఏది అవినీతి అనే విషయాలను నిష్పక్షపాతంగా ధైర్యంగా ప్రజలకు అక్షరమే ఆయుధంగా మలుచుకొని పత్రికా యాజమాన్యం సిబ్బంది చేసిన కృషికి ఈరోజు నవతెలంగాణ పత్రిక ఒక చాలెంజిగా ముందుకు తీసుకెళ్తున్న నవతెలంగాణ దినపత్రికకు 9వ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలుపుతున్నాము.

రేషన్ బియ్యం పక్కదారి..

- యథేచ్ఛగా రీసైక్లింగ్ దందా
- లక్షల్లో దండుకుంటున్న దళారులు

నవతెలంగాణ-లక్ష్మీదేవి పల్లి



నిరుపేదలకు అందాల్సిన రేషన్ బియ్యం పక్కదారి పడుతోంది. ఈ విషయం కొందరికి తెలిసినా అంటి ముట్టనట్టుగా చూసి చూడనట్టుగా ఉండటంతో కొందరు రైస్ మిల్‌కు సంబంధించిన వ్యక్తులు, దళారులు, రేషన్ షాప్ డీలర్లు యథేచ్ఛగా రీసైక్లింగ్ చేస్తూ లక్షల రూపాయలు దండుకుంటున్నారు. ఈ తతాంగం ఏజెన్సీ గ్రామాల్లో జోరుగా సాగుతున్నట్టు తెలుస్తుంది. లక్ష్మీదేవిపల్లి మండలం ఏజెన్సీ ప్రాంతంలోని పేరు ఊరు లేని ఒక రైస్ మిల్లులో దందా జరుగుతుంది. మిల్లుల్లో పీడీఎస్ రైస్‌ను నూకగా మార్చుతూ అక్రమార్కులు కోట్లకు పడుగలెత్తుతున్నారు. చుట్టుపక్కల గ్రామాల్లోని రేషన్ లబ్దిదారుల నుంచి చోటా మోటా వ్యాపారులు బియ్యాన్ని కొని బడా వ్యాపారులకు విక్రయిస్తున్నారు. కొంతమంది రేషన్ లబ్ధి దారులు డీలర్ల నుంచి తీసుకెళ్లి చిన్న చిన్న వ్యాపారులకు విక్రయిస్తే వారు బడా వ్యాపారులకు చేరవేసి జేబులు నింపుకుంటున్నారు. సబ్సిడీ రేషన్ బియ్యం అక్రమ దందా జోరుగా సాగుతున్నది. లక్ష్మీదేవిపల్లి మండలం బంగారు చిలుక రైస్ మిల్లులో ఈ దందా నడుస్తున్నప్పటికీ, సంబంధిత శాఖాధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. గత నెల తొమ్మిదో తేదీన ఇదే మిల్లులో రేషన్ బియ్యంని పట్టుకొని సీజ్ చేసి కేసు కూడా నమోదు చేసినా తీరు మార్చుకోకుండా రేషన్ బియ్యాన్ని నూకగా మారుస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. పేదల కోసం ప్రభుత్వాలు సరఫరా చేస్తున్న రేషన్ బియ్యాన్ని నూకగా చేసి అక్రమార్కులు సరిహద్దులు దాటిస్తున్నారు. అధికారులు ఎవరూ ఈ దందాపై కన్నెత్తి చూడకపోవటంతో పలు అనుమానాలకు తావిస్తోంది. స్థానికులు ఈ విషయమై పలు విధాలుగా చర్చించుకుంటున్నారు. అడ్డుకోవాల్సిన రెవెన్యూ, పౌర సరఫరా, అధికారులు ఇదేమీ పట్టనట్టే వ్యవహరిస్తున్నారు.

మంత్రుల వ్యక్తిగత స్వార్థంతో ఖమ్మం జిల్లాకు సాగునీరు

- భూములు ఇచ్చిన రైతన్నను నట్టేటముంచిన కాంగ్రెస్
- మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు

నవతెలంగాణ-మణుగూరు



జిల్లా మంత్రులు వ్యక్తిగత స్వార్థంతో సీతారామ ప్రాజెక్ట్ గోదావరి జలాలను తరలించుకుపోతున్నారని, భూములు కోల్పోయిన రైతులు ఆందోళనలో దుఃఖంతో ఉన్నారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముట్టడించారు. డిప్యూటీ తహసీల్దార్ కృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీతారామ ప్రాజెక్టు కెనాల్ నుండి వచ్చే సాగునీరును అశ్వాపురం మండలంతో పాటు భద్రాద్రి జిల్లాలోని పినపాక, అశ్వారావుపేట, కొత్తగూడెం, ఇల్లందు నియోజకవర్గాలకు సాగునీరు అందించాలని నిరసన తెలిపారు. కేసీఆర్ ఎంతో ప్రతిష్టాత్మకంగా భద్రాద్రి జిల్లా అశ్వాపురం మండలంలో సీతారామ ప్రాజెక్టుకు రూ.8 వేల కోట్లతో సీతారామ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టినట్టు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్ పనులకు రూ.70 కోట్ల నిధులు కేటాయించి నామమాత్రంగా పూర్తి చేసి కృష్ణ కెనాల్‌కు సీతారామ ప్రాజెక్టు కెనాల్‌కు అనుసంధానం చేసి దాని ద్వారా వైరా, మధిర, పాలేరు నియోజకవర్గాలకు సాగునీరు తరలించకపోవడం దారుణమని ఆయన అన్నారు. నేడు జరిగే ములకలపల్లి మండలంలో సీఎం రేవంత్ రెడ్డి కార్యక్రమాన్ని అడ్డుకుంటామని హెచ్చరించారు. రైతాంగానికి అన్యాయం జరిగితే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా, మండల నాయకులు కోలేటి భవాని శంకర్, మణుగూరు మాజీ జడ్పీటీసీ పోశం నరసింహారావు, ముత్యం బాబు, అడపా అప్పారావు, ఎడ్ల శ్రీనివాసరావు, కుంట లక్ష్మణరావు, కోడి అమరేందర్, మ్రి మల్లారెడ్డి, సూదిరెడ్డి గోపిరెడ్డి, కొల్లు మల్లారెడ్డి, జాలె రామ కృష్ణారెడ్డి, ఏనిక ప్రసాద్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ప్రధాన రహదారి వెంట వీధిదీపాలు ఏర్పాటు చేయాలి : బీఎస్పీ

నవతెలంగాణ-ఖమ్మం రూరల్

మండల పరిధిలోని వెంకటగిరి ప్రధాన రహదారి వెంట వీధిదీపాలు ఏర్పాటు చేయాలని కోరుతూ బీఎస్పీ నాయకులు బుధవారం డీపీఓ హరికిషన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు చెరుకుపల్లి నాగేశ్వరరావు మాట్లాడారు. వెంకటగిరి గ్రామం నుంచి వల్లభి, జగ్గయ్యపేట గ్రామాలకు నిత్యం పదుల సంఖ్యలో వాహనదారులు ప్రయాణం చేస్తుంటారని, రాత్రి సమయంలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. రాత్రి సమయంలో రోడ్డు సక్రమంగా కన్పించక ప్రమాదాలు జరుగుతున్నాయని గుర్తు చేశారు. అధికారులు వెంటనే స్పందించి రహదారుల వెంట వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మిరియాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'శ్రీరక్ష'లో రిహాబిలిటేషన్, వెల్నెస్ సెంటర్ ప్రారంభం

- డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లుకు మంత్రి తుమ్మల అభినందనలు

నవతెలంగాణ-ఖమ్మం



ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే మొట్టమొదటి సారిగా అతిపెద్ద రిహాబిలిటేషన్, వెల్నెస్ సెంటర్(రెహాబ్ బుద్ధ)ను శ్రీరక్ష ఆస్పత్రిలో వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ తుమ్మల నాగేశ్వరరావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హైదరాబాదులో మాత్రమే లభ్యం అయ్యే ఇటువంటి అరుదైన వైద్య సేవలను జిల్లా ప్రజలకు అందిస్తున్న ప్రముఖ వైద్యులు డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లుకి శుభాకాంక్షలు తెలిపారు. ఖమ్మం జిల్లా పరిసర ప్రాంతాల్లో ఈ రకమైన వైద్య సేవలు కావలసిన వాళ్లు చాలామంది ఉన్నారని, అలాంటివారు ఇప్పుడు సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా మన ఖమ్మంలోనే ఆహ్లాదకరమైన ఇంటి వాతావరణం లోనే అరుదైన వైద్య సేవలు పొందవచ్చు అని తెలిపారు. ప్రముఖ వైద్యులు గోంగూర వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ (రిహాబ్ బుద్ధ)లో ఫిజియోథెరపీ, హాస్పిస్, పెయిన్ మేనేజ్మెంట్, న్యూట్రిషన్, వెల్నెస్, శ్వాసకోశ, లివర్, కిడ్నీ, గుండె, క్యాన్సర్ తదితర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నటువంటి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించబడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మెన్ లింగాల కమల్ రాజు, కాంగ్రెస్ జిల్లా నాయకులు కమర్తపు మురళి, ఐఎంఏ ప్రెసిడెంట్ కంభంపాటి నారాయణరావు, బొల్లికొండ శ్రీనివాసరావు, ప్రముఖ న్యాయవాది బిచ్చల తిరుమల్‌రావు, మోత్కూరి నారాయణరావు, వైద్యులు వై.రవీంద్రనాథ్, బోడేపుడి అజయ్, కిషోర్ బాబు, కూరపాటి ప్రదీప్, పెద్దిరెడ్డి సుధీంద్రరెడ్డి, శ్రీ రక్షా హాస్పిటల్ వైద్యులు సతీష్ నారాయణ చౌదరి, షేక్ ఏడుకొండలు, మానస, గార్లపాటి వెంకటేష్, బీ.తేజ్ కుమార్, విమల అంబటి, కాశీ విశ్వనాథ్, సత్యజిత్ తదితరులు పాల్గొన్నారు.



'ఏ పార్టీలో ఉన్నా అభివృద్ధి కోసం పాటుపడే వ్యక్తి తుమ్మల'

నవతెలంగాణ-వేంసూరు

ఏ పార్టీలో ఉన్న అభివృద్ధి కోసం పాటుపడే మంత్రి తుమ్మల నాగేశ్వరరావును విమర్శించే స్థాయి మాజీ మంత్రి హరీష్‌రావు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్యకు లేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కాసర చంద్రశేఖర్‌రెడ్డి, నియోజకవర్గ నాయకులు జగన్‌మోహన్‌రావు అన్నారు. బుధవారం మర్లపాడు పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 2017లో ప్రారంభించిన సీతారామ ప్రాజెక్టు ఆరు సంవత్సరాల్లో చిత్తశుద్ధి ఉంటే ఎందుకు పూర్తి చేయలేదో జిల్లా ప్రజలకు సమాధానం చెప్పాలని, కాంగ్రెస్ పార్టీలో జాయిన్ అయ్యే సమయంలో సీతారామ ప్రాజెక్టు పూర్తికి సహకరిస్తే పార్టీలోకి వస్తానని అధిష్టానంతో హామీ తీసుకున్న వ్యక్తి తుమ్మల. తన చిరకాల స్వప్నం గోదావరి జలాలను ఖమ్మం జిల్లాకు తీసుకురావటమే తన ఏకైక లక్ష్యమని ప్రకటించి యుద్ధ ప్రాతికిపోయిన మూడు పంప్ హౌస్‌లు పూర్తి చేసి లంక సాగర్ ప్రాజెక్టుద్వారా వేంసూరు, పెనుబల్లి మండలాలకు నీటిని అందించనున్నారన్నారు. జిల్లా ఉపాధ్యక్షులు పుచ్చకాయల సోమిరెడ్డి మాట్లాడుతూ పార్టీలకతీతంగా ప్రజా సేవకే అంకితమైన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విమర్శించే హక్కు బీఆర్ఎస్ నాయకులకు లేదన్నారు. ఈ విలేకరుల సమావేశంలో సొసైటీ అధ్యక్షుడు తక్కెళ్ళపాటి గోపాలకృష్ణ, ఎండీ.ఫైజుద్దీన్, జగన్మోహన్‌రెడ్డి, మామిళ్ళపల్లి వెంకటేశ్వరరావు, భీమిరెడ్డి రంగారెడ్డి, మేడ వెంకటేశ్వరరావు, చంటి తదితరులు పాల్గొన్నారు.

జ్వర పీడితుల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి

- డీఎంహెచ్ఓ డాక్టర్ మాలతి

నవతెలంగాణ-నేలకొండపల్లి



వైరల్ జ్వరాలపట్ల డాక్టర్లు, సిబ్బంది ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ మాలతి ఆదేశించారు. బుధవారం మండలంలోని వివిధ గ్రామాలలో ఆమె డీఎల్పీఓ టీ.రాంబాబుతో కలిసి ఆకస్మికంగా పర్యటించారు. ఆయా గ్రామాలలో వైద్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హెల్త్ క్యాంపులను తనిఖీ చేశారు. గ్రామాలలో జ్వరాలు ఉధృతిని, రోగుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. నేలకొండపల్లి, కొత్తకొత్తూరు గ్రామములో నిర్వహిస్తున్న ఆరోగ్య శిబిరంలో ఆమె మాట్లాడుతూ జ్వరాలతో బాధపడుతున్న రోగులకు వైద్య సిబ్బంది అన్ని రకాల రక్త పరీక్షలు చేసి అవసరమైన మందులు పంపిణీ చేయాలన్నారు. డెంగు లక్షణాలు ఉన్నట్లయితే వెంటనే సామాజిక ఆరోగ్య కేంద్రం నేలకొండపల్లికి పంపించాలని సూచించారు. ప్రస్తుతం సీజనల్‌గా ఎక్కువగా వైరల్ జ్వరాలు వస్తున్నాయని, అటువంటి వారిని వెంటనే గుర్తించి అవసరమైన మందులు పంపిణీ చేయాలని ఆదేశించారు. గ్రామపంచాయతీ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ గ్రామంలో పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుతూ చెత్తాచెదారం లేకుండా చూడాలన్నారు. అనంతరం స్థానిక ఎంపీడీవో కార్యక్రమం నందు ఎంపీడీవో ఎం ఎర్రయ్య అధ్యక్షతన గ్రామపంచాయతీ సెక్రటరీలకు, గ్రామ దీపికలకు వైద్యారోగ్య శాఖ నుండి డాక్టర్స్, సూపర్వైజర్స్‌తో సమావేశం ఏర్పాటు చేసి డిఎల్పిఓ టి. రాంబాబు తగు సూచనలు చేశారు. ప్రతి ఇంటిని సందర్శించి డ్రైడే కార్యక్రమాలు నిర్వహిస్తూ జ్వరం ఉన్న వారిని గుర్తించి సామాజిక ఆరోగ్య కేంద్రం నేలకొండపల్లికి పంపించాలని ఆదేశించారు. ఈ మూడు రోజులు సమయపాలన పాటిస్తూ అన్ని గ్రామంలో హెల్త్ క్యాంపు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీడీవో ఎర్రయ్య, ఎంపీఈఓ శివ వైద్యాధికారులు డాక్టర్ ఎస్.నాగమణి, డాక్టర్ ఎండీ.సన, డాక్టర్ జీ.గీతా, వైద్య సిబ్బంది హెచ్ఈఓ వీరన్న, సూపర్వైజర్ ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

టీఎన్జీఓస్ అత్యవసర కార్యవర్గ సమావేశం

నవతెలంగాణ-ఖమ్మం



ప్రస్తుత టీఎన్జీఓస్ కార్యవర్గం పదవీ కాలం ఈ ఏడాది డిసెంబర్ 26 వరకు ఉంది. యూనియన్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు అఫ్జల్ హసన్ అధ్వర్యంలో ఇదే కార్యవర్గాన్ని పూర్తికాలం పనిచేసేలా సంఘం బైలా ప్రకారం ఎవరైతే అవుట్ గోయింగ్ బాడీ ఉందో అదే కమిటీ అధ్యక్షతన ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. ప్రస్తుత కార్యవర్గం ఆధ్వర్యంలోనే ఎన్నికలు నిర్వహించాలని, జిల్లాలోని ఎనిమిది యూనిట్ల అధ్యక్ష, కార్యదర్శులు, జిల్లా కార్యవర్గంతో పాటు అన్ని ఫోరంల అధ్యక్ష, కార్యదర్శులు ఏకగ్రీవంగా తీర్మానించారు. బుధవారం నగరంలోని టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్‌లో టీఎన్జీఓస్ అత్యవసర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై ఏకగ్రీరవంగా తీర్మానించారు. అందులో ప్రధానంగా ప్రస్తుత ఖమ్మం జిల్లా అధ్యక్షులు అఫ్జల్ హసన్‌కు పూర్తిస్థాయి మద్దతు ప్రకటించి, ఆయన ఆధ్వర్యంలోనే పనిచేయాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ సందర్భంగా టీఎన్జీఓస్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు అఫ్జల్ హసన్ మాట్లాడుతూ రెండు రోజుల కిందట టీఎన్జీఓస్ యూనియన్‌లో కనీసం ప్రాథమిక సభ్యత్వం లేని కొందరు టీఎన్జీఓస్ రాష్ట్ర నాయకులతో కలిసి దిగిన ఫోటోలు, అధికారిక ఉత్తర్వులు లేని సమాచారం సోషల్ మీడియాలో వాట్సాప్‌లో షేర్ చేస్తూ ఉద్యోగుల్లో గందరగోళానికి తెరలేపిన విషయాన్ని ఖండించారు. జిల్లాలో టీఎన్జీఓస్‌లో అడహక్ కమిటీ పేరుతో జరుగుతున్న ఎలాంటి ఆధారాల్లేని తప్పుడు ప్రచారాన్ని గురించి కేంద్ర సంఘాన్ని కలిసి వివరించాలని తీర్మానించామని తెలిపారు. ఈ నేపథ్యంలోనే ప్రస్తుత బాడీని పూర్తికాలం కొనసాగించేలా చూడాలని కేంద్ర సంఘానికి వినతి పత్రం సమర్పించాలని జిల్లా కార్యవర్గంతో పాటు అన్నియూనిట్ల అధ్యక్ష, కార్యదర్శులు, అన్ని ఫోరంల అధ్యక్ష, కార్యదర్శులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు.

అఫ్జల్ హసన్‌పై తప్పుడు ప్రచారాలు ఖండన

ప్రస్తుత టీఎన్జీఓస్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు అఫ్జల్ హసన్‌పై కుట్రపూరితంగా జరుగుతున్న ఆధారాల్లేని తప్పుడు ప్రచారాన్ని టీఎన్జీఓస్ జిల్లా కమిటీతో పాటు అన్ని యూనిట్ల అధ్యక్ష, కార్యదర్శులు తీవ్రంగా ఖండించారు. జిల్లా అధ్యక్షుడు అఫ్జల్ హసన్‌పై తప్పుడు కేసులు పెట్టి, అతనితో పాటు అతని కుటుంబ సభ్యులను మానసికంగా వేధించడాన్ని సమావేశంలో ఖండించారు. రెండు రోజులుగా హైదరాబాద్‌లో జరుగుతున్న ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంటీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సమావేశంలో కేంద్ర సంఘం తీసుకునే నిర్ణయాలకు జిల్లా తరపున సంఘీ భావం తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీఓస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అఫ్జల్ హసన్, ఆర్‌వీఎస్ సాగర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు నందగిరి శ్రీను, రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శాబాసు జ్యోతి, జిల్లా కోశాధికారి బాగం పవన్, జిల్లా ఉపాధ్యక్షులు సైదులు, జాయింట్ సెక్రెటరీ బుద్ధా రామకృష్ణ, పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా డాక్టర్ల నిరసనలు

- దోషులను కఠినంగా శిక్షించాలి : ప్రజాసంఘాల డిమాండ్
- లోయర్ ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కోల్‌కతా మహిళా వైద్యురాలిపై హత్యాచార ఘటనకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా జూనియర్, సీనియర్ డాక్టర్లు నిరసన తెలిపారు. బుధవారం ఉదయం నుంచి అత్యవసర సేవలు మినహా అన్ని రకాల సేవలను బహిష్కరించిన వైద్యులు వివిధ రూపాల్లో నిరసన ప్రదర్శనలు చేశారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా, గాంధీ ఆస్పత్రులతో పాటు వరంగల్, నల్లగొండ, నిజామాబాద్, ఖమ్మం తదితర జిల్లాల్లోని బోధనాస్పత్రుల ముందు ధర్నాలు నిర్వహించి బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు.

మెడికల్ కాలేజీ విద్యార్థినిపై లైంగిక దాడి దారుణం

కోల్‌కతాలోని ఆర్‌జీ.కేర్ మెడికల్ కాలేజీ విద్యార్థినిపై లైంగిక దాడి కేసును సమగ్రంగా విచారించాలనీ, దోషులను కఠినంగా శిక్షించాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కోల్‌కతాలో పీజీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న మహిళా డాక్టర్‌పై లైంగికదాడి చేసి హత్యచేసిన ఘటనను నిరసిస్తూ అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా), భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య(డివైఎఫ్ఐ), భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ)సంఘాల ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లోని లోయర్ ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు. ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ఆర్. అరుణజ్యోతి అధ్యక్షతన జరిగిన ఆ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి మాట్లాడుతూ..ప్రజలను కాపాడే వృత్తిలో ఉన్న విద్యార్థులకే రక్షణ లేకపోతే సాధారణ ప్రజల పరిస్థితి ఏమిటని ఆందోళన చెందారు. ఆస్పత్రిలో 30 గంటల పాటు వైద్య సేవలు అందించిన విద్యార్థిని రెస్ట్ కోసం కాన్ఫరెన్స్ హాల్లో నిద్రిస్తున్న సమయంలో లైంగికదాడి చేసి హత్యచేశారని వాపోయారు. దేశవ్యాప్తంగా మెడికల్ విద్యార్థుల రక్షణకు కనీస సౌకర్యాలు కల్పించడానికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఏ. వెంకటేష్ మాట్లాడుతూ బెంగాల్ వైద్య విద్యార్థిని హత్యకు గురైతే హత్యను ఆత్మహత్యగా చిత్రీకరిస్తూ కేసును పక్కదారి పట్టించే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి, ఆస్పత్రి అధికారులు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. తక్షణమే అధికారులపై చర్యలు తీసుకోవాలనీ, ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి అశోక్ మాట్లాడుతూ..ఈ కేసుపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించే వరకు దేశవ్యాప్తంగా పోరాటాలను ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్, ఐద్వా నాయకులు కే నాగలక్ష్మి, పి శశికళ ,ఎం లక్ష్మమ్మ ,కవిత, డీవైఎఫ్ఐ నాయకులు ఎమ్‌డీ జావేద్, హష్మీ బాబు, కే.విజయ్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎ.లెనిన్ శ్రీమన్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో డ్రగ్స్ వ్యతిరేక కళా యాత్ర

21న ప్రారంభం

- పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి జూపల్లి కృష్ణారావు

నవతెలంగాణ-కల్చరల్

ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి సెప్టెంబర్ 21 వరకు హైదరాబాద్‌లో 'డ్రగ్స్‌ను నిర్మూలిద్దాం.. సమాజాన్ని మేల్కొలుపుదాం' పేరిట కళాయాత్ర నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన గోడ పత్రికను బుధవారం హైదరాబాద్ రవీంద్ర భారతిలోని కళాభవన్‌లో పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆవిష్కరించారు. ఈ కళా యాత్రలో 20 మంది కళాకారులు.. హైస్కూల్, కళాశాలలు, బస్తీలు, కాలనీల్లో నృత్యాలు, నాటికలు ఇతర కళా రూపాలతో ప్రదర్శనలు ఇస్తారని నిర్వాహకులు తెలిపారు. గోడ పత్రిక ఆవిష్కరణలో ఆహ్వాన సంఘం సలహాదారు డిజి.నర్సింహారావు, ప్రధాన కార్యదర్శి ఎం.మారన్న, పీఎన్ఎం నాయకులు పి.మల్లేష్, జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.

అసమ్మతి, విద్వేషాన్ని పారదోలాలి

(మొదటిపేజీ తరువాయి)

పురోగతి సాధించడమంటే సామాజిక ప్రజాస్వామ్యం స్థిరీకరణ దిశగా సాధించిన పురోగతికి సాక్ష్యంగా నిలుస్తుందని అన్నారు.

మన సామాజిక జీవితంలోని ప్రతి కోణంలోనూ అందరినీ కలుపుకుని పోయే స్ఫూర్తి అంతర్లీనంగా వుందన్నారు. మనకు గల వైవిధ్యత, బహుళతలతో ఒక సమగ్ర దేశంగా కలిసికట్టుగా మనం ముందుకు సాగుతున్నామన్నారు. అందరినీ కలుపుకుని పోయే ఒక సాధనంగా దృఢమైన కార్యాచరణ వుండాలన్నారు. ఇంతటి వైవిధ్యత నెలకొన్న విస్తారమైన మన భారతదేశంలో వివిధ సామాజిక వర్గాలపై అసమ్మతి, విద్వేషాలను రెచ్చగొట్టే ధోరణులను మనం నిర్ద్వంద్వంగా తిరస్కరించాలని పిలుపిచ్చారు.

సమాజంలో వెనుకబాటుకు గురైన వర్గాల అభ్యున్నతికోసం ఉద్దేశించిన పలు ప్రభుత్వ పథకాలను ఈ సందర్భంగా ముర్ము ఉదహరించారు. ప్రత్యేకంగా గిరిజన గ్రూపుల సామాజిక,ఆర్థిక పరిస్థితుల మెరుగుదలపై దృష్టి పెడుతూ తీసుకువచ్చిన ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ (పిఎం-జెఎఎన్ఎంఎఎన్) సహా పలు పథకాల గురించి పేర్కొన్నారు. పాకీ పనిని నిర్మూలించడానికి ఉద్దేశించిన నమస్తే పథకాన్ని కూడా ఆమె ప్రస్తావించారు. లింగ బేధం లేకుండా న్యాయం అందరికీ అందాలని, జరగాలని ఆమె ఆకాంక్షించారు. భారతీయ సమాజంలో మహిళలు సమానంగా చూడబడుతున్నా సాంప్రదాయ పక్షపాతాలు ఇంకా కొనసాగుతున్నాయని అన్నారు. ప్రభుత్వ కృషి వల్ల గత దశాబ్ద కాలంలో మహిళల సంక్షేమం కోసం బడ్జెట్ కేటాయింపులు మూడు రెట్లు పెరిగాయన్నారు. మహిళా కార్మికుల ప్రాతినిధ్యంపెరిగిందని, ఆడపిల్లల జననాల సంఖ్యకూడా మెరుగైందన్నారు. మహిళల సాధికారత దిశగా గణనీయమైన చర్యగా నారీ శక్తి వందన అభియాన్ (మహిళా రిజర్వేషన్ యాక్ట్)ను ఆమె పేర్కొన్నారు. ప్రధాన మంత్రి ఇంటర్న్‌షిప్ పథకాన్ని కూడా ప్రశంసించారు. దేశవ్యాప్తంగా కోటి మందికిక పైగా యువతకు నైపుణ్యాల అభివృద్ధికి, పని నేర్చుకోవడానికి ఈ పథకం ఉద్దేశించబడిందని చెప్పారు.

ఈ ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికలను ప్రస్తావిస్తూ, ఇంత పెద్ద స్థాయిలో దాదాపు 97కోట్ల మంది ప్రజలు నిర్భయంగా స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకోవడమంటే సుస్థిరమైన, ఆదర్శప్రాయమైన ప్రజాస్వామ్యానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. రైతులను అన్నదాతలుగా కీర్తిస్తూ, భారతదేశ వ్యవసాయ రంగం స్వావలంబనలో వారి పాత్ర ఎనలేనిదని కొనియాడారు. రోడ్లు, రైల్వేలు, ఓడరేవులతో సహా మౌలిక సౌకర్యాలన్నీ గణనీయంగా మెరుగుపడ్డాయని, మౌలిక సదుపాయాల రంగంలో పురోగతి సాధించామని చెప్పారు. వ్యూహాత్మకమైన ప్రణాళికలు, సమర్థవంతమైన పనితీరు వల్లనే సాధ్యమైందన్నారు. ప్రపంచంలోనే ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిచామన్నారు.

అప్పులు సరే.. తిరిగి ఎలా తీరుస్తారు ?

ఆర్డీసీకి బ్యాంకర్ల సూటి ప్రశ్న

- సొంత ఆదాయ మార్గాలు అన్వేషించాలంటూ ఆర్‌బీఐ మెలిక
- అధికారుల కసరత్తు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్





దేశంగానీ, రాష్ట్రం గానీ అభివృద్ధి చెందాలంటే మౌలిక సదుపాయాలు కీలకం. ప్రధానంగా రోడ్లు అత్యంత ప్రధానం. రోడ్లను బాగు చేయాలంటే నిధులు కావాలి. అరకొర పనులు జరుగుతున్నా అవి సరిపోవు. భారీఎత్తున పాత రోడ్లకు మరమ్మతులు చేయడం, కొత్త వాటిని నిర్మించడం చేయాల్సిందే. గ్రామాల నుంచి మండల కేంద్రాలకు, మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాలకు, జిల్లా కేంద్రాల నుంచి రాష్ట్ర రాజధానికి నాణ్యమైన రోడ్లను వేయడం ద్వారా అత్యుత్తమ రవాణా సదుపాయాలు కల్పించాలంటే భారీ పెట్టుబడులు అవసరం. ఈ నేపథ్యంలో రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఆర్డీసీ) చురుగ్గా అడుగులు వేసేందుకు ప్రయత్నిస్తున్నది. అయితే ఇందుకు నిధులు ప్రధాన అడ్డంకిగా మారాయి. బ్యాంకుల నుంచి అప్పులు చేసైనా సరే రోడ్లను అభివృద్ధి చేయాలని ఆర్డీసీ పాలకవర్గం భావిస్తున్నది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేకంగా నివేదిక పంపినట్టు తెలిసింది. వాణిజ్య బ్యాంకుల నుంచి అప్పులు తీసుకుని రోడ్ల అభివృద్ధికి అనుమతించడంతోపాటు కౌంటర్ గ్యారంటీ ఇవ్వాలని కోరినట్టు సమాచారం. ఇప్పటికే పాలకవర్గం, అధికారులు బ్యాంకర్లను సంప్రదించారు. ఆర్డీసీ సంస్థకు అప్పులు ఇవ్వడానికి బ్యాంకర్లు సంసిద్ధత వ్యక్తం చేసినా తిరిగి ఎలా చెల్లిస్తారని ప్రశ్నిస్తున్నారు. వీటికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడంతో ముందడుగు పడటంలేదు. దీంతో అప్పులు ఇచ్చే విషయంలో బ్యాంకర్ల సందేహాలు, ప్రశ్నలకు ఏం సమాధానం చెప్పాలో ఆర్డీసీకి పాలుపోవడం లేదు.

కేంద్రం సహాయ నిరాకరణ

రాష్ట్రాల అధికారాలు, నిధుల విషయంలో కేంద్రం అనుసరిస్తున్న వైఖరితో కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అప్పులు తీసుకునే అంశంలో ఆర్థిక ఆంక్షలు పెట్టడం ఒకటైతే, జీఎస్టీ పన్ను నిధులు వెనక్కి పంపడంలో తీవ్ర జాప్యం మూలంగా రాష్ట్రాలకు తీవ్రంగా నష్టం జరుగుతున్నది.

ఆర్‌బీఐ అనుమతి

రాష్ట్రంలోని రోడ్ల అభివృద్ధితోపాటు నిర్మాణాల కోసం అప్పులు తీసుకోవడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) అనుమతి ఇచ్చిందని ఆర్డీసీ ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఆర్డీసీ ఇదివరకు తీసుకున్న రుణంతో రాష్ట్రంలోని పలు రోడ్లను అభివృద్ధి చేయడం, రుణం, దాని వడ్డీ చెల్లింపులు కూడా సక్రమంగా చెల్లించిన చరిత్ర ఉండటంతోనే ఆర్‌బీఐ అనుమతి లభించినట్టు ఆర్డీసీ అధికారులు అంటున్నారు. అయితే, గతంలో ఆర్డీసీ రుణాలను ప్రభుత్వమే చెల్లించగా, ప్రస్తుతం ఆ విధానంపై రిజర్వు బ్యాంకు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్టు సమాచారం. ప్రభుత్వం చెల్లించకుండా కార్పొరేషనే నేరుగా ఆదాయ వనరులను సమకూర్చు కోవడం ద్వారానే అప్పులు తీర్చాలనే మెలిక పెట్టినట్టు తెలిసింది. అప్పు ఇచ్చేందుకు ప్రభుత్వ గ్యారంటీ ఒక్కటే సరిపోదని, కార్పొరేషన్ నుంచి సొంత ఆదాయం ఏంటో చూపించాలని ప్రపంచ బ్యాంకు తరహా నిబంధనలను పెట్టినట్టు తెలుస్తోంది. దీంతో ఆర్డీసీకి సొంత ఆదాయ మార్గాలను అన్వేషించేందుకు అధికారులు సమాలోచనలు చేస్తున్నారు. గత ఆర్డీసీ బోర్డు సమావేశంలో కూడా ఇదే విషయంలో చర్చ జరిగినట్టు తెలిసింది. అయితే, ఆదాయ మార్గాలను అన్వేషించడం, ఆ మేరకు ప్రభుత్వ అనుమతి తీసుకోవడం చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయించిన నిధులతో కాకుండా సొంత నిధులతో చెల్లింపులు చేసేలా కొత్త ఆదాయ మార్గాలను అన్వేషించాలని అధికారులు భావిస్తున్నారు. ఈ మేరకు బ్యాంకుల ప్రతిపాదనలు, అభ్యంతరాలను మరోసారి ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవాలని అధికారులు శాఖాపరమైన చర్యలు తీసుకుంటున్నారు.

ఆర్డీసీ తీసుకున్న లోన్ ఎంత?

ఆర్డీసీ ఇంతకుముందు రోడ్ల అభివృద్ధికి రెండు విడతలుగా రూ.2600 కోట్ల రుణం తీసుకుంది. వీటికి సంబంధించిన అసలు, వడ్డీ క్రమంగా చెల్లిస్తూ వస్తున్నది. అప్పు తీర్చడంలో ఆర్డీసీ ట్రాక్ రికార్డు బాగుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఆర్బీఐ నుంచి అనుమతి వచ్చిన నేపథ్యంలో ఆయా ప్రభుత్వ బ్యాంకుల నుంచి మరో రూ.800 కోట్లు రుణం తీసుకోవాలని ఆర్డీసీ గతంలో జరిగిన బోర్డు సమావేశంలో నిర్ణయించింది. బ్యాంకుల నుంచి రుణం ఇస్తే, గ్రామీణ రోడ్లు, రాష్ట్ర రహదారులు ఎన్ని నిర్మించాలన్న అంశాలపై అధికారులు ప్రతిపాదనలతో డీపీఆర్ సిద్ధం చేసుకున్నారని సమాచారం.

ఆదాయ మార్గాలివే ?

ఆర్డీసీ సొంతంగా ఆదాయ మార్గాలు సృష్టించుకోవాలనీ, అందుకు కొన్ని విధానాలు మార్చుకోవాల్సి ఉంటుందని ఆ శాఖ ఉన్నతాధికారుల మధ్య చర్చోపచర్చలు జరుగుతున్నాయి. ఉదాహరణకు కర్నాటక, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో ఆర్డీసీ సంస్థ పెట్రోల్, డీజిల్‌పై వేసే సెస్ నుంచి ప్రతి లీటర్‌కు ఒక రూపాయిని ఆర్డీసీ ఖాతాలో జమ చేస్తున్నాయి. దీంతో ఆయా రాష్ట్రాల ఆర్డీసీలు ఆర్థికంగా బలోపేతం అవుతున్నాయనేది అధికారుల భావన. దీంతో రహదారుల నిర్మాణం, నిర్వహణ వాటికి మరింత సులభమవుతుందని మన రాష్ట్ర శాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు. మన రాష్ట్రంలో అలా చేయాలంటే అందుకు రాష్ట్ర ప్రభుత్వం విధానపరంగా నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. రుణాలు రావాలన్నా, ఆర్డీసీ ఆర్థికంగా పరిపుష్టిని సాధించాలన్న ఇదే కీలకమైన మార్గమని అభిప్రాయ పడుతున్నారు. అప్పులు తీసుకునే విషయమై త్వరలో సర్కారు నుంచి స్పందన వస్తుందనే ఆశాభావంతో ఆర్డీసీ అధికారులు ఉన్నారు.

మంజీరా అభయారణ్యానికి

'రాంసర్'గుర్తింపు కోసం ప్రతిపాదనలు





దీవుల్లో ఎన్నో రకాల జీవ వైరుధ్యాల జీవులు

అభయారణ్యాన్ని సందర్శించిన కేంద్ర బృందం

నవతెలంగాణ - మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

సంగారెడ్డి జిల్లా మంజీరా బ్యారేజీ సమీపంలో ఉన్న మంజీరా అభయారణ్యానికి 'రాంసర్' గుర్తింపు కోసం ప్రతిపాదనలు పంపినట్టు స్టేట్ వెట్లాండ్ అథారిటీ సెక్రటరీ, సీనియర్ ఐఏఎస్ అధికారి ప్రశాంతి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'సౌభాగ్యత మిషన్' కార్యక్రమంలో భాగంగా మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ ఫారెస్ట్ అండ్ క్లైమేట్ చేంజ్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన రెండు రోజుల వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొన్నారు. అందులో భాగంగా ఐఏఎస్ అధికారుల కేంద్ర బృందం సీనియర్ ఐఏఎస్ అధికారి ప్రశాంతి ఆధ్వర్యంలో బుధవారం మంజీరా అభయారణ్యాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ప్రశాంతి మాట్లాడుతూ.. బయోడైవర్సిటీ కార్యక్రమాల్లో భాగంగా మంజీరా అభయారణ్యాన్ని రాంసర్ గుర్తింపు కోసం ప్రతిపాదనలు పంపామని తెలిపారు. మంజీరా నుంచి సింగూరు బ్యారేజీ వరకు మంజీరా నదిలో 20 చదరపు కిలో మీటర్ల విస్తీరణముందన్నారు. మంజీరా నదిలో తొమ్మిది దీవులున్నాయని, వీటిల్లో ఎన్నో రకాల జీవ వైరుద్యాల జీవులు నివశిస్తున్నాయని తెలిపారు. 300 రకాల పక్షులు, 160 రకాల ఇతర జీవులు ఈ దీవుల్లో ఉన్నాయని అధికారులు గుర్తించినట్టు చెప్పారు. ఎన్నో అరుదైన జాతుల పక్షులు సైతం మంజీరా అభయారణ్యం వైల్డ్ లైఫ్ శాంక్చురిలో ఉన్నట్టు తెలిపారు. సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ.. ప్రతేడాది వర్షాకాలం, శీతాకాలం, వేసవికాలంలో ఆయా సీజన్లకు అనుగుణంగా వివిధ రకాల వలస పక్షులు మంజీరా నది మధ్యలో ఉన్న ఈ తొమ్మిది దీవులకు వలస వస్తున్నట్టు తెలిపారు. రాంసర్ గుర్తింపు వల్ల మంజీరా అభయారణ్యానికి ప్రపంచ స్థాయి గుర్తింపు లభిస్తుందన్నారు. ఇందుకోసం అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా బోటుపై ఐఏఎస్ అధికారుల బృందం మంజీరా అభయారణ్యంలోని తొమ్మిది దీవుల సముదాయంలో విస్తరించి ఉన్న వైల్డ్ లైఫ్ శాంక్చురిని సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శనను సభ్యులు తిలకించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బృంద సభ్యులు కీర్తి మాన వస్తీ, కల్వేరసన్, డాక్టర్ జాన్సె మాత్యు, వికాస్ చంద్రగుప్త, శ్రీకాంత్, డాక్టర్ మనోజ్, చంద్రం సింగ్, రాంబాబు, సంబంధిత బృంద సభ్యులు, సంగారెడ్డి జిల్లా ఫారెస్ట్ అధికారి శ్రీధర్ పాల్గొన్నారు.

విద్యార్థినుల పట్ల

బస్ కండక్టర్ అసభ్య పదజాలం

- షాద్‌నగర్ బస్ డిపో ఎదుట తల్లిదండ్రులతో కలిసి నిరసన
- చర్యలు తీసుకోవాలంటూ డిపో మేనేజర్‌కు ఫిర్యాదు



నవతెలంగాణ-షాద్‌నగర్

చదువుల కోసం ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్న విద్యార్థినుల పట్ల కండక్టర్ పరుషంగా ప్రవర్తిస్తున్న తీరును నిరసిస్తూ రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ బస్ డిపో ఎదుట విద్యార్థినులు వారి తల్లిదండ్రులతో కలిసి ధర్నా చేపట్టారు. షాద్‌నగర్ నుంచి కేశంపేట మండలంలోని సంగెం గ్రామానికి ప్రతిరోజూ ఉదయం సాయంత్రం వేళల్లో ఆర్టీసీ బస్సు నడుస్తుంది. ఇదే బస్సులో ఆయా గ్రామాల నుంచి విద్యార్థినీ విద్యార్థులు చదువుల కోసం షాద్‌నగర్‌కు వస్తుంటారు. ఈ బస్‌కండక్టర్ రాములు తమ పట్ల పరుషంగా మాట్లాడుతూ బూతులు తిడుతున్నాడని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆధార్ అప్ డేట్ లేకపోయినా, బ్యాగ్‌లో నుంచి ఆధార్ బయటకు తీయడంలో ఆలస్యమైనా బండబూతులు తిట్టి మధ్యలోనే బస్ ఆపి దింపేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఆగ్రహించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు బుధవారం సంగెం గ్రామానికి వచ్చిన బస్‌లోనే షాద్‌నగర్ బస్ డిపో వద్దకు చేరుకుని ధర్నా నిర్వహించారు. విద్యార్థినుల పట్ల అసభ్య పదజాలాన్ని ఉపయోగించి ఇబ్బందులకు గురిచేసిన బస్ కండక్టర్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని డిపో మేనేజర్‌కు ఫిర్యాదు చేశారు.

తెలంగాణకు 29, ఏపీకి 26 మెడల్స్

- దేశవ్యాప్తంగా 1,037 పతకాలు
- తెలంగాణకు చెందిన చదువు యాదయ్యకు రాష్ట్రపతి శౌర్య పతకం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని పోలీసు, ఫైర్ సర్వీస్, హోంగార్డ్, సివిల్ డిఫెన్స్ అధికారులకు వివిధ పోలీసు పతకాలను కేంద్ర హోం మంత్రిత్వ శాఖ బుధవారం ప్రకటించింది. దేశవ్యాప్తంగా 1,037 మందికి గ్యాలంట్రీ/సర్వీసు పతకాలను అందజేయనుంది. ఈ మేరకు అవార్డుల జాబితాను విడుదల చేసింది. 213 మందికి గ్యాలంట్రీ (శౌర్య) మెడల్స్ (జిఎం), ఒకరికి రాష్ట్రపతి శౌర్య పతకం (పిఎంజి), 94 మందికి విశిష్ట సేవ రాష్ట్రపతి మెడల్ (పిఎస్ఎం) మెడల్స్, 729 మందికి మెరిటోరియస్ సర్వీస్ మెడల్ (ఎంఎస్ఎం) ప్రకటించింది.

దేశవ్యాప్తంగా ఒకే రాష్ట్రపతి శౌర్య పతకం (పిఎంజి) ప్రకటించగా అది, తెలంగాణకు చెందిన చదువు యాదయ్యకు దక్కింది. ఇక గ్యాలంట్రీ (శౌర్య) మెడల్స్ (జిఎం)లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి నాలుగు మెడల్స్, తెలంగాణకు ఏడు మెడల్స్ దక్కాయి. పిఎంఎస్‌ఎంలో ఏపికి రెండు, తెలంగాణకు మూడు మెడల్స్ దక్కాయి. ఎంఎస్ఎంలో ఏపికి 20, తెలంగాణకు 18 మెడల్స్ వచ్చాయి. స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాలను పురస్కరించుకొని కేంద్ర హోం శాఖ ఏటా రెండు సార్లు ఈ పోలీసు పతకాలను ప్రకటిస్తోంది.

తెలంగాణకు 29 మెడల్స్

రాష్ట్రపతి శౌర్య పతకం(పిఎంజి) తెలంగాణ పోలీసు శాఖకు చెందిన హెడ్ కానిస్టేబుల్ చదువు యాదయ్యకు లభించింది.

గ్యాలంట్రీ (శౌర్య) మెడల్స్ (జిఎం) సునీల్ దత్ (ఎస్‌పి), మోరా కుమార్ (డిప్యూటీ అసాల్ట్ కమాండర్ / రిజర్వ్ ఇన్స్పెక్టర్), శనిగరపు సంతోష్ (అసిస్టెంట్ అసాల్ట్ కమాండర్ / రిజర్వ్ సబ్-ఇన్‌స్పెక్టర్), అమిలి సురేష్ (జూనియర్ కమాండో / పోలీస్ కానిస్టేబుల్), వెల్మ వంశీ (జూనియర్ కమాండో /పోలీస్ కానిస్టేబుల్), కంపాటి ఉపేందర్ (జూనియర్ కమాండో / పోలీస్ కానిస్టేబుల్), పాయం రమేష్ (జూనియర్ కమాండో / పోలీస్ కానిస్టేబుల్)కు దక్కాయి.

విశిష్ట సేవ కోసం రాష్ట్రపతి మెడల్స్ (పిఎస్ఎం) సంజయ్ కుమార్ జైన్ (ఎడిజి), కటకం మురళీధర్ (డిసిపి), ఫైర్ సర్వీస్ విభాగంలో వెంకటేశ్వర్లు కందిమల్ల (డ్రైవర్ ఆపరేటర్)కు దక్కాయి.

మెరిటోరియస్ సర్వీస్ మెడల్ (ఎంఎస్ఎం) అవినాష్ మొహంతి (పోలీస్ కమీషనర్), సయ్యద్ జమీల్ బాషా (కమాండెంట్), పి. కృష్ణమూర్తి (ఎఎస్‌పి), కొమరబత్తిని రాము (ఎస్ఐ), అబ్దుల్ రఫీక్ (ఎస్ఐ), ఇక్రమ్ అబ్ ఖాన్ (ఎస్ఐ), శ్రీనివాస మిశ్రా (ఎస్ఐ), కుంచాల బాలకాశయ్య (ఎస్ఐ), లక్ష్మయ్య (ఎఎస్ఐ), గుంటి వెంకటేశ్వర్లు (ఎఎస్ఐ), నూతలపాటి జ్ఞాన సుందరి (ఇన్‌స్పెక్టర్), ఫైర్ సర్వీస్ విభాగంలో మాధవరావు తెలుగు (లీడింగ్ ఫైర్‌మెన్), వాహెదుద్దీన్ మహ్మద్ (లీడింగ్ ఫైర్‌మెన్), హోంగార్డ్ విభాగంలో లక్ష్మి బందోళ్ల (ఉమెన్ హోం గార్డ్), మల్లేష్ మేడిపల్లి (హోం గార్డ్), కవిత ఇంటూరి (ఉమెన్ హోం గార్డ్), గాలయ్యా నమల (హోం గార్డ్), సుమలత ఎనుముల (ఉమెన్ హోం గార్డ్) దక్కాయి.

ముస్తాబైన ఎర్రకోట

(మొదటిపేజీ తరువాయి)

ప్రత్యేక అతిథులుగా ఆహ్వానించినట్లు సంబంధిత మంత్రిత్వ శాఖ తెలిపింది. సుమారు 45 మంది లఖ్‌పతీ దీదీలు, 30 మంది డ్రోన్ దీదీలను కూడా ఆహ్వానించినట్టు గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ అధికారులు వెల్లడించారు.

ఈ ఘనమైన వేడుకను చూడటానికి వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన దాదాపు 2,000 మంది సంప్రదాయ వేషధారణలో హాజరయ్యేందుకు ఆహ్వానించారు. మైగవ్, ఆకాశవాణి భాగస్వామ్యంతో రక్షణ మంత్రిత్వ శాఖ నిర్వహించిన వివిధ ఆన్‌లైన్ పోటీల్లో విజేతలుగా నిలిచిన 3,000 మంది కూడా వేడుకల్లో భాగమవుతారు. యువత, ఆదివాసీ సమాజం, రైతులు, మహిళలు, ఇలా రకరకాల జీవన విధానాలకు చెందిన వారు ప్రత్యేక అతిథులుగా రానున్నారు. వివిధ ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల సహకారంతో వేర్వేరు రంగాల్లో ఘనత సాధించిన వారు కూడా ప్రత్యేక అతిథులుగా వేడుకలకు హాజరవుతారు.

ఎర్రకోటకు రాగానే ప్రధాన మంత్రి నరేంద్రమోడీకి రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్, రక్షణ శాఖ కార్యదర్శి గిరిధర్ అరమానే స్వాగతం పలుకుతారు. ఢిల్లీ ప్రాంత జనరల్ ఆఫీసర్ కమాండింగ్(జీఓసీ)లెఫ్టినెంట్ జనరల్ భవనీశ్ కుమార్‌ను ప్రధానమంత్రికి రక్షణ శాఖ కార్యదర్శి పరిచయం చేస్తారు. ఢిల్లీ ప్రాంత జీవోసీ నరేంద్ర మోడీని సెల్యూటింగ్ బేస్‌కు తీసుకువెళ్తారు. అక్కడ సంయుక్త అంతర్‌సేవలు, ఢిల్లీ పోలీసు సిబ్బంది ప్రధానమంత్రికి జనరల్ సెల్యూట్ చేస్తారు. తరువాత ప్రధాన మంత్రి గౌరవ వందనాన్ని స్వీకరిస్తారు.



ప్రధానమంత్రికి గౌరవ వందనాన్ని సమర్పించే బృందంలో సైనిక, నౌకాదళ, వాయుసేన, ఢిల్లీ పోలీసు నుంచి ఒక్కో అధికారి, 24 మంది సిబ్బంది చొప్పున ఉంటారు. గౌరవ వందనానికి కమాండర్ అరుణ్ కుమార్ మెహతా నేతృత్వం వహిస్తారు. ఆర్మీ బృందానికి మేజర్ అరుణ్ సింగ్, నౌకాదళ బృందానికి లెఫ్టినెంట్ కమాండర్ గులియా భావేశ్ ఎన్‌కె, వాయుసేన బృందానికి స్క్వాడ్రన్ లీడర్ అక్షర ఉనియల్ నేతృత్వం వహిస్తారు. ఢిల్లీ పోలీసు బృందానికి అదనపు డీసీపీ అనురాగ్ ద్వివేది నేతృత్వం వహించనున్నారు.

గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ప్రధాన మంత్రి ఎర్రకోట ప్రాంగణంలోకి వెళ్తారు. అక్కడ రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనీల్ చౌహాన్, చీఫ్ ఆఫ్ ది ఆర్మీ స్టాఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, చీఫ్ ఆఫ్ ది నేవల్ స్టాఫ్ అడ్మిరల్ దినేశ్ కే త్రిపాఠి, చీఫ్ ఆఫ్ ది ఎయిర్ స్టాఫ్ ఎయిర్ చీఫ్ మార్షల్ వికె చౌదరి అభినందనలు తెలుపుతారు. జాతీయ జెండాను ఎగురవేయడానికి ఢిల్లీ ప్రాంత జీఓసీ ప్రధానమంత్రిని వేదిక వద్దకు తీసుకువెళ్తుంది.


జాతీయ జెండా ఎగురవేయడానికి ప్రధానమంత్రికి లెఫ్టినెంట్ సంజీత్ సింగ్ సహాయకులుగా ఉంటారు. 1,721 ఫీల్డ్ బ్యాటరీ(సెరిమోనియల్)కు చెందిన శౌర్యవంతులైన సైనికులు ఒకేసారి 21 గన్ సెల్యూట్ చేస్తారు. ఇందుకు దేశీ 105 ఎంఎం లైట్ ఫీల్డ్ తుపాకులను ఉపయోగిస్తారు. ఎగురవేసిన తరువాత మువ్వన్నెల జెండా 'రాష్ట్రీయ వందనం' అందుకుంటుంది. ప్రధానమంత్రి జాతీయ జెండాను ఎగురవేయగానే భారత వాయు సేనకు చెందిన రెండు ధ్రువ్ అధునాతన తేలికపాటి హెలికాప్టర్లు లైన్ ఆస్టన్ పద్ధతిలో వేదికపై పూలరేకులను చల్లుతాయి.

అనంతరం ప్రధానమంత్రి జాతినుద్దేశించి ప్రసంగిస్తారు. ఆయన ప్రసంగం ముగిసిన తర్వాత నేషనల్ కాడెట్ కోర్స్ (ఎన్‌సిసి)కి చెందిన కాడెట్లు జాతీయ గీతాన్ని ఆలపిస్తారు. దేశవ్యాప్తంగా వివిధ పాఠశాలలకు చెందిన మొత్తం 2,000 మంది బాల, బాలిక క్యాడెట్లు(ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్) ఈ వేడుకల్లో పాల్గొంటారు. వీరు ప్రాకారానికి ఎదురుగా ఉన్న జ్ఞాన్‌పథ్‌లో కూర్చుంటారు. వీరు మువ్వన్నెల రంగుల్లో ఏర్పడతారు. నేషనల్ సర్వీస్ స్కీమ్(ఎన్ఎస్ఎస్)కు చెందిన 500 మంది వాలంటీర్లు కూడా కార్యక్రమంలో భాగమవుతారు.

11
నవతెలంగాణ మానవి
గురువారం 15 ఆగస్టు 2024
ఖమ్మం
www.navatelangana.com

స్వరాజ్యం కోసం సాగిన సుదీర్ఘపోరాటంలో పరోక్షంగా, ప్రత్యక్షంగా పాల్గొన్న మహిళలెందరో. పాలక పక్షాలకు వ్యతిరేకంగా ప్రత్యక్ష కార్యాచరణకు దిగిన వారికి ప్రతిఫలంగా పలురకాల శిక్షలు లభించాయి. భారత జాతీయోద్యమానికి సహాయ, సహకారాలు అందించి ప్రపంచానికి తెలియకుండా ఉండిపోయిన ఆడపడుచులు ఎందరో. ఆ తల్లుల త్యాగాలు ఎంత శ్లాఘనీయమైనవైనా అధికారిక చిట్టాలకెక్కి అక్షరరూపం ధరించక పోవడంతో వారి వివరాలు తర్వాతి తరానికి అందుబాటులో లేకుండా పోయాయి. ప్రత్యక్ష పోరులో శిక్షలకు గురైన వారి వివరాలు మాత్రం ఆనాటి ప్రభుత్వ, పోలీసుల రికార్డులలో నిక్షిప్తమై ఉన్నందున కొంతలో కొంత ఆ యోధురాండ్ర సమాచారం లభ్యం అవుతుంది. ఈ విధంగా ప్రభుత్వ, పోలీసు రికార్డుల ఆధారంగా తయారైన గ్రంథాలలో స్థానం పొందిన తెంగాణ రాష్ట్రానికి చెందిన ముస్లిం మహిళా యోధులు కొందరు. ఈ రోజు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వారి పరిచయం క్లుప్తంగా నేటి మానవిలో...

స్వాతంత్ర్యోద్యమంలో తెలంగాణ ముస్లిం మహిళా యోధులు



సేకరణ: సయ్యద్ నశీర్ అహమ్మద్ రచించిన 'భారత స్వాతంత్ర్యోద్యమంలో తెలంగాణ ముస్లిం యోధులు' పుస్తకం నుండి

తొలి మహిళా మంత్రిగా...



మసుమా బేగం... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి మహిళా మంత్రి, తొలి ముస్లిం మంత్రి, మొత్తం భారత దేశంలోనే మంత్రి పదవిని చేపట్టిన తొలి ముస్లిం మహిళ అయిన ఈమె 1902 అక్టోబర్ 7న హైదరాబాద్‌లో జన్మించారు. తల్లి తయ్యిబా బేగం, తండ్రి ఖదీవ్ జంగ్. విద్యావంతురాలు, సంఘసేవకురాలైన తల్లి ద్వారా ఈమె ప్రభావితమయ్యారు. తయ్యిబా పత్రికల్లో వ్యాసాలు, నాలుగు నవలలు కూడా రాశారు. తండ్రి వైద్యశాఖలో ఉప డైరెక్టర్‌గా చేశారు. ఈమె కుటుంబం మొత్తం రాజకీయ నేపథ్యం కలిగిందే. మాసుమా 9 ఏండ్ల వయసులో లేడి హైదరి క్లబ్‌లో సభ్యురాలిగా చేరి సేవా కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు విద్యావ్యాప్తికి నడుం కట్టారు. 1921లో విద్యావ్యాప్తి కోసం అంజుమన్- యే- ఖవాతీన్ సంస్థకు అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టారు. 1927లో అఖిల భారత మహిళా సంస్థ హైరదాబాద్ నగర శాఖ ఏర్పాటు చేసి పలు బాధ్యతలను నిర్వహించారు. లండన్ ఉమెన్స్ కాన్ఫెరెన్స్ అహ్వానం మీద లండన్ వెళ్లారు. జాతీయోద్యమంలో భాగంగా ఉనికిలోకి వచ్చిన పలు సంఘాలలో ఆమె సభ్యురాలయ్యారు. 1952లో షాలిబండ నియోజకవర్గం నుండి పోటీ చేసి గెలిచారు. తర్వాత మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. మంచి వక్త, కార్యదక్షురాలుగా ఖ్యాతిగాంచిన మాసుమా బేగం అఖిల భారత మహిళా సంస్థ నేతగా అనేక దేశాలు కూడా పర్యటించారు.

తెలంగాణ ప్రజాపోరుకు తోడ్పడిన మోధురాలు



రజియా బేగం... 1916లో హైదరాబాద్ సంస్థానంలో జన్మించారు. ఆమె తల్లిది హైదరాబాద్ కాగా, తండ్రి ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందినవారు. నైజాం సంస్థానంలో ఈయన న్యాయాధికారి. తల్లిదండ్రులిచ్చిన స్వేచ్ఛతో రజియా తన అన్నదమ్ములతో పాటు చిన్ననాటనే స్వతంత్రభావనలు అలవర్చుకున్నారు. నిగార్ ఉర్దూ పత్రికను రహస్యంగా చదువుతూ చైతన్యం పొందారు. తమీర్ అనే గోడ పత్రికను ప్రారంభించారు. చిన్న చిన్న కథలు కూడా రాసేవారు. స్వయం కృషితో విద్యనభ్యసించిన రజియా తనకు నచ్చని ఆచారాలను తీవ్రంగా వ్యతిరేకించే వారు. బజ్మె ఏహ్ బాబ్ అనే సంస్థను స్థాపించి అనేక సామాజిక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అన్నదమ్ములతో కలిసి జాతియోధ్యమంలో భాగమయ్యారు. తర్వాత కమ్యూనిస్టు పార్టీవైపుకు మొగ్గుచూపి కార్యక్రమాల్లో పాల్గొనేవారు. నిషేధంలోనూ పార్టీకి అండగా నిలబడ్డారు. అనేక కష్టాలు అనుభవించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇండియన్ యూనియన్‌లో నైజాం సంస్థానం విలీనం కోరుతూ జరిగిన పోరాటంలో తన వంతు పాత్ర పోషించారు. పోరాటం విరమించిన తర్వాత ఉమెన్స్ కాలేజీలో లెక్చరర్‌గా చేరారు. 1966లో యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీలో చేరారు. పర్షియన్ పీహెచ్‌డీ ఇరాన్‌లో చేశారు.

విలీనోద్యమంలో జైలుకెళ్లీ...



నఫీస్ ఆయేషా బేగం.. హైదరాబాద్‌కు చెందిన స్వాతంత్ర్య సమర వీరుడు జనాబ్ హమీద్ ఆలీఖాన్ కుమార్తె. తండ్రి ప్రభావంతో ఆమె హైదరాబాద్ కేంద్రంగా సాగిన జాతీయోద్యమంలో భాగస్వాములయ్యారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించాక ఇండియన్ యూనియన్లో చేరడానికి నిరాకరించిన నైజాం సంస్థానాధీశుల పట్ల నఫీస్ నిరసన వ్యక్తంచేశారు. నైజాం సంస్థానం భారతదేశంలో విలీనం కావాలని, నైజాం నివాసులంతా భారతదేశ పౌరులుగా పరిగణించబడాలని ఆమె ఆకాంక్షించారు. దీని కోసం జరిగిన ఉద్యమంలో భాగం పంచుకున్నారు. హైదరాబాద్ కేంద్రంగా సాగిన ఆ ఉద్యమం జాతీయోద్యమ చరిత్రలో విలీనోద్యమంగా పరిగణించబడింది. ఈ ఉద్యమంలో పాల్గొన్న నఫీస్‌ను 1948, సెప్టెంబర్16న అరెస్టు చేసి హైదరాబాద్ సెంట్రల్ జైలులో నిర్బంధించాయి. చివరకు నైజాం సంస్థానం ఇండియన్ యూనియన్‌లో విలీనమైంది. ఆ స్వాతంత్ర్య సమరయోధురాలు, విలీనోద్యమకారిణి పూర్తి వివరాలు తెలియలేదు. ప్రముఖ చరిత్ర పరిశోధకురాలు డాక్టర్ సరోజిని రేగాని సంపాదకత్వంలో WHO'S WHO OF FREEDOM STRUGGLE IN ANDHRA PRADESH శీర్షికతో 1978లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రచురించిన ప్రథమ సంపుటంలో ఆమె స్థానం పొందింది. ఈ విధంగా ఆ సంపుటంలో స్థానం పొందగలిగిన ఏకైక ముస్లిం మహిళ నఫీస్ అయేషా బేగం కావడం విశేషం.

ప్రజా పోరాటాలకు బాసటగా నిలిచిన యోధురాలు



జమాలున్నీసా బాజి... ఇండియన్ యూనియన్‌లో నైజాం రాష్ట్రం విలీనం కోరుతూ సాగిన ఉద్యమంలో పాల్గొనడమే కాకుండా ఆ క్రమంలో సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో కూడా ప్రజల పక్షం వహించిన ముస్లిం మహిళా ఉద్యమకారులలో ఈమె ఒకరు. జమాలున్నీసా 1915లో హైదరాబాద్‌లో జన్మించారు. తండ్రి నైజాం సంస్థానంలో న్యాయాధికారి. కుటుంబంలోని పెద్దలు ఆచార సంప్రదాయాలు పాటించినా తల్లిదండ్రులు ఉదార స్వభావులు. తండ్రి నుంచి లభించిన స్వేచ్ఛతో భారత స్వాతంత్ర్యోద్యమంలో భాగమయ్యారు. మతపరమైన ఛాందసాలకు వ్యతిరేకంగా ఉద్యమించారు. పెండ్లి తర్వాత ఆమె కొన్ని రోజులు ఇంటికే పరిమితం కావల్సి వచ్చింది. అప్పుడు కూడా పుస్తకాలు చదివేవారు. తర్వాత తిరిగి ఉద్యమంలో పాల్గొన్నారు. సాహిత్య సమావేశాలకు కూడా హాజరయ్యేవారు. కమ్యూనిస్టు భావాలకు ఆకర్షితులయ్యారు. 1946లో కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. అన్ని రంగాల్లో సమానత్వం సమసమాజం ద్వారా మాత్రమే సాధ్యమని నమ్మిన ఆమె ఎంతో నిబద్ధతతో ముమ్ముందుకు సాగారు. నిర్బంధంలోనూ పార్టీ కోసం పని చేశారు. తెలంగాణ సాయుధ పోరాటం ముగిసిన తర్వాత మహిళా సంఘం ఏర్పాటుకు కృషి చేశారు.

నిజాం గడ్డ మీద విదేశీవస్త్రాలను తగులబెట్టిని సాహసి



ఫక్రుల్ హాజియా హసన్... భారత స్వాతంత్ర్య సంగ్రామంలో స్వయంగా పాల్గొనడమే కాకుండా తన బిడ్డలను విముక్తిపోరాటం దిశగా ముందుకు సాగడానికి ప్రేరణగా నిలచిన తల్లులు అరుదుగా కన్పిస్తారు. జాతీయోద్యమంలో స్వయంగా పాల్గొనడంతో పాటు 'హైద్రాబాద్ హసన్ సోదరులు'గా విఖ్యాతిగాంచిన ముగ్గురు కుమారులను స్వాతంత్ర్య సమరయోధులుగా తీర్చిదిద్దిన ఈ తల్లి చరితార్థులయ్యారు. ఇరాన్ నుండి ఇండియా వచ్చి స్థిరపడిన కుటుంబానికి చెందిన హాజియా 1870లో జన్మించారు. ఉత్తరప్రదేశ్ నుండి హైదరాబాద్ వచ్చిన అమీర్ హసన్ను వివాహం చేసుకుని హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. భర్త అమీర్ హసన్ హైదరాబాద్ సంస్థానంలో ఉన్నతాధికారి, ఆయన ఉద్యోగరీత్యా వివిధ ప్రాంతాలను పర్యటిస్తున్నందున ఆమె కూడా ఆయా ప్రాంతాలలోని ప్రజల భాషల పట్ల అమితా సక్తి చూపుతూ ఉర్దూతోపాటు ఆంగ్లం, మరాఠీ, కన్నడ, గుజరాతీ, భాషలే కాకుండా తెలుగును కూడా నేర్చు కున్నారు. ఈ సందర్భంగా మహిళల దుస్థితిని గమనించిన ఆమె ముఖ్యంగా బాలికల అభ్యున్నతికి కృషి ఆరంభించారు. బాలికల లో విద్యాభివృద్ధికై పలు పాఠశాలలు పెట్టించడానికి కృషి సల్పారు. జాతీయోద్యమంలోనూ చురుకైన పాత్ర పోషించారు. 1920లో మహాత్ముని పిలుపు మేరకు హైదరాబాద్ నగరంలోని త్రూప్ బజార్లోని తమ నివాసంలో విదేశీ వస్త్రదహనం గావించారు. ఖిలాఫత్ -సహాయనిరాకరణ ఉద్యమాల లోనూ చురుకైన పాత్ర వహించారు. ఆజాద్ హింద్ ఫౌజ్ యోధులు అరెస్టులకు గురైనప్పుడు వారి విడుదల కోసం సరోజినీ నాయుడి సహకారంతో ఎనలేని కృషి సల్పారు. నాయకులు అందరూ ఆమెను ఆప్యాయంగా 'అమ్మా జాన్' అని సంబోధించే వారు. ఈమె 1970లో కన్నుమూశారు.

మహిళలపై దాడుల నిరోధానికి కఠిన చట్టాలు

పాఠశాల స్థాయిలోనే నైతిక విలువలు నేర్పాలి : గాంధీలో డాక్టర్ల నిరసనకు మంత్రి సీతక్క సంఘీభావం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మహిళల భద్రతకు మరింత కఠిన చట్టాలను రూపొందించి అమలు చేస్తామని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. అదే సమయంలో దాడుల నిరోధానికి దీర్ఘకాలిక ప్రణాళికలు అవసరమని అభిప్రాయ పడ్డారు. తరగతి గదుల నుంచే పిల్లలకు నైతిక విలువలను, మహిళల పట్ల గౌరవాన్ని పెంపొందించాలని సూచించారు. అందుకోసం తమ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఇందులో భాగంగా పాఠ్యాంశాల్లో అవసరమైన మార్పులు తీసుకురావాల్సిన అవసరముందని సూచించారు. కోల్‌కతాలో మహిళా వైద్యురాలిపై లైంగిక దాడి ఘటనకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా జూనియర్ డాక్టర్లు, సీనియర్ రెసిడెంట్ డాక్టర్లు చేపట్టిన నిరసనకు ఆమె సంఘీభావం ప్రకటించారు. ఇందులో భాగంగా బుధవారం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోల్‌కతా ఘటన తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని తెలిపారు. దేవతతో సమానమైన మహిళలు ఇప్పుడిప్పుడే బయటికి వస్తున్నారని చెప్పారు. వైద్యురాలిపై లైంగికదాడి హేయమైన ఘటన అంటూ అలాంటివి మహిళలను మళ్లీ మధ్య యుగాలకు తీసుకెళ్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. వైద్యులకు తాము అండగా నిలబడతామని హామీ ఇచ్చారు. తప్పు చేసిన వారు ఎవరైనా సరే..ఉపేక్షించకూడదని చెప్పారు. మహిళల భద్రత గురించి సమాజంలో ప్రతి ఒక్కరి ఆలోచన మారాలనీ, ఆ దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. తమ ప్రభుత్వం డ్రగ్స్ నియంత్రణకు కట్టుబడి పని చేస్తున్నట్టే మహిళల భద్రత కోసం పూర్తిస్థాయిలో కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. పని ప్రదేశాల్లో మహిళల భద్రత కోసం కషి చేయాలని కోరారు. మహిళలపై దాడులు చేస్తే కఠినాతి కఠినమైన శిక్షలు పడతాయన్ని భయం, భక్తి ఉండాలనీ, అలా ఉన్నప్పుడే అఘాయిత్యాలు నివారించబడతాయని ఆమె అభిప్రాయపడ్డారు.

ఐరాసలో భారత రాయబారిగా పర్వతనేని హరీశ్



న్యూఢిల్లీ: తెలుగు వ్యక్తి అరుదైన ఘనత సాధించారు. ఐఎఫ్ఎస్ అధికారి పర్వతనేని హరీశ్ న్యూయార్క్‌లోని ఐక్యరాజ్య సమితిలో భారత రాయబారి/ శాశ్వత ప్రతినిధిగా నియమితులయ్యారు. ఈ విషయాన్ని కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఓ ప్రకటనలో వెల్లడించింది. 1990 క్యాడర్ ఐఎఫ్ఎస్ బ్యాచ్‌కు చెందిన హరీశ్.. ప్రస్తుతం జర్మనీలో భారత రాయబారిగా పనిచేస్తున్నారు. త్వరలోనే ఆయన బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. రుచిరా కాంభోజ్ జూన్‌లో పదవీ విరమణ చేసినప్పటి నుంచి ఈ పదవి ఖాళీగా ఉన్న సంగతి తెలిసిందే. 2021 నవంబర్ 6న జర్మనీలో భారత రాయబారిగా బాధ్యతలు చేపట్టిన ఆయన.. అప్పట్నుంచి ఆ పదవిలోనే కొనసాగుతున్నారు. అంతకముందు వివిధ పనిచేశారు. పర్వతనేని హరీశ్ హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్శిటీలో మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తి చేశారు. గోల్డ్‌మెడల్ కూడా సాధించారు. ఆ తర్వాత ఆయన ఐఐఎం కలకత్తాలో విద్యనభ్యసించారు. ఆయనకు భార్య నందిత, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఎమ్మెల్సీల నియామకాన్ని నియంత్రించలేం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణలో ఎమ్మెల్సీల నియామకానికి సంబంధించి గవర్నర్ నామినేట్ చేయడాన్ని నియంత్రించలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. గవర్నర్ నిర్ణయాన్ని ఆపలేమని పేర్కొంది. అయితే, తెలంగాణలో ఎమ్మెల్సీల నియామకానికి సంబంధించి హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై సుప్రీంకోర్టు స్టే ఇచ్చింది. తుది తీర్పునకు లోబడే తదుపరి నియామకాలు ఉండాలని పేర్కొంది. తెలంగాణ హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ శాసనమండలికి సభ్యులను గవర్నర్ నామినేట్ చేయకుండా ఆదేశాలు ఇవ్వాలని బీఆర్ఎస్ నేతలు దాసోజు శ్రవణ్ కుమార్, కుర్రా సత్యనారాయణలు దాఖలు చేసిన పిటిషన్‌ను బుధవారం జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ ప్రసన్న బాలచంద్ర వరాలేలతో కూడిన ధర్మాసనం విచారించింది. కోర్టు తుది ఆదేశాలు ఇచ్చే వరకూ హైకోర్టు ఆదేశాలపై స్టేటస్ కో ఇవ్వాలని పిటిషనర్ల తరపు సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ కోరారు. అయితే, ధర్మాసనం హైకోర్టు తీర్పుపై స్టే ఇస్తామనగా దీనికి సిబల్ అభ్యంతరం వ్యక్తంచేశారు. "అభ్యంతరం ఎందుకు ? మీరు ఆదేశాలకు వ్యతిరేకంగా వచ్చారు కదా మేం స్టే ఇస్తాం"అని ధర్మాసనం ప్రశ్నించింది. అలా చేయడం వల్ల మళ్లీ నూతన సిఫారసులు చేసే అవకాశం ఉందని సిబల్ తెలిపారు. "శాసనమండలిలో పిటిషనర్ల నియామకాన్ని గవర్నర్ నిరాకరించినందున దావా వేయడానికి వారు అర్హులు. పిటిషనర్లను కాకుండా గవర్నర్ వేరే వారిని నియమించే అవకాశం ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం సిఫారసు చేసిన ఇద్దరు వ్యక్తుల నియామక గెజిట్‌ను కూడా హైకోర్టు రద్దు చేసింది. ప్రస్తుతం అదే వ్యక్తుల్ని నియమించాలని కాంగ్రెస్ ప్రభుత్వం యత్నం చేస్తోంది" అని సిబల్ వాదనలు వినిపించారు. స్టేటస్ కో ఇవ్వడం వల్ల ఉపయోగమేమీ లేదని జస్టిస్ విక్రమ్ నాథ్ తెలిపారు. ఇవ్వకపోతే కొత్త వారిని నియమించ డమో, దీనికి కాలపరిమితి అయిపోతుందనో లేదా ఇంకేదైనా చెబుతారని సిబల్ తెలిపారు. "మరిన్ని చెప్పనిద్దాం. మీకు పోటీగా మరింత మంది సీనియర్ న్యాయవాదులు ఉన్నారు కదా, వారిని కూడా రానిద్దాం. ఏం చెబుతారో చూద్దాం" అని విక్రమ్‌నాథ్ వ్యాఖ్యానించారు. సిబల్ పట్టుబడుతున్నారని యధాతథ స్థితి కొనసాగించాలంటే, ఎవరి ద్వారా అని జస్టిస్ విక్రమ్‌నాథ్ మళ్లీ ప్రశ్నించారు. గవర్నర్ ద్వారా అని సిబల్ సమాధానమివ్వగా, అలా అయితే హైకోర్టు తీర్పుపై స్టే ఇస్తే ఏమవుతుందని న్యాయామూర్తి పేర్కొన్నారు. తీర్పును నిలిపిస్తే మరో సమస్య వస్తుందని అప్పుడు పిటిషనర్‌ను నియమించాల్సి వచ్చే అవకాశం ఉంటుందని సిబల్ ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. హైకోర్టు ఆదేశాలకు పిటిషనర్ వ్యతిరేకం కాబట్టి హైకోర్టు తీర్పుపై స్టే ఇస్తామని న్యాయమూర్తి తెలిపారు. అనంతరం "కోర్టు తుది ఉత్తర్వులు వచ్చే వరకూ హైకోర్టు తీర్పుపై స్టే అమలులో ఉంటుంది" అని జస్టిస్ విక్రమ్ నాథ్ ఆదేశాలు జారీ చేశారు. అయితే, గవర్నర్ మరొకరిని నియమిస్తారని సిబల్ పేర్కొనగా, దానిని ఆపలేమని జస్టిస్ విక్రమ్‌నాథ్ స్పష్టం చేశారు. పిటిషనర్ నియామకం సరైనదే కాబట్టి నియంత్రించొచ్చని సిబల్ పేర్కొనగా, దానికి న్యాయమూర్తి అంగీకరించలేదు. గవర్నర్ తాజా నామినేషన్‌ను కోర్టు ఆపలేదని జస్టిస్ విక్రమ్‌నాథ్ స్పష్టం చేశారు. రాష్ట్ర మంత్రివర్గం సిఫారసు చేస్తే ఆ నియామకంలో గవర్నర్ పాత్ర ఉండదని సుప్రీంకోర్టులో లార్జర్ బెంచ్ ముందు కేసు పెండింగ్‌లో ఉందని సిబల్ ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లి, కేసులో విజయం సాధిస్తే న్యాయంగా పిటిషనర్ అర్హుడని తెలిపారు. సిబల్ సూచనను మంజూరు చేయలేమని ధర్మాసనం స్పష్టం చేసింది. అనంతరం విచారణ పూర్తయ్యే లోపు చేసే ప్రతి నామినేషన్ తుది తీర్పునకు లోబడి ఉండాలని ధర్మాసనం ఆదేశాలను సవరించింది. ప్రతివాదులైన రాష్ట్ర ప్రభుత్వం, గవర్నర్ తదితరులకు నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లో కౌంటరు దాఖలు చేయాలని తదుపరివిచారణ వాయిదా వేసింది.

రాష్ట్రాలకే రాయల్టీ హక్కు

(మొదటిపేజీ తరువాయి)

భూములు, క్వారీలపై పన్ను విధించే రాష్ట్రాల అధికారాన్ని సమర్థించింది.

ఖనిజాలపై పన్ను విధించడంపై కేంద్రం, రాష్ట్రాల మధ్య వివాదాన్ని పరిష్కరించింది. ఫెడరలిజం పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోకుండా పన్నులు విధించే రాష్ట్రాల హక్కులను రక్షించాలని సుప్రీం కోర్టు ధర్మాసనం నొక్కి చెప్పింది. దీంతో దీర్ఘకాలిక సమస్య పరిష్కారమైంది.

ఖనిజాలు, ఖనిజ నిక్షేపాలు గల భూములపై రాయల్టీ విధించే అధికారం కేంద్ర ప్రభుత్వానికి మాత్రమే ఉందని 1989లో సుప్రీంకోర్టు తీర్పు తేల్చింది. దీన్ని వ్యతిరేకిస్తూ కొన్ని రాష్ట్రాలు సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. ఆ పిటిషన్లపై విచారణ చేపట్టిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్ నేతృత్వంలోని జస్టిస్ హృషికేష్ రాయ్, జస్టిస్ అభయ్ ఓకా, జస్టిస్ బివి నాగరత్న, జస్టిస్ జెబి పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ ఎస్‌సి శర్మ, జస్టిస్ ఎజి మసిహ్‌తో కూడిన తొమ్మిది మంది న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం గనులు, ఖనిజాలపై రాయల్టీ విధించే అధికారం రాష్ట్రాలకే ఉందని, కేంద్రానికి ఆ హక్కు లేదని జులై 25న 8-1 మెజారిటీతో తీర్పు ఇచ్చింది.

అయితే, ఈ తీర్పును 1989 నుంచి వర్తింపజేయాలని, గనులు, ఖనిజాలపై అప్పటి నుంచి కేంద్రం నుంచి విధించిన రాయల్టీ సొమ్మును వాపస్ ఇవ్వాలని కొన్ని రాష్ట్రాలు డిమాండ్ చేశాయి. దీన్ని కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకించింది. రాయల్టీ వాపస్ ఇస్తే ఒక్క ప్రభుత్వ రంగ కంపెనీలే రూ. 70 వేల కోట్లు తిరిగి చెల్లించాల్సి వస్తుందని, అలా చేయడం ప్రభుత్వ రంగ సంస్థ (పీఎస్‌యూ)లకు తీరని దెబ్బ అవుతుందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీంకు తెలిపారు. అంతేగాక.. ఖజానా ఖాళీ అయి, పౌరులపై అధిక ధరల భారం పడుతుందని వివరించారు. తీర్పును గత నెల 25 నుంచి వర్తింపజేయాలని అభ్యర్థించారు.

దీనిపై ఇటీవల వాదనలు విన్న ధర్మాసనం తీర్పును రిజర్వు చేసింది. తాజాగా కేంద్రం అభ్యర్ధనను తిరస్కరిస్తూ తాజా ఉత్తర్వులు వెలువరించింది. ఈ తీర్పుతో ఒడిశా, జార్ఖండ్, బెంగాల్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ వంటి రాష్ట్రాలకు భారీ ప్రయోజనం చేకూరనుంది.

తెలంగాణ నుంచి రాజ్యసభకు అభిషేక్ మను సింఘ్వీ

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణ నుంచి రాజ్యసభ ఉప ఎన్నిక నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ప్రముఖ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ పేరును ఆ పార్టీ అధిష్టానం ఖరారు చేసింది. ఈ ఉప ఎన్నికలో అభిషేక్ మను సింఘ్వీని బరిలో నిలపాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నిర్ణయించారని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ వెల్లడించారు. ఈ మేరకు బుధవారం కెసి వేణుగోపాల్ ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్‌కు ఉన్న బలం బట్టీ అభిషేక్ మను సింఘ్వీ ఎన్నిక లాంఛనమే.తెలంగాణ నుంచి తనను రాజ్యసభకు పంపాలని కాంగ్రెస్ పార్టీ తీసుకున్న నిర్ణయంపై అభిషేక్ సింఘ్వీ ఎక్స్ వేదికగా స్పందించారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేతోపాటు ఆ పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతోపాటు ఆ పార్టీలోని సీనియర్లందరికీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. గతంలో హిమాచల్‌ప్రదేశ్ నుంచి అభిషేక్ మను సింఘ్వీ రాజ్యసభకు వెళ్లారు. ఆయన పదవి కాలం ఈ ఏడాది ఫిబ్రవరిలో ముగియడంతో మళ్లీ హిమాచల్ ప్రదేశ్ నుంచే పోటీ చేశారు. అయితే అక్కడ కాంగ్రెస్ ఎమ్మెల్యేలే హ్యాండ్ ఇచ్చారు. కాంగ్రెస్, స్వతంత్ర ఎమ్మెల్యే బీజేపీకి ఓటు వేశారు. దీంతో ఆ ఎన్నికలో స్వల్ప మెజార్టీతో ఓటమి చెందారు. హిమాచల్‌ప్రదేశ్‌లో భంగపడిన అభిషేక్ మను సింఘ్వీ, తెలంగాణలో బయటపడనున్నారు.

ప్రపంచంతోనే పోటీ (మొదటిపేజీ తరువాయి)

ప్రపంచవ్యాప్తంగా కాగ్నిజెంట్‌కు 3.46 లక్షల మంది ఉద్యోగులు ఉంటే, దానిలో భారతదేశంలో 2.40 లక్షల మంది, వారిలో 57 వేల మంది హైదరాబాద్‌లోనే ఉన్నారని వివరించారు. దానిలోనూ 39 శాతం మంది మహిళలే ఉన్నారని చెప్పారు. హైదరాబాద్‌తో తమది వ్యూహాత్మకమైన పెట్టుబడి అనీ, స్థానికంగా ప్రతిభావంతులైన యువతకు ఉపాధి కల్పిస్తూ, ప్రపంచవ్యాప్తంగా ఏఐ, ఎంఎల్, డేటా ఇంజినీరింగ్, ఐవోటీలో కట్టింగ్ ఎడ్జ్ సమస్యలకు ఈ కేంద్రం పరిష్కారం చూపిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డితో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సీఎం బృందానికి ఘన స్వాగతం

(మొదటిపేజీ తరువాయి)

దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణరావు, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ తదితరులున్న సంగతి విదితమే. అమెరికా, దక్షిణ కొరియాల్లో పర్యటించిన వచ్చిన వీరికి పలువురు ఎంపీలు, ఉన్నతాధికారులు పుష్పగుచ్ఛాలిచ్చి స్వాగతం పలికారు.

కోల్‌కతా హత్యాచార ఘటనపై దర్యాప్తు షురూ

కోల్‌కతా : ఆర్జీ కార్ మెడికల్ కాలేజీని సందర్శించిన సీబీఐ, ఎఫ్ఎస్-ఎల్ బృందం దేశవ్యాప్తంగా కలకలం రేపిన కోల్‌కతా ఆర్జీ కార్ మెడికల్ కాలేజీ ట్రెనీ డాక్టర్ హత్యాచార ఘటనపై దర్యాప్తు వేగవంతమైంది. ఈ కేసును హైకోర్టు ఆదేశాలతో సీబీఐకి అప్పగించడంతో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. కోల్‌కతా హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో ఈ కేసు దర్యాప్తును సీబీఐ చేపట్టింది. దర్యాప్తు బాధ్యతను స్వీకరించిన వెంటే సీబీఐ ఢిల్లీ నుంచి ప్రత్యేక వైద్య, ఫోరెన్సిక్ బృందాన్ని ఘటనా ప్రాంతానికి పంపింది. ఇక కోల్‌కతాలోని ఆర్‌జీ కార్ మెడికల్ కాలేజీ ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారం కేసు దేశ వ్యాప్తంగా పెనుదుమారం రేపుతున్నది. ఈ కేసు దర్యాప్తును కోల్‌కతా పోలీసుల నుంచి సీబీఐకి బదిలీ చేయాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఘటన జరిగి ఐదు రోజులు అయినప్పటికీ, దర్యాప్తులో ఎలాంటి పురోగతి లేదని పేర్కొన్నది. కేసు డైరీని సాయంత్రంలోగా, ఇతర డాక్యుమెంట్లను బుధవారం ఉదయం 10 గంటల్లోగా సీబీఐకి అప్పగించాలని ఆదేశించింది.ఈ ఉదంతంపై కాంగ్రెస్ నేత పవన్ ఖేరా స్పందించారు. నిర్భయ ఘటన అనంతరం కఠిన చట్టాలు తీసుకురావడంతో పరిస్థితి మెరుగుపడుతుందని అనిపించినా, కథువా, ఉన్నావ్, హత్రాస్, లలిత్ పూర్ వంటి ఘటనలు దిగ్భ్రాంతి కలిగించాయని, దేశవ్యాప్తంగా ఇలాంటి ఘటనలు వెలుగుచూడటం విచారకరమని అన్నారు. కోల్‌కతా ఘటన దారుణ ఉదంతమని ఆందోళన వ్యక్తం చేశారు. డాక్టర్లు ప్రజలను ఆరోగ్యంగా ఉండేలా శ్రమిస్తుంటే మనం వారి భద్రతను కాపాడలేకపోతున్నామని వ్యాఖ్యానించారు.

మధ్యంతర బెయిల్ ఇవ్వలేం

కేజ్రీవాల్ కేసులో సుప్రీం స్పష్టం

సీబీఐకి నోటీసులు జారీ

23కు విచారణ వాయిదా



నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

మద్యం కుంభకోణానికి సంబంధించిన సీబీఐ కేసులో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు బుధవారం చుక్కెదురైంది. ఆయనకు మధ్యంతర బెయిల్ ఇవ్వలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. సీబీఐ అరెస్టుపై కేజ్రీవాల్ పిటిషన్‌ను పరిశీలించేందుకు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం అంగీకరించింది. ఈ మేరకు ఆయన పిటిషన్‌పై సీబీఐకి కోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ అంశంపై సీబీఐ ప్రతిస్పందన తెలపాలని కోరుతూ కేసు విచారణను ఈ నెల 23కి వాయిదా వేసింది. కేజ్రీవాల్ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. ఇటువంటి "ప్రత్యేక అరెస్టును బీమా అరెస్టు అని పిలుస్తారు. 2023 ఏప్రిల్ లో కేజ్రీవాల్‌ను సీబీఐ విచారించిన తర్వాత, ఈ ఏడాది మార్చిలో డైరెక్టరేట్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఈడీ) ఆయనను అరెస్టు చేసింది. ఈడీ కేసులో బెయిల్ ఆదేశాలు కూడా పొందారు. మరికొన్ని గంటల్లో విడుదలకానున్న సమయంలో సీబీఐ అరెస్ట్ చేసింది. ఈ అరెస్టుకు ఎలాంటి కారణం లేదని, మే 10న మనీలాండరింగ్ నిరోధక కేసు (పిఎమ్ఎల్ఎ)లో ఆయనకు మధ్యంతర బెయిల్ లభించింది. తర్వాత జూలైలో సుప్రీంకోర్టు నుంచి మధ్యంతర బెయిల్ లభించింది. సీబీఐ కేసులో కింది కోర్టు కూడా బెయిల్ మంజూరు చేసింది. ఇలా మూడు బెయిల్ ఆదేశాలు పొందారు" అని సింఘ్వీ అన్నారు.

కేరళకు హై అలర్ట్

తిరువనంతపురం : కేరళ అంతటా రానున్న 72 గంటల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయని భారత వాతవరణ శాఖ (ఐఎండీ) బుధవారం హెచ్చరించింది. రాష్ట్రంలో కొన్ని ఎంపిక చేసిన జిల్లాలకు ఐఎండి ఆరెంజ్, ఎల్లో అలర్ట్ ప్రకటించగా, రాష్ట్రంలోని మొత్తం 14 జిల్లాలను రెడ్, ఆరెంజ్ అలర్ట్‌లో ఉంచుతున్నట్లు ముఖ్యమంత్రి పినరయి విజయన్ చెప్పారు. వయనాడ్ విపత్తును దృష్టిలో ఉంచుకుని . కేరళ ప్రభుత్వం పలు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంది. హైరేంజ్‌లు, కొండ ప్రాంతాలను నిశితంగా పర్యవేక్షించాలని జిల్లా అధికార యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి ఆదేశించారు. కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉన్నందున వాయనాడ్ జిల్లాలోని పుత్తుమలలో నివాసితులను ముందస్తు జాగ్రత్తగా సహాయక శిబిరానికి తరలించినట్టు తెలిపారు.



సరికొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లే


తంగలాన్

విక్రమ్ విలక్షణ నటనకు చిరునామా. ఆయన నటించిన శివపుత్రుడు, అపరిచితుడు, నాన్న, ఐ వంటి తదితన చిత్రాలెన్నో నటుడిగా ఆయన ప్రత్యేకతను చూపించాయి. ఎప్పటికప్పుడు సరికొత్తగా ప్రేక్షకుల్ని అలరించే ఆయన 'తంగలాన్'తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. ఈ చిత్రాన్ని దర్శకుడు పా రంజిత్ రూపొందించారు. నీలమ్ ప్రొడక్షన్స్‌తో కలిసి స్టూడియో గ్రీన్ ఫిలింస్ బ్యానర్ పై నిర్మాత కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మించారు. ఈ సినిమాలో పార్వతీ తిరువోతు, మాళవిక మోహనన్ హీరోయిన్లుగా నటించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నేడు (గురువారం) వరల్డ్‌వైడ్‌గా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో హీరో విక్రమ్ మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు. నేను నటించిన శివపుత్రుడు, అపరిచితుడు, నాన్న, ఐ వంటి మూవీస్ లాగే తంగలాన్ ఒక డిఫరెంట్ మూవీ. ఇదొక ఎమోషనల్ మూవీ. రా కంటెంట్‌తో ఉంటుంది. ఈ స్క్రిప్ట్ చేసిన తర్వాత రంజిత్ ఒక ట్రాన్స్‌లోకి వెళ్లిపోయాడు. సినిమా గ్రామర్ పాటించని సినిమా ఇది. పాటలు, ఫైట్స్, ఇంటర్వెల్ బ్లాక్, క్లైమాక్స్ ఇలా పా.రంజిత్ డిజైన్ చేయలేదు. ఈ సినిమా నాకొక బ్యూటిఫుల్ ఎక్స్‌పీరియన్స్. నేను ఇప్పటిదాకా ఇలాంటి మూవీ చేయలేదు. ఇంత కష్టపడి చేయలేదు. దానికి కారణం..మా డైరెక్టర్ పా.రంజిత్. ఆయన నా దగ్గరకు ఒక కమర్షియల్ కథ తీసుకురాలేదు. పా.రంజిత్ కెరీర్‌లో కమర్షియల్ మూవీస్‌తో పాటు ఆర్టిస్టిక్ మూవీస్ చేస్తూ బ్యాలెన్స్‌గా కెరీర్ సాగిస్తున్నారు.
















Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886